Crime News
దీ క్రైమ్ న్యూస్
తెలుగు దినపత్రిక

బుధవారం, అక్టోబర్ 22, 2025 | సంపుటి - 20 | సంచిక 40 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.

### దేశవ్యాప్తంగాఅంబరాన్నంటిన
# దీపావళి వేడుకలు


2

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా దీపావళి వేడుకలు అంబరాన్నంటాయి. దీపావళి సందర్భంగా లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు చేశారు. ఇండ్లు, దుకాణ సముదాయాల్లో విశేషంగా లక్ష్మీపూజలు జరిగాయి. దేశ రాజధాని ఢిల్లీతో పాటు ముంబయి, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా యావత్ దేశ వ్యాప్తంగా వివిధ నగరాల్లో బాణాసంచాల మోతమోగింది. దీపావళి సందర్భంగా గత రెండుమూడు రోజులుగా బాణాసంచా దుకాణాలు కిటకిటలాడాయి.

## పోలీస్ అంటేనే
# నమ్మకం, భరోసా

### సైబర్ నేరాలపై పోలీసుల కృషి ప్రశంసనీయం

## విధి నిర్వహణలో ఎందరో పోలీసుల ప్రాణార్పణం

- అమరులను సంస్మరించుకోవడం మన విధి
- అమరుల కుటుంబానికి అన్ని విధాలుగా అండ
- నిజామబాద్ కానిస్టేబుల్ ప్రమోద్ కుటుంబానికి కోటి పరిహారం
- మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలవాల్సిందే
- ఈగిల్ టీమ్‌తో డ్రగ్స్ ముఠా అరికడుతున్నాం
- పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భగా రేవంత్ నివాళి

**పోలీస్ అంటేనే సమాజానికి ఒక నమ్మకం, భరోసా అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. విధి నిర్వహణలో ఒక్కోసారి ప్రాణాలను సైతం పణంగా పెట్టాల్సి వచ్చినా పోలీస్ వెనుకడుగు వేయడని చెప్పారు. ఒకవైపు నెత్తురు చిందుతున్నా... మన రక్షణ కోసం ప్రాణాలు అర్పించిన వీరులు ఎందరో ఉన్నారని గుర్తు చేశారు. హైదరాబాద్ గోషామహాల్‌లో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన పోలీస్ ఫ్లాగ్ డే పరేడ్ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన నూతన పోలీస్ అమరవీరుల స్మారక స్థూపాన్ని ఆవిష్కరించారు.**





హైదరాబాద్ : విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీస్ అమర వీరులకు సీఎం నివాళులు అర్పించారు. విధి నిర్వహణలో దేశం కోసం ప్రాణాలు అర్పించిన ఎందరో పోలీసు అమర వీరులను స్మరించుకోవడం మనందరి కర్తవ్యమని సీఎం వ్యాఖ్యానించారు. ఆ బాధ్యతతోనే దేశవ్యాప్తంగా ప్రతీ సంవత్సరం 'అక్టోబరు 21'న 'పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం'గా ఘనంగా నిర్వహించుకుంటున్నామని చెప్పారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో వీరమరణం పొందిన పోలీసు అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటిస్తున్నట్లు పేర్కొన్నారు. శాంతి భద్రతలను కాపాడటంలో పోలీసులు ప్రాణాలను సైతం పణంగా పెడుతున్నారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. విధి నిర్వహణలో వీర మరణం పొందిన పోలీసులకు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా 'అమరులు వారు' పుస్తకాన్ని సీఎం ఆవిష్కరించి.. తొలి ప్రతిని డీజీపీ శివధర్‌కు అందించారు. అమరులైన పోలీసు కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది. 2లో

### ప్రమోద్ కుటుంబానికి
# అండగా ఉంటాం

- బాధిత కుటుంబానికి డిజిపి పరామర్శ
- అంకితభావంతో పనిచేసే పోలీసును కోల్పోయాం
- రియాజ్ ఎన్‌కౌంటర్‌పై విచారణ
- ఆస్పత్రిలో గాయపడ్డ ఆసిఫ్‌కు పరామర్శ




నిజామాబాద్ : ఇటీవల విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన సీసీఎస్ కానిస్టేబుల్ ప్రమోద్ కుమార్ కుటుంబానికి అండగా ఉంటామని డీజీపీ శివధర్‌రెడ్డి తెలిపారు. నిజామాబాద్‌లోని కానిస్టేబుల్ ఇంటికి వచ్చిన డీజీపీ, ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి పలువురు ఉన్నతాధికారులు.. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం మీడియా సమావేశంలో డీజీపీ మాట్లాడారు. విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేసే ఒక మంచి కానిస్టేబుల్‌ను కోల్పోయామన్నారు. ఇది పోలీస్ శాఖను తీవ్రకలవరానికి గురి చేసిందన్నారు. తరువాయి 2లో



## పత్తి కొనుగోళ్లను ప్రారంభించిన పొంగులేటి

ఖమ్మం : తెలంగాణ వ్యాప్తంగా మంగళవారం నుంచి సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభయ్యాయి. ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ ఏడాది ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌లో 317 జిన్నింగ్ మిల్లులను సీసీఐ నోట్ఫై చేసింది. ఈ నెల 24న నల్గొండ జిల్లాలో పలు సీసీఐ కేంద్రాలను మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, తుమ్మల నాగేశ్వర రావు ప్రారంభించ నున్నారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం టోల్‌ఫ్రీం నెంబర్ 18005995779 ఏర్పాటు చేసినట్లు తుమ్మల పేర్కొన్నారు.


2

### కుటుంబ పార్టీలను
## ఓడించాలి

- బిజెపి అభ్యర్థి నామినేషన్ ర్యాలీలో కిషన్ రెడ్డి

హైదరాబాద్ : జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కుటుంబ పార్టీలకు ప్రజలకు బుద్ధిచెప్పాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కోరారు. భారత రాష్ట్ర సమితి, కాంగ్రెస్, మజ్లిస్ పార్టీలు ఒక్కటై రాజకీయాలు చేస్తున్నాయన్నారు. భాజపా అభ్యర్థి లంకల దీపక్‌రెడ్డి నామి నేషన్ ర్యాలీలో కేంద్ర మంత్రి బండి సంజయ్, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు, ఎంపీలు ఈటల రాజేందర్, రఘునందన్ రావుతో కలిసి కిషన్‌రెడ్డి పాల్గొన్నారు.



### బిల్లుల కోసం సచివాలయం
# ముందు ధర్నాలు

- ధర్నా చౌక్‌గా మారిన సచివాలయం
- చిన్నకంట్రాక్టర్లకు చెల్లింపుల్లో నిర్లక్ష్యం
- ప్రజారోగ్యం విస్మరించి..బస్తీదవాఖానలపై నిర్లక్ష్యం
- మండిపడ్డ మాజీమంత్రి హరీష్ రావు

హైదరాబాద్ : పరిపాలన కేంద్రంగా ఉండాల్సిన సచివాలయం కాంగ్రెస్ పాలనలో ధర్నాచౌక్ లా మారిందని మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలంటూ మొన్న చిన్న కాంట్రాక్టర్లు సచివాలయం లోపల ధర్నా చేస్తే.. బిల్లులు చెల్లించాలంటూ ప్రభుత్వ అద్దె వాహన యజమానులు సచివాలయం ఎదుట ఆందోళన చేసిన దుస్థితి నెలకొందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వ దుర్మార్గ, అసమర్థ పాలనకు నిదర్శనమిదీ అని అన్నారు. తరువాయి 2లో

### గెలిచినవారు ఏ పార్టీలో
# ఉన్నారో?

**పార్టీ మారిన ఎమ్మెల్యేలు ఏ పార్టీలో ఉన్నారో చెప్పకోలేక పోతున్నారని.. వాళ్ళకి సిగ్గనిపించడం లేదా అని ప్రశ్నించారు. స్పీకర్ దగ్గర తాము పార్టీ మారలేదని అబద్దాలు చెబుతున్నారని ధ్వజమెత్తారు. దానం నాగేందర్ పేరు కాంగ్రెస్ పార్టీ క్యాంపెయినర్ల లిస్టులో ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. దానం నాగేందర్ ఏ పార్టీలో గెలిచారు, ఏ పార్టీకి ప్రచారం చేస్తున్నాడని నిలదీశారు. ఏఐసీసీ అంటే.. ఆల్ ఇండియా కరప్షన్ కమిటీ అని ఆగ్రహం వ్యక్తం చేశారు.**

- దానం నాగేందర్ స్టార్ కాంపెయినర్ ఎలా
- ఖైరతాబాద్ బస్తీ దవాఖానలను పరిశీలించిన కెటిఆర్
- ప్రభుత్వ వైద్యానికి సుస్తీ పట్టిందని విమర్శ



హైదరాబాద్ : తమ పార్టీలో గెలిచిన వాళ్లను తీసుకుని, వాళ్ల పార్టీ క్యాంపెయినర్ల జాబితాలో పెట్టారని మండిపడ్డారు. రేవంత్ సర్కార్ హైదరాబాద్‌ను గాలి కొదిలేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. బస్తీ దవాఖానలు ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. హైదరాబాద్‌ను రేవంత్ గాలికి వదిలేశారని చెప్పారు. ప్రజల ఆరోగ్యం మీద ప్రభుత్వం దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. పార్టీ నాయకులతో కలిసి ఖైరతాబాద్ లోని ఇబ్రహీంనగర్ బస్తీ దవాఖాన, అంగన్‌వాడీ కేంద్రాని సందర్శించారు. ఈ సందర్భంగా బస్తీ దవాఖానలో సదుపాయాలను పరిశీలించారు. 2లో


2

# బంగాళా ఖాతంలో అల్పపీడనం

- తెలంగాణలో ఐదురోజులు మోస్తరు వర్షాలు

హైదరాబాద్ : తెలంగాణలో రాగల ఐదురోజులు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. నైరుతి బంగాళాఖాతం ప్రాంతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ఇవాళ ఉదయం అల్పపీడనంగా మారిందని పేర్కొంది.



### బిజెపి అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి నామినేషన్
# వేడెక్కిన జూబ్లీహిల్స్ ప్రచారం

- దీపక్ రెడ్డికి మద్దతుగా కేంద్రమంత్రుల ప్రచారం
- జూబ్లీహిల్స కిషన్ రెడ్డి అడ్డా అన్న బండి సంజయ్

హైదరాబాద్ : జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారం వేడెక్కింది. బీజేపీ అభ్యర్థి దీపక్ రెడ్డి నామినేషన్ కార్యక్రమం సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ ర్యాలీ సభలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్రస్థాయిలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలను విమర్శించారు. బండి సంజయ్ మాట్లాడుతూ.. ఏయ్ బిడ్డా? జూబ్లీహిల్స్ కిషన్ రెడ్డి అడ్డా అంటూ ప్రారంభించిన ఆయన.. కిషన్ రెడ్డి నాయకత్వంలో బీజేపీని గెలిపించాలని ప్రజలను కోరారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు దొందూ దొందే అని ఆయన విమర్శించారు. 2లో

### ప్రజల రక్షణ కోసం
# ముందుండేది పోలీసులే

## విధి నిర్వహణ కోసం ఎందరో కుటుంబాలకు దూరం

- సమాజంలో శాంతిభద్రతలతోనే పెట్టుబడుల రాక
- పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల కఠిన వైఖరి
- ఈగిల్, శక్తి విభాగాల ఏర్పాటుతో ఆధునికంగా పోలీస్ శాఖ
- డ్రగ్స్,గంజాయి, ఎర్రచందనం ముఠాల ఆటకట్టేల కృషి
- పోలీస్ అమరుల దినోత్సవం సందర్భంగా చంద్రబాబు నివాళి



అమరావతి : ప్రజల రక్షణ కోసం ముందుండేది పోలీసులేనని ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు అన్నారు. విధి నిర్వహణ కారణంగా తమ కుటుంబంతో సరిగా గడపలేని పరిస్థితి వారిదని చెప్పారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని 6వ బెటాలియన్‌లో పోలీసు అమరవీరుల సంస్మరణ దినం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఎం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత పోలీసు అమరవీరుల స్తూపం వద్ద సీఎం నివాళులర్పించారు. అనంతరం పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. తరువాయి 2లో


2

### జూబ్లీహిల్స్ ప్రచారం కోసం
## స్టార్ కాంపెయినర్లు

- 40మంది పేర్లు విడుదల చేసిన పార్టీ
- జాబితాలో మాజీ సిఎం కెసిఆర్ పేరు

హైదరాబాద్ : జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నిక ప్రచారం కోసం భారత రాష్ట్ర సమితి బిఆర్ఎస్ పార్టీ తరపున మొత్తం 40 మంది స్టార్ క్యాంపెయినర్లకు తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం ఆమోదం తెలిపింది.

# రియాజ్ ఎన్‌కౌంటర్‌పై సిట్టింగ్ జడ్జితో విచారణ

## తెలంగాణ మానవ హక్కుల వేదిక డిమాండ్



హైదరాబాద్,అక్టోబర్ 21 : నిజామాబాద్‌లో కానిస్టేబుల్ ప్రమోద్ హత్య కేసులు నిందితుడు రియాజ్ ఎన్‌కౌంటర్‌పై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని తెలంగాణ మానవ హక్కుల వేదిక డిమాండ్ చేసింది. ఈ ఎన్‌కౌంటర్‌ను హైకోర్టు, తెలంగాణ మానవ హక్కుల కమిషన్ సుమోటోగా తీసుకుని న్యాయ విచారణ జరపాలని కోరింది. చట్టాన్ని ఉల్లంఘించిన వారు ఎంతటి వారైనా, వారికి శిక్ష పడేలా చేయాలని మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆత్రం భుజంగరావు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్. తిరుపతయ్య డిమాండ్ చేశారు. ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న పోలీసులను తక్షణమే సస్పెండ్ చేయాలని, వారిపై హత్యా నేరం మోపాలన్నారు. 'నిజామాబాద్ ప్రభుత్వ దవాఖానలో కానిస్టేబుల్ తుపాకీ గుంజుకుని, అతనిపై తిరగబడ్డాడనే పేరుతో షేక్ రియాజ్‌ని పోలీసులు చంపేయటం బూటకపు ఎన్‌కౌంటర్ మాత్రమే కాక, ఇది తెలంగాణా పోలీసు శాఖలో పెరుగుతున్న హింసాప్రవృత్తికి నిదర్శనం అన్నారు. ఈ నెల 17న బైకులు, చైన్ స్నాచింగ్ లాంటి దొంగతనాలకు పాల్పడుతున్న రియాజ్‌ని అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించే క్రమంలో.. బైక్ నడుపుతున్న కానిస్టేబుల్ ప్రమోద్‌ను కత్తితో పొడిచి, అక్కడి నుండి పారిపోయాడు. ఊహించని ఈ దాడి కారణంగా కానిస్టేబుల్ అక్కడికక్కడే చనిపోయాడు. ఆ కానిస్టేబుల్ న్యాయంగా డ్యూటీ నిర్వహిస్తుండగా, అతనిపై జరిగిన దాడిలో చనిపోవటం చాలా బాధాకరం. హంతకునికి ఖచ్చితంగా శిక్ష పడాల్సిందే. అయితే ఆ శిక్షను ఎవరు అమలు చేయాలనేదే నాగరిక సమాజంలో కీలకమైన విషయం. నిందితుడు ఎట్టి పరిస్థితుల్లోనూ శిక్ష నుంచి తప్పించుకోకుండా పోలీసులు తగిన సాక్ష్యాధారాలతో అతని నేరాన్ని నిరూపించి, చట్ట ప్రకారం కోర్టు ద్వారా శిక్ష పడేలా చేయటానికి అవకాశాలున్నాయి. కానీ, అలా కాకుండా పోలీస్ వ్యవస్థ రియాజ్‌ను హత్య చేయాలని ముందే నిర్ణయించుకున్నట్టుగా అనిపిస్తున్నది. ముందస్తు పథకం ప్రకారమే పోలీసుల మీద మరొకరు తిరుగుబాటు చేయకుండా, రియాజ్ ఉదంతం ఒక బెదిరింపుగా ఉండాలని చేసిన కౌంటర్ హత్య అని మా అనుమానం. తెలంగాణ పోలీసుల మానసిక వైఖరి, వారి ఎన్‌కౌంటర్ల చరిత్రలే ఇందుకు ఆధారాలు అన్నారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగ విలువలు అంటే తెలియని సామాన్య ప్రజలు ఈ విషయంలో పోలీసులకు వత్తాసు పలుకుతుండవచ్చు. కానీ, ఒక సమాజం నియమబద్ధంగా నడావలా లేక, కంటికి కన్ను, పంటికి పన్ను అనే ఆటవిక సమాజం లాగా నడవాలా అనేది మెజారిటీ మద్దతు ఉందనే పేరుతో నడవాల్సిన వ్యవహారం కాదు. ఒక ఆసుపత్రి నాలుగో అంతస్తులో, చుట్టుపక్కల వేరెవరు రోగులూ, వారి బంధువులూ లేకుండా ఉంచిన గదిలో జరిగిన ఈ హత్య నిజమైన ఎన్‌కౌంటర్ కాదని, బూటకపు ఎన్‌కౌంటర్ అని నిరూపించడానికి మృతుని బంధువులకు గానీ, హక్కుల సంఘాలకు గానీ, స్వచ్ఛంద సంస్థలకు గానీ ఎటువంటి అవకాశం ఉండదు. కాబట్టి రూల్ ఆఫ్ లాను, కోర్టులను, రాజ్యాంగ నియమాలని కాపాడటమా, లేక 'వారిలో ఒక మనిషి చనిపోతే వారు ఊరుకుంటారా?' అని సరిపెట్టటమా అనేది ఈరోజు ప్రభుత్వం, రాష్ట్ర, జాతీయ మానవ హక్కుల కమిషన్లు, హైకోర్టు, సుప్రీంకోర్టుల ముందూ ఉన్న ప్రశ్న అని మానవ హక్కుల వేదిక నేతలు అన్నారు.

# నేడు సదర్ ఉత్సవ వేడుకలు

## నారాయణగూడ ప్రాంతంలో ట్రాఫిక్ ఆంక్షలు

హైదరాబాద్అక్టోబర్21 : వాహనదారులకు హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు కీలక సూచన చేశారు. సదర్ ఉత్సవ మేళా సందర్భంగా నగరంలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు తెలిపారు. నారాయణగూడలోని వైఎంసిఎ దగ్గర బుధవారం రాత్రి 7 గంటల నుంచి తెల్లవారుజామున 4 గంటల వరకు సదర్ ఉత్సవ మేళా జరగనున్న నేపథ్యంలో ట్రాఫిక్ అమల్లో ఉంటాయని వెల్లడించారు. రామ్‌కోటి, లింగంపల్లి, నారాయణగూడ, బర్కత్‌పురా, విజయనగరం, హిమాయత్‌నగర్ ప్రాంతాల్లో వాహనాల రాకపోకలు తాత్కాలికంగా మళ్లింపులు చేపట్టనున్నట్లు తెలిపారు. సదర్ మేళాకు వచ్చే వారు తమ వాహనాలను కేశవ మెమోరియల్ కళాశాల మైదానంలో పార్క్ చేయాలని పోలీసులు సూచించారు. వాహనదారులు సహకరించి ప్రత్యామ్నాయ మార్గాలు ఉపయోగించుకోవాలి– ట్రాఫిక్ పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# నల్లగొండలో మత్తు మాత్రల దందా

## పోలీసుల దాడిలో పలువరి అరెస్ట్

నల్లగొండ,అక్టోబర్21 : నల్గొండలో అక్రమంగా మత్తు మాత్రలు విక్రయిస్తున్న ముఠా గుట్టురట్టయింది. ఈగల డ్రగ్ కంట్రోల్? బోర్డు అధికారుల తోపాటు నల్లగొండ పోలీసులు జాయింట్ ఆపరేషన్ నిర్వహించి మత్తు మాత్రలను విక్రయిస్తున్న ముఠాను పట్టుకున్నారు.నల్లగొండ జిల్లాలో జోరుగా మత్తు గోలీల అక్రమ దందా సాగుతోంది. ఎలాంటి ప్రిస్క్రిప్షన్ లేకుండా మత్తు మాత్రలను విక్రయిస్తున్న ముఠాతోపాటు కొనుగులు చేసిన వారిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి భారీగా మత్తు మాత్రలను స్వాధీనం చేసుకున్నారు. జిల్లాలో తొర్రూర్ మండలం కేంద్రంలోని ఓ మెడికల్ షాపునుంచి కొనుగోలుచేసి అక్రమంగా విక్రియస్తున్నట్లు డ్రగ్ కంట్రోల్ అధికారులు గుర్తించారు. మంగళవారం నల్లగొండ పోలీసులు జరిపిన దాడిలో టాబ్లెట్లను అక్రమంగా విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ప్రధాన పెడ్లర్ మద్ జబినుల్లా, మెడికల్ షాపు ఓనర్ దారం కృష్ణసాయితోపాటు 8 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరో 9మంది పరారీలో ఉన్నారు. వీరిపై కేసు నమోదు చరేశారు. మహ్మద్ జబీనుల్లా అనే వ్యక్తి గత కొంత కాలంగా మత్తు మాత్రలకు బానిపై కొనుగోలు, అమ్మకాలు జరుపుతున్నట్లు పోలీసులు గుర్తించారు.

# లక్ష్మీ నాయుడి హత్య బాధాకరం

**ఆర్థిక లావాదేవీల వల్లే లక్ష్మీ నాయుడి హత్య**

**నిందితుడికి బెయిల్ రాకుండా శిక్షపడేలా చేస్తాం**

**హోంమంత్రి వంగలపూడి అనిత వెల్లడి**

**భీమవర్ డీఎస్పీపై డిప్యూటి సిఎం ఆరాలో తప్పలేదని వ్యాఖ్య**

అమరావతి,అక్టోబర్21 : కందుకూరులో లక్ష్మీ నాయుడి హత్య బాధాకరం అని హోంమంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు ఆదేశాలతో లక్ష్మీ నాయుడు కుటుంబాన్ని పరామర్శించాం అని తెలిపారు. ఆర్థిక లావాదేవీల వల్లే లక్ష్మీ నాయుడి హత్య జరిగిందని, నిందితుడికి బెయిల్ రాకుండా శిక్షపడేలా చేస్తాం అని చెప్పారు. 'కందుకూరులో లక్ష్మీ నాయుడు హత్య బాధాకరం. సీఎం చంద్రబాబు ఆదేశాలతో మంత్రి నారాయణతో కలిసి తిరుమలశెట్టి లక్ష్మీ నాయుడు కుటుంబాన్ని పరామర్శించాము. స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కూడా ఉన్నారు. కుటుంబ నేపథ్యం అంతా చూశాం. హత్య కేవలం ఆర్థిక లావాదేవీల కారణంగానే జరిగింది. మంచి స్నేహితులుగా ఉండి వ్యాపారం చేసుకున్నారు. చిన్న ఆర్థిక లావాదేవీలతో వీరి మధ్య విభేదాలు వచ్చాయి. విభేదాలు హత్యకు దారి తీసింది. కార్ దాడితో ఇంత దారుణంగా హత్య చేసే పరిస్థితి రాకూడదు. నిందితుడికి శిక్ష పడాలని లక్ష్మీ నాయుడు భార్య కోరారు. నిందితుడికి బెయిల్ రాకుండా శిక్ష పడేలా చూస్తాం. హత్య కేసు విచారణ వేగంగా జరిగేలా ఫాస్ట్ ట్రాక్ కోర్టుకు అప్పగించాం' అని హోంమంత్రి తెలిపారు. డిప్యూటీ సీఎంగా పవన్ కళ్యాణ్ గారు డీజీపీని నివేదిక అడగడంలో ఎలాంటి తప్పులేదు అని, తనకు వచ్చిన సమాచారాన్ని పవన్ వెల్లడించడంలో తప్పేముందని హోంమంత్రి అనిత ప్రశ్నించారు. డిప్యూటీ సీఎంగా పవన్ కల్యాణ్ గారు డిఎస్పీపై నివేదిక కోరవచ్చు, అందులో తప్పేంటి. భీమవరం డిఎస్పీ వ్యవహార శైలికి సంబంధించి నివేదిక హోంశాఖ దగ్గర ఉంది. డిప్యూటీ సీఎంగా పవన్.. డీజీపీని నివేదిక అడగడంలో ఎలాంటి తప్పు లేదు. తనకు వచ్చిన సమాచారాన్ని పవన్ వెల్లడించడంలో తప్పేముంది. కూటమి ప్రభుత్వంలో శాఖల మధ్య సమన్వయంతో పనిచేస్తున్నాం. మాకు మాకు ఎలాంటి ఇగోలు లేవు. డీఎస్పీ జయసూర్యకు సంబంధించిన నివేదిక మా వద్ద ఉంది. తగిన చర్యలు తీసుకుంటాం' అని హోంమంత్రి వంగలపూడి అనిత చెప్పారు.




# అబద్దాల ప్రచారంలో ఆరితేరిన బిఆర్ఎస్

## కేబినేట్‌లో జరగని విషయాలపై దుష్ప్రచారం

## హరీష్ రావు తీరుపై మండిపడ్డ మంత్రి అడ్లూరి

హైదరాబాద్,అక్టోబర్ 21 : కేబినెట్ మంత్రులను దండుపాళ్యం బ్యాచ్ అంటారా అంటూ బిఆర్ఎస్ నేత హరీష్ రావుపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఫైర్ అయ్యారు. కేబినెట్లో జరగని విషయాలను జరిగాయని ప్రచారం చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. అబద్ధాలకు కేరాఫ్ అడ్రస్ బీఆర్ఎస్ పార్టీ అంటూ వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు కాంగ్రెస్ సోషల్ మీడియా కార్యకర్తలపై దాదాపు 600 పైగా ఎఫ్ఐఆర్ లు నమోదు చేశారని తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులపై గత ప్రభుత్వం క్రూరంగా ప్రవర్తించిందని విమర్శించారు. రైతుల చేతులకు బేడీలు వేసిన చరిత్ర కేసీఆర్ ప్రభుత్వానిదన్నారు. పదేండ్లు మేమే రాజులం తామే మంత్రులం అన్నట్టు వ్యవహరించారని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ దుయ్యబట్టారు. ఈ మేరకు మాజీ మంత్రి హరీష్ రావుకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ఛాలెంజ్ విసిరారు. కేబినెట్‌పై బీఆర్ఎస్ నేతలు అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని.. కేబినెట్ సమావేశంలో వ్యక్తిగత అంశాలు చర్చ చేయలేదని తాను ప్రమాణం చేస్తానని మంత్రి స్పష్టం చేశారు. అలాగే ఈ వ్యవహారంపై మాజీ మంత్రికి సవాల్ విసిరారు మంత్రి. 'సిద్దిపేట వెంకటేశ్వర ఆలయంలో ప్రమాణం చేద్దామా? హరీష్ సెంటిమెంట్‌గా భావించే దేవుడిపై ప్రమాణం చేయగలడా? ఇద్దరం తడిబట్టలతో ప్రమాణం చేద్దామా? మా తల్లి తండ్రులపై ప్రమాణం చేసి నేను ప్రమాణం చేస్తాను. నేను ముఖ్యమంత్రి అనుమతి తీసుకొని వస్తాను. నువ్వు ఆరోపించిన విషయాలను నిజమని ప్రమాణం చేయగలవా? ఏ శనివారం వస్తారో హరీష్ రావు చెప్పాలని, ఛాలెంజ్‌ను హరీష్ స్వీకరించాలన్నారు. కొండా సురేఖ బిడ్డ.. మా అందరికీ బిడ్డ లాంటిదే' అంటూ మంత్రి అడ్లూరి పేర్కొన్నారు. హరీష్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

# ప్రజలను, వ్యాపారులను బెదిరించడం పేర్ని లక్ష్యం

## ఏ వ్యాపారం లేకపోయినా కోట్లు ఎలా సంపాదించావ్

## నానిపై మండిపడ్డ మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం,అక్టోబర్ 21 : వైసీపీ నేత, మాజీ మంత్రి పేర్ని నాని పై మంత్రి కొల్లు రవీంద్ర మండిపడ్డారు. 'పేర్ని నానీ.. రెడ్ లైన్ దాటేశావ్... ఇక వదిలిపెట్టం. బందరు అభివృద్ధి చూసి ఓర్వలేక వ్యక్తిగత విమర్శలు చేస్తున్నావు. నాడు ఆర్యవైశ్యులను వేధించి.. నేడు ఆర్యవైశ్యుల రాగం అందుకోవడం సిగ్గుచేటని రవీంద్ర విమర్శించారు. మచిలీపట్నంలో విలేకరులతో మాట్లాడిన మంత్రి.. వైసీపీ నేత పేర్ని నాని మీద తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దశాబ్దాలుగా వ్యాపారం చేసుకునే మా కుటుంబంపై నిందలేస్తే ఊరుకునేది లేదు.. బందరు ప్రజలకు అన్యాయం చేయాలని చూసినా, అభివృద్ధి అడ్డుకున్నా తగిన బుద్ధి చెబుతాం అంటూ మంత్రి రవీంద్ర వార్నింగ్ ఇచ్చారు. 'పేర్ని నాని రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుండి ప్రజల్ని, వ్యాపారుల్ని వేధించడమే పనిగా పెట్టుకున్నారు. కొనకళ్ల బుల్లయ్య, తాను కలిసి భూములు కొట్టేశామని చెప్పడానికి పేర్నినాని సిగ్గుపడాలి. నానీ.. దమ్ముంటే రా... రాజకీయంగా బందర్ కు నువ్వేం చేశావో. నేనేం చేశానో తేల్చుకుందాం. పిచ్చి పిచ్చిగా వాగి ప్రజల మధ్య విభేధాలు సృష్టించాలనుకుంటే బుద్ధి చెబుతాం.' అని కొల్లు రవీంద్ర హెచ్చరించారు. ఎలాంటి వ్యాపారాలు లేవని చెప్పుకునే పేర్ని నానికి ఇన్ని వేల కోట్ల ఆస్తులు ఎక్కడి నుండి వచ్చాయి..? అంటూ కొల్లు రవీంద్ర ప్రశ్నించారు. ముడా భూముల్ని అక్రమంగా తవ్వేసి లక్షల ట్రిప్పుల మట్టి తరలించడం వాస్తవం కాదా..? వీటన్నింటి పై దమ్ముంటే చర్చకు రా.. లేదంటే సైలెంట్ గా ఉండు. అంటూ కొల్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు

# పార్టీ ఫిరాయించి వచ్చినోడికి పార్టీలో ప్రాధాన్యత ఇస్తారా

## మాజీ మంత్రి జీవన్ రెడ్డి మరోమారు ఆగ్రహం

జగిత్యాల,అక్టోబర్21 : పార్టీ ఫిరాయించి వచ్చినోడికి పార్టీలో ప్రాధాన్యత ఇస్తారా..? అంటూ కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి జీవన్ రెడ్డి మరోమారు ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ ఫిరాయించినోడికి ఇప్పటికీ సభ్యత్వం లేదంటూ పరోక్షంగా జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌పై మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతం ఏంటో అర్థం కావడం లేదు.. పార్టీ ఫిరాయించినోడు చెప్తేనే పనులు చేస్తున్నారని జీవన్ రెడ్డి అన్నారు. మొదటి నుంచి ఉన్న వారిని పట్టించుకోరా..? ఆవేదన చెందారు.మంత్రులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, శ్రీధర్ బాబు తన మానసిక క్షోభకు కారణమని జీవన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక నన్ను మేకలా బలిచ్చారని వ్యాఖ్యానించారు. తనకు ఏ పదవులు అవసరం లేదని.. ఇకనుంచి కార్యకర్తలను కాపాడుకోవడమే తన పని అని అన్నారు. మొదటి నుంచి కాంగ్రెస్?లో ఉన్న వారిని పట్టించుకోరా అని ప్రశ్నించారు. పార్టీలోకి కొత్తగా వచ్చిన వారికి ప్రయారిటీ ఇస్తూ, మొదటి నుంచి ఉన్న వారిని నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ విషయంపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు నేరుగా ఫిర్యాదు చేయడం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్?గా మారింది. సంజయ్?కి.. పదేళ్లు దోచుకున్న అనుభవం ఉందని ఆయన మాటలే వింటారా..?' అంట్యూ ÷ర్ అయ్యారు. తాము వలసదారులం కాదంటూ తాజాగా పార్టీలోకి చేరి పదవులనుభవిస్తున్న వారిపై మాజీ మంత్రి జీవన్ రెడ్డి చురకలు అంటించారు. మంత్రి శ్రీధర్‌బాబు, అడ్లూరి అడ్డుకోకపోతే ఆ రోజే కథ వేరుండేదంటూ అసహనం వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌లో మేం కౌలుదారులం కాదు.. పట్టాదారులమంటూ వ్యాఖ్యానించారు. నాలుగు దశాబ్దాలుగా కాంగ్రెస్ జెండా కింద పోరాడుతున్నానని మాజీ మంత్రి జీవన్ రెడ్డి అన్నారు. పార్టీలో నిజమైన కార్యకర్తలను పక్కనపెట్టి బీఆర్ఎస్ నాయకులకు బీర్పూర్ శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం కమిటీల్లో పదవులు ఇస్తున్నారని విమర్శించారు. పెంబట్ల దేవాలయం తప్ప, మిగతా అన్ని కమిటీలు బీఆర్ఎస్ నేతల చేతుల్లోకి వెళ్లాయని ఆవేదన వ్యక్తం చేశారు. పొలాస పౌలస్తేశ్వర స్వామి ఆలయ కమిటీలో సైతం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అనుచరులకు స్థానం కల్పించారని ఆరోపించారు. వలసదారులకు ప్రాధాన్యత ఇస్తూ పోతే ఇక పార్టీలో తాము ఉండి ఎందుకని ప్రశ్నించారు. మీకు ఇష్టం లేకపోతే మమ్మల్ని బయటకు వెళ్లగొట్టండని అన్నారు. తాను ఎట్టి పరిస్థితుల్లో వలసదారుల ముందు తలవంచనని అన్నారు. ఒక్కోసారి రాత్రులు నిద్ర కూడా పట్టని పరిస్థితి నెలకొందని జీవన్ రెడ్డి అన్నారు. తమను కొద్దికొద్దిగా చంపకండని అన్నారు. ఒకేసారి నరికేసే నిర్ణయమైనా తీసుకోండని ఆవేదనతో అన్నారు. వలసదారుల్లా దోచుకునే వారిమి కాదని పదవులు ఉన్న లేకపోయినా పార్టీ కోసం ప్రజల కోసం పని చేసే తత్వం తన కార్యకర్తలదని అన్నారు. తమకు న్యాయం చేయాలని కోరారు. జీవన్‌రెడ్డి ఆవేదనను అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తానని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు.



# గత్యంతరం లేని పరిస్థితుల్లో కాల్పులు

## రియాజ్ మృతిపై సిపి సాయిచైతన్య

నిజామాబాద్,అక్టోబర్21 : గత్యంతరం లేని పరిస్థితుల్లోనే రియాజ్‌పై పోలీసులు కాల్పులు జరపాల్సి వచ్చిందని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య స్పష్టం చేశారు. పోలీసులపై దాడి క్రమంలో ఈ ఘటన జరిగిందన్నారు. రియాజ్ మృతి గురించి సీపీ సాయి చైతన్య వివరాలను వెల్లడించారు. ఉదయం ఆసుపత్రిలో నిందితుడు రియాజ్ గొడవ చేశాడు. ఆసుపత్రిలో అద్దం పగలకొట్టి అందరిపై తిరగబడ్డాడు. విధుల్లో ఉన్న ఆసుపత్రి సిబ్బంది, పోలీసులపై రియాజ్ తిరగబడ్డాడు. గోల చేస్తున్న రియాజ్‌ను బెడ్‌పై పడుకోబెట్టే ప్రయత్నం చేశారు. కానిస్టేబుల్ దగ్గరున్న తుపాకీ లాక్కుని ట్రిగ్గర్ నొక్కే ప్రయత్నం చేశాడు. తుపాకీ కింద పడేయాలని ఆర్ఐ హెచ్చరించినా రియాజ్ వినలేదు. గత్యంతరం లేని పరిస్థితుల్లోనే రియాజ్‌పై ఆర్ఐ కాల్పులు జరిపారు. ఆర్ఐ కాల్పులు జరపగానే రియాజ్ నేలపై పడిపోయాడు. ఘటనపై కేసు నమోదు చేసి.. దర్యాప్తు చేస్తున్నాం అని సాయి చైతన్య తెలిపారు. రియాజ్ తిరుగుబాటు తత్వానికి కానిస్టేబుల్ ప్రమోద్ హత్యే నిదర్శనమన్నారు. అతను మామూలు నేరస్థుడు కాదన్నారు.

# ఆరోగ్య రంగంలో హుస్నాబాద్ అభివృద్ధి

సిద్దిపేట,అక్టోబర్21 : హుస్నాబాద్‌ను ఆరోగ్యరంగంలో నెంబర్ వన్ కేంద్రంగా తీర్చిదిద్దడమే మా లక్ష్యం అని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ప్రస్తుతం ఆసుపత్రిలో ఎనిమిది మంది వైద్యులు పనిచేస్తున్నారని, కొత్త భవనం పూర్తి కాగానే 38 మంది డాక్టర్లు విధులు నిర్వర్తించనున్నారని తెలిపారు. హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిని మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం సందర్శించారు. నూతనంగా నిర్మాణంలో ఉన్న 250 పడకల ఆసుపత్రి భవనాన్ని పరిశీలించిన మంత్రి, నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సుమారు 82 కోట్ల రూపాయల వ్యయంతో ఆధునాతన సదుపాయాలతో కూడిన 250 పడకల హాస్పటల్ నిర్మాణం జరుగుతోంది. హుస్నాబాద్‌లో నర్సింగ్ కాలేజీ స్థాపనకు కూడా చర్యలు తీసుకుంటున్నట్లు ప్రకటించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, 'మహాసముద్రం గండి పనులు టూరిజం అభివృద్ధి కోసం వేగంగా కొనసాగుతున్నాయి. గౌరవెల్లి కాలువల పనులకు భూసేకరణ జరుగుతోంది. రైతులు అందరూ సహకరించాలని కోరుతున్నాను అని తెలిపారు. ఇక మహిళా సంఘాల అభ్యున్నతికి పొన్నం సత్తయ్య ట్రస్టు ద్వారా 13 రకాల వస్తువులతో కూడిన స్టీల్ పాత్రలను పంపిణీ చేసినట్లు తెలిపారు. 'ఆరోగ్యం, వైద్యం, వ్యవసాయం, ప్రాజెక్టులు, ఇన్ఫ్రాస్ట్రక్చర్.. అన్ని రంగాల్లో హుస్నాబాద్ అభివృద్ధికి కృషి చేస్తున్నాం' అని మంత్రి స్పష్టం చేశారు.

# దీపావళి నాడు విషాదం

## బైకర్‌ను ఢీకొట్టిన కారు..బాలుడు మృతి

హైదరాబాద్,అక్టోబర్21 : రంగారెడ్డి జిల్లా నార్సింగి మండలంలోని పుప్పాలగూడ అల్కాపూరీ కాలనీలో సోమవారం రాత్రి విషాదకర ఘటన చోటుచేసుకుంది. టపాసులు కొనుగోలు చేసి ఇంటికి తిరిగి వస్తున్న తండ్రికొడుకుపై వేగంగా దూసుకొచ్చిన కారు బీభత్సం సృష్టించింది. పుప్పాలగూడ ప్రాంతానికి చెందిన వ్యక్తి తన కుమారుడు కుశల జోయల్‌తో కలిసి బైక్‌పై ఇంటికి వస్తుండగా, ఎదురుగా వచ్చిన కారు బైక్‌ను ఢీ కొట్టింది. వేగంగా ఢీకొనడంతో బాలుడు రోడ్డుపై పడిపోగా, అదే కారు అతనిపై నుంచి దూసుకెళ్లింది. తండ్రి తీవ్రంగా గాయపడ్డాడు. తక్షణమే స్థానికులు స్పందించి, గాయపడిన వారిని సమీప ఆసుపత్రికి తరలించారు. అయితే మార్గమధ్యంలోనే బాలుడు ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో విషాదం నెలకొంది. కారు నడిపిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు నార్సింగి పోలీసులు తెలిపారు.

# సకాలంలో ధాన్యం కొనుగోళ్లు

## రైతులకు కలెక్టర్ వినయ్ హామీ

నిజామాబాద్,అక్టోబర్21 : నిజామాబాద్ జిల్లా బోధన్ మండలం పెగడపల్లిలో వరి కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోళ్లు త్వరితగతిన పూర్తి చేయాలని నిర్వాహకులకు సూచించారు. సకాలంలో ధాన్యం సేకరణ చేపట్టాలని అన్నారు. ద్దతు ధరలు చెల్లించి ధాన్యం సేకరించాలన్నారు. రైతులు కూడా తేమలేకుండా అధికారులకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ వికాస్ మహ, ఎమ్మార్వో విట్టల్ పాల్గొన్నారు. ఇదిలావుంటే ధర్పల్లి మండలంలోని వాడి, మద్దుల్ తండా, హొన్నజీపేట్, ఇందల్ వాయి మండలాల్లోని చంద్రాయన్ పల్లి, నల్లవెల్లి, గన్నారం గ్రామాల్లో సోమవారం మధ్యాహ్నం ఉన్నట్టుండి వర్షం కురిసింది. ఈ వానకు కొనుగోలు కేంద్రాల్లో అరబోసిన ధాన్యం తడిసి ముద్దయింది. కోత దశకు చేరిన వరి పంట నేలకొరిగింది. చేతికి అందిన పంట కాస్త వర్షానికి తడిసిపోవడంతో అన్నదాతలు కన్నీటి పర్యంతమయ్యారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేయాలని కర్షకులు కోరుతున్నారు. తమను ఆదుకోవాలని అధికారులను వేడుకున్నారు.

# సంపాదకీయం

## గూగుల్ లాంటి సంస్థలను స్వాగతించాల్సిందే !

హైదరాబాద్ అభివృద్ధి, సైబరాబాద్ సృష్టి ఈ రెండు ఇవాళ తెలంగాణ గతినే మార్చాయి. ఐటి అభివృద్ధితో హైదరాబాద్ ముఖచిత్రమే మారిపోయింది. రియల్ రంగంలో కొత్త పోకడలు వచ్చాయి. ఉమ్మడి ఎపిలో చంద్రబాబు పాలన ఎలా ఉన్నా, ఆయన ఏం చేసాడనే విమర్శలకు పోకుండా పరిశీలిస్తే... ఐటిని విస్తరించ డం కోసం తీసుకున్న నిర్ణయాలు ఇవాళ హైదరాబాద్‌ను అగ్రభాగాన నిలబెట్టాయి. హైటెక్ సిటీ రాకతో సైబరాబాద్ అనూహ్యంగా విస్తరించడం, అనేక దిగ్గజ కంపెనీలు హైదరాబాద్‌లో ఏర్పాటు కావడంతో లక్షల్లో ఉద్యోగాలు వచ్చాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా మరికొన్ని లక్షల మంది హైదరాబాద్‌లో ఉపాధి పొందుతున్నారు. ఇక్కడి 70శాతం ఆదాయంతోనే తెలంగాణ మనగులుగుతందనడంలో సందేహం లేదు. రియల్ ఎస్టేట్ అనూహ్యంగా విస్తరించింది. ఇది కాదనలేని సత్యం. ఇప్పుడు అమరావతి నిర్మాణం, విశాఖను ఐటి హబ్‌గా తీర్చిదిద్దేందుకు చంద్రబాబు చేస్తున్న కృషిని అభినందించాల్సిందే. ఎందుకంటే విడివడ్డ తెలుగు రాష్ట్రం అభివృద్ధి చెందడం తెలుగువారికి గర్వకారణంగా చూడాలి. అమరావతి, విశాఖలు అభివృద్ధి చెందితే అక్కడి స్థానికులకు కూడా లక్షల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయి. దీనిని రాజకీయాలకు అతీతంగా అందరం స్వాగతించాల్సిందే. వైకాపా ఐదేళ్ల పాలనలో అమరావతినే కాదు, రాజధానిని తుంగలో తొక్కింది. మూడు రాజధానులంటూ అసలు రాజధాని లేకుండా చేశారు. ఇవాళ అదే వైకాప అమరావతిని, గూగుల్ రాకను వ్యతిరేకిస్తోంది. విశాఖలో అతిపెద్ద గూగుల్ డేటా సెంటర్ రావడం ఎంతో పురోగిమిస్తుందని, గూగుల్ సిఇవో సుందర్ పిచాయ్ స్వయంగా చెప్పారు. గూగుల్ సంస్థ డేటా సెంటర్ల ఏర్పాటుకు అమెరికాలోనూ భారత్‌లోనూ భారీగా పెట్టుబడులు పెడుతోంది. రాష్ట్రానికి పెట్టుబడు లు వస్తే చంద్రబాబుకు లేదా ఐటీ మంత్రి లోకేశ్‌కు వ్యక్తిగతంగా లాభం ఏమీ ఉంటుందా లేదా అన్నది ముఖ్యం కాదు. ఎందుకంటే పెట్టుబడుల ఫలితాలను ప్రజలు అనుభవిస్తారు. హైదరాబాద్ ఐటిరంగ విస్తరణెలి ఇందుకు నిదర్శనం. గూగుల్ సంస్థ రాకను మెచ్చుకోవాల్సిన వైకాపా నేతలు అదేపనిగా విమర్శలు చేయడం విడ్డూరంగా ఉంది. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో గూగుల్ గేమ్‌చేంజర్ అనే చెప్పవచ్చు. హైదరాబాద్ తో పోటీపడేలా విశాఖకు అవకాశాలు ఉన్నాయి. సంక్షేమం పేరిట ప్రభుత్వం అదేపనిగా ఉచిత పథకాలు ప్రవేశ పెట్టడం సరికాదు. ఇలాంటి సంస్థలను ప్రోత్సహించాలి. ఇలా వచ్చేవారికి తోడ్పాటును అందించాలి. చంద్రబాబుపై నమ్మకంతో ఆంధ్రపద్రేశ్ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి మొదలైంది. గూగుల్ నిర్ణయం తర్వాత మరిన్న సంస్థలు రావచ్చు. ఇప్పటికే టిసిఎస్ కూడా తన క్యాంపస్ ప్రారంభించడానికి అంగీకరించింది. ఇదే ఒరవడి కొనసాగితే పెట్టుబడుల వెల్లువపెరుగుతుంది. అయితే జగన్ బృందం గూగుల్ సహా అనేక కంపెనీల రాకపై విమర్శలు చేస్తున్నది. పెట్టుబడులు రావడం, అభివృద్ధి జరగడం అన్నది ఎవరైనా స్వాగతించాల్సిందే. జగన్ అధికారంలో ఉండగా ఇలాంటి సంస్థల రాక అన్నది చూడలేదు. అవినీతిని వ్యవస్థీకృతం చేసిన జగన్, కల్తీ మద్యం, ఊరూపేరు లేని బ్రాండ్లతో విచ్చలవిడి నకిలీ వ్యాపారం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశీస్సులతోనే రాష్ట్రవ్యాప్తంగా కల్తీ మద్యం వ్యాపారం జరుగుతోందని అదే పనిగా ప్రచారం చేస్తున్నారు. నిజానికి కల్తీ మద్యం అమ్మకాలకు మాఫియా కారణం. దానివెనక రాజకీయ నేతలే ఉంటారు. ఇప్పుడు ఎపిలో పట్టుబడ్డ కల్తీకి రాజకీయ నేతలే అండగా ఉన్నారు. అందుకే కల్తీ సారా, కల్తీ మద్యం తాగి అడపాదడపా అనేకులు మరణిస్తూనే ఉంటారు. ఇప్పుడు కల్తీ మద్యం గురించి గగ్గోలు పెడుతున్న జగన్, ఆయన అనుచరులు గతంలో వారి పాలనలో కల్తీ మద్యం సరఫరా అన్నది ప్రభుత్వ పరంగానే చేశారు. జంగారెడ్డిగూడెంతో పాటు మరికొన్ని ప్రాంతాలలో ఆ మద్యం తాగి పలువురు మరణించిన విషయం గుర్తించాలి. ములకలచెరువులో కల్తీ వ్యవహారం బయటకు రాగానే బాధ్యులందరినీ ప్రభుత్వం అరెస్టు చేసింది. వైసీపీకి చెందిన మాజీ మంత్రి జోగి రమేశ్ ప్రోద్బలంతోనే కల్తీ మద్యం తయారు చేశానని ప్రధాన నిందితుడు జనార్దనరావు చెప్పారు. ఇందులో నిజానిజాలు బయటికి వచ్చేలా కఠినంగా వ్యవహరించాలి. మద్యం కుంభకోణంలో సిట్ దర్యాప్తు నుంచి ప్రజల దృష్టిని మళ్లించడం కూడా వారి లక్ష్యం కావచ్చు. ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపడంతో పాటు విపక్ష పార్టీగా వైకాపా అభివృద్ధిని కూడా స్వాగతించాలి. కానీ గూగుల్ లాంటి సంస్తల రాకను తప్పుపట్టడంమో, విమర్శించడమో సరికాదు. విభజిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం బాగుపడాలంటే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరగాలి. అనేక సంస్థలు రావాలి. గూగుల్ రావాలి, టిసిఎస్ ఇతర సంస్థలు రావాలి. ఎపిలో పెట్లుబడులు లక్ష్యంగా చేపట్టిన సిఐఐ సదస్సును విజయవంతం చేయాలి. అనేక సంస్థలు వచ్చి తమ కార్యలాపాలు సాగించేలా ప్రోత్సహించాలి. అందుకు అందరూ అభినందించాలి. అప్పుడే ఇక్కడ పెట్టుబడులు పెట్టేవారికి భరోసా కలుగుతుంది. అంతేకానీ వారిలో అపనమ్మకం కలిగేలా ఎవరు విమర్శలు చేసినా క్షంతవ్యం కాదు. అమెరికాలో తెలుగువారికి ఎసరు పెడుతున్న ట్రంప్ చర్యలతో ఇప్పుడక్కడ అనిశ్చితి నెలకొంది. మనవారికి ఇక్కడే ఉద్యోగాలు రావాలంటే గూగుల్ తదితర సంస్థలు రావాలి. అవి పోటీపడి తెలుగు రాష్ట్రాల్లో పెట్టుబడులు పెడితే మనం అమెరికా తదితరదేశాలకు వెళ్లాల్సిన ఆగత్యం ఉండదు.

# కౌలు రైతులపై శీతకన్ను



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వల్ల తెలంగాణ రాష్ట్రంలో కౌలు రైతులు తీవ్ర సంక్షోభంలో ఉన్నారు. భూమిపై కౌలు హక్కులు లేకపోవటం వలన ప్రభుత్వ పథకాలకు, పంట నష్ట పరిహారాలకు, సంస్థాగత రుణాలకు దూరమవుతున్నారు. ముఖ్యంగా కౌలు భూమిని పొందటం భూకామందుల ఇష్టాలపై ఆధారపడవలసి వస్తున్నది. భారతదేశం వ్యవసాయిక దేశమని, వ్యవసాయం దేశానికి ఆయువు పట్టని పాలక పార్టీలతో పాటు ప్రతిపక్ష పార్టీలు నిత్యం జపించే మాటలుగా ఉన్నాయి. నేటికీ అత్యధిక ప్రజలకు జీవనాధారంగా ఉన్న వ్యవసాయ రంగం పరిస్థితి, వ్యవసాయంలో కీలక పాత్ర పోషిస్తున్న కౌలు రైతులు, పేద రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారం ఎడల పాలక పార్టీలు అనుసరిస్తున్న విధానాలు నేడు దేశంలో, రాష్ట్రంలో చర్చించాల్సిన అంశంగా ఉంది. వ్యవసాయానికి సేద్యపు భూమి పునాదిగా ఉంది. ఆ భూమి సేద్యం చేసే వారి వద్ద ఉందా లేక సేద్యం చేయని వారి వద్ద బందీగా ఉందా అన్నదే కీలక అంశం. ఈ అంశమే వ్యవసాయ రంగం స్వరూపాన్ని తెలియచేస్తుంది. అధికార మార్పిడి జరిగి 77 సంవత్స రాలు పూర్తి అయిన తర్వాత కూడా భూసంబం దాల్లో మౌలిక మార్పులు జరగలేదు. భూసంస్కరణ చట్టాలు పేదలకు భూములు పంచడంలో విఫలమై అలంకార ప్రాయంగానే ఉన్నాయి. సేద్యం చేసి పంటలు పండించే కౌలురైతుల, పేదరైతులకు సాగు భూమి లేదు. సేద్యం చేయని భూకామందుల వద్ద భూమి కేంద్రీకరణ జరిగింది. ఫలితంగా సేద్యం పై మక్కువ ఉన్న పేదలు భూకామందుల వద్ద భూమిని కౌలుకి తీసుకుని కౌలు దారులుగాను మరి కొందరు కూలీలుగా మారి భూకామందుల దోపిడీకి గురవుతున్నారు. అధికార మార్పిడి జరిగిన ప్రారంభంలో గ్రామీణ జనాభాలో 35% కౌలు రైతులే (%ఖీుతీఎవతీం%). కౌలుదారుకి సాగుదారుగా గుర్తింపు లేని పరిస్థితుల్లో దేశంలోని అనేక రాష్ట్రాల్లో హక్కుల కోసం,సేద్యపు భూమి కోసం కౌలు రైతులు, గ్రామీణ పేదలు ఆందోళనా పోరాటాలు చేశారు. ఈ పోరాటాలు కొన్ని ప్రాంతాల్లో మిలిటెంట్ రూపం తీసుకున్నాయి. వాటిల్లో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం అతి ముఖ్యమైనది. ఇలాంటి పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం కౌలుదారీ సంస్కరణలు, భూసంస్కరణలు చేపట్టక తప్పలేదు. కేంద్ర ప్రభుత్వ కౌలుదారీ సంస్కరణల్లో భాగంగా 1950లో తెలంగాణ కౌలుదారీ చట్టం చేయబడింది. ఈ చట్టానికి ముందు వరుసగా ఆరు సంవత్సరాలు కౌలుదారులుగా ఉన్న వారిని రక్షిత కౌలుదారులుగా గుర్తించి వారికి భూమిపై హక్కులు కల్పించారు. సేద్యపు అవసరాల కోసం భూమిని తనకా పెట్టే హక్కు కూడా చట్టం కల్పించింది. నిబంధనల ప్రకారం కౌలు చెల్లించినంత కాలం కౌలుదారుగా కొనసాగుతాడు. కౌలు దారుకి కల్పించిన హక్కులతోపాటు భూయజమాని సొంత సేద్యం చేసుకునే హక్కు చట్టం కల్పించబడింది. దీన్ని ఉపయోగించుకుని భూకామందులు సొంత సేద్యం పేరుతో భూమి నుంచి కౌలుదారులను తొలగించారు. చివరికి కౌలు విధానం రాత పూర్వకం నుండి నోటి మాటకు మారింది. కౌలు రైతులకు ఎటువంటి హక్కులు లేకుండా పోయాయి. ఆచరణలో కౌలుదారీ చట్టం నిరుపయోగంగా మారింది. 1956లో రాష్ట్రాల పునర్వ్యస్థీకరణ చట్టం వచ్చింది. దేశంలోని వివిధ రాష్ట్రాల పరిస్థితులకు అనుగుణంగా మార్చుకోగల వ్యవసాయ భూమి లీజింగ్‌పై నమూనా చట్టం రూపొందించింది. ఈ నమూన చట్టంలో ప్రభుత్వ అందించే అన్ని రకాల సహాయాలకు కౌలురైతులు అర్హులు అయ్యే విధంగా చట్టం రూపొందించినట్లు చెప్పింది. యజమానికి పూర్తి భద్రత కల్పిస్తూ, కౌలు రైతుకు భూమిపై ఎటువంటి హక్కు ఉండదని, దీర్ఘకాలికంగా భూమిని కౌలుకు తీసుకున్న వారసత్వంగా భూమిని పొందలేడని, ఎలాంటి సమయంలోనైనా కౌలుదారుని ముందుగా హెచ్చరించి కౌలు రద్దు చేసుకోవచ్చని నమూన చట్టంలో పేర్కొన్నారు. భూపంపిణీ గురించి చట్టంలో ప్రస్తావనే లేదు.

గత కౌలుదారీ చట్టాల్లోనూ, నీతిఆయోగ్ నమూనా చట్టంలో గాని కౌలురైతుకు ఎటువంటి హక్కులు లేవు. భూయజమాని ఇష్టాయిష్టాలపై భూమి కోసం కౌలు రైతు ఆధారపడి ఉండాలి. ఇలాంటి చట్టాలు కౌలు రైతుల సమస్యలు పరిష్కరించవు. మానవ మనుగడకు వ్యవసాయం ప్రధాన జీవనాధారం. అలాంటి వ్యవసాయంలో ఆరుగాలం కష్టపడి పంటలు పండించే రైతాంగం పరిస్థితి ముఖ్యంగా కౌలు రైతుల పరిస్థితి దారుణంగా ఉంది. సేద్యపు ఖర్చులు ఎక్కువ కావటం, అందుకు అనుగుణంగా పంటలకు ధరలు లభించక పోవటం, సంస్థాగత రుణాలు అందక అధిక వడ్డీలకు అప్పులు చేయటం, ప్రభుత్వం ప్రకటించే పరిహారాలు అందక పోవటం వల్ల రైతులు అప్పుల్లో కూరుకుపో తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఒక్కో రైతు కుటుంబంపై 1,53,113 ఉండగా, కౌలు రైతు కుటుంబాలు మాత్రం సగటున 2.70 లక్షల రూపాయల అప్పుల్లో ఉన్నారు. ఇందులో రెండు లక్షలు ప్రైవేట్ వ్యక్తుల నుండి అధిక (24% నుండి 60% వరకు) వడ్డీలకు అప్పులు తీసుకున్నారు. రైతుల ఆత్మహత్యల్లో కూడా కౌలు రైతులు సంఖ్య ఎక్కువగానే ఉంది. పాలక ప్రభుత్వాలన్నీ భూస్వామ్య వర్గాల ప్రయోజనాలను కాపాడుతూ పేద, కౌలు రైతుల వ్యతిరేక విధాలు అనుసరిస్తూ ఉన్నాయి. ప్రభుత్వాలు చేసిన కౌలు చట్టాలన్నీ అందుకు అనుగుణంగానే ఉన్నాయి. ఈ చట్టాలేవి కౌలు రైతుల సమస్యలు పరిష్కరించలేక పోయాయి. ఈ వాస్తవాన్ని తెలంగాణ కౌలు రైతులు గమనించి సమగ్రమైన కౌలుదారీ చట్టం కోసం గత ఉద్యమాల స్ఫూర్తితో ఉద్యమించాలి.

# అమెరికా ప్రతిష్ఠకే తీరని నష్టం



ప్రఖ్యాత హార్వర్డ్ యూనివర్శిటీలో (%ఃుతీఃుతీస ఖఅఅజవతీంఎ%) విద్యార్థుల ప్రవేశాన్ని ట్రంప్ ప్రభుత్వం నిషేధించడం అక్కడ ప్రస్తుతం చదువుతున్న వేలాది మంది విదేశీ విద్యార్థుల భవిష్యత్తు గందరగోళంలో పడింది. హార్వర్డ్ విశ్వవిద్యాలయం కేంబ్రిడ్జ్, మసాచుసెట్స్ నగరాల్లో ఉన్న క్యాంపస్‌ల్లో 6800 మంది విద్యార్థులకు ప్రవేశం కల్పిస్తోంది. దాదాపు 100కు పైగా దేశాల నుంచి విద్యార్థులు ఇక్కడ ఏటా ప్రవేశం పొందుతున్నారు. ప్రస్తుతం హార్వర్డ్ యూనివర్శిటీలో (%ఃుతీఃుతీస ఖఅఅజవతీంఎ%) ప్రపంచం నలుమూలల నుంచి వచ్చిన మొత్తం 10,158 మంది విదేశీ విద్యార్థులు చదువుతున్నారు. 202425 విద్యా సంవత్సరంలో ఈ విశ్వవిద్యాలయం పరిధిలోని అన్ని విద్యాసంస్థల్లో కలిపి 788 మంది భారతీయ విద్యార్థులు నమోదయ్యారు. ప్రస్తుతం ఇక్కడ చదువుతున్న విద్యార్థులు ఈ విద్యాసంవత్సరం తరువాత ఇతర విశ్వవిద్యాలయాలకు బదిలీ కావలసిన గందరగోళ పరిస్థితి ఏర్పడింది. లేకుంటే వారు చట్టబద్ధతను కోల్పోయే ప్రమాదం తప్పదు. అయితే తాము విధించిన ఆరు షరతులకు యూనివర్శిటీ అంగీకరిస్తే విదేశీ విద్యార్థుల ప్రవేశాన్ని యథాతథంగా కొనసాగించవచ్చని ట్రంప్ సర్కారు మెలిక పెట్టింది. ట్రంప్ ఆదేశాలను సవాలు చేస్తూ హార్వర్డ్ యూనివర్శిటీ ఫెడరల్ కోర్టులో దావా వేసింది. ఈ పిటిషన్‌ను విచారించిన బోస్టన్‌లోని యుఎస్ డిస్ట్రిక్ట్ కోర్టు జడ్జి అల్లిసన్ బుర్రోగ్స్ శుక్రవారం ట్రంప్ యంత్రాంగం జారీ చేసిన నిషేధాజ్ఞలను విదేశీ విద్యార్థుల ప్రవేశానికి ఇక వీలు లేనట్టే. ప్రస్తుతం అక్కడ చదువుతున్న విదేశీ విద్యార్థులు వేరే యూనివర్శిటీకి బదిలీ కావాలి. లేకుంటే వారిని అక్రమ ప్రవాసులుగా పరిగిణించాల్సి వస్తుందని అమెరికా అంతర్గత భద్రతా విభాగం హెచ్చరిస్తోంది. ట్రంప్ సర్కారు ఉత్తర్వుల ప్రకారం స్టూడెంట్ అండ్ ఎక్స్ఛేంజ్ విజిటర్ ప్రోగ్రామ్ (ఎస్ఇవిపి) సర్టిఫికేషన్ రద్దు చేయడంతో ఎఫ్1 లేదా జే1 వీసా కింద విదేశీ విద్యార్థులకు ఈ యూనివర్శిటీలో ప్రవేశార్హత ఉండదు. ట్రంప్ సర్కారు తీసుకున్న ఈ నిర్ణయంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. 140 పైచిలుకు దేశాలనుంచి వచ్చే విద్యార్థులు, మేధావులకు, బోధకులకు ఆతిథ్యమిచ్చే సామర్థం హార్వర్డ్ యూనివర్శిటీకి ఉందని, దీన్ని సజావుగా కొనసాగించడానికి తాము కట్టుబడి ఉన్నామని హార్వర్డ్ ప్రతినిధ జాసన్‌న్యూటన్ ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. భారత విద్యార్థుల వల్ల అమెరికా ఆర్థిక వ్యవస్థకు ఏటా ఏకంగా 900 కోట్ల డాలర్ల మేరకు ఆదాయం సమకూరుతోందని మాజీ అధ్యక్షుడు జో బైడెన్ విద్యా సలహాదారు అజయ్ భుటోరియా గుర్తు చేశారు. ఇన్నోవేషన్, టెక్నాలజీ, వైద్య తదితర రంగాల్లో అమెరికా అగ్రస్థానంలో ఉండటం వెనుక భారత విద్యార్థుల కృషి ఎనలేనిదన్నారు. ప్రతిభావంతులైన విద్యార్థులకు రెడ్‌కార్పెట్ పరిచేందుకు బ్రిటన్, కెనడా దేశాలు సిద్ధంగా ఉన్నట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో హాంగ్‌కాంగ్‌లోని ఒక విశ్వవిద్యాలయం.. హార్వర్డ్‌లో తదుపరి విద్యాసంవత్సరం కొనసాగించలేని విద్యార్థుల కోసం హాంగ్‌కాంగ్ యూనివర్శిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సహాయం చేస్తామని తెలియజేసింది. అలాగే అమెరికా వ్యతిరేక, ఉగ్రవాద సమర్థకులు యూదు విద్యార్థులను వేధించడం, దాడి చేయడానికి హార్వర్డ్ క్యాంపస్‌లో అనుమతించడం జరిగాయని అమెరికా ప్రభుత్వం ఆరోపించింది. మొత్తం మీద అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రాచీన ప్రఖ్యాత విద్యాసంస్థ హార్వర్డ్‌ను చిక్కుల్లో పెడుతున్నారు. యూనివర్శిటీకి మంజూరయ్యే కొన్ని మిలియన్ల డాలర్ల నిధులను గ్రాంట్లను స్తంభింప చేశారు. వారు నచ్చి ఎంచుకున్న ఆయా రంగాల్లో ఆరితేరేలా శిక్షణ కల్పిస్తోంది. ఉదార వాదానికి, విజ్ఞాన సృష్టికి, ప్రపంచీకరణను ముందుకు తీసుకు వెళ్లడానికి దోహదం చేస్తోంది. కానీ ఈ యూనివర్శిటీలో మైనారిటీలకు, ముఖ్యంగా ఆఫ్రికన్ అమెరికన్లకు ప్రవేశం లేకుండా నిరోధించే పోకడలు కనిపిస్తున్నాయి. హార్వర్డ్ యూనివర్శిటీ విదేశీ విద్యార్థుల విరాళాలు, ఫీజుల పైనే ఎక్కువగా ఆధారపడుతో ందని, వారికి విశేషాధికారాల వీసాలను కల్పిస్తోందని ట్రంప్ ప్రభుత్వం ఆరోపిస్తోంది. ట్రంప్ ఉత్తర్వులకు కోర్టులు తాత్కాలికంగా బ్రేకు వేసినప్పటికీ, ఇప్పుడు జరిగిన నష్టం కేవలం హార్వర్డ్ వర్శిటీకే కాదు, అమెరికా ఉన్నత విద్యాసంస్థల ప్రతిష్టకు, ప్రజాస్వామ్య సిద్ధాంతాలకు తీరని నష్టం ఏర్పడింది.

# శ్రమ జీవనమే సౌందర్యం

### ఇస్లాం బోధ

మనం చేసే పనే మనకు గుర్తింపునిస్తుంది. నిజాయతీగా సంపాదించే వారి వేడుకోలును అల్లాహ్ స్వీకరిస్తాడని ప్రవక్త చెప్పారు. సమాజంలోనూ పనిమంతుడు అనే బిరుదు కూడా సొంతమవుతుంది. పని చేయడం వల్ల బాధ్యతాభావం అలవడుతుంది. మనలో దాగి ఉన్న శక్తి సామర్థ్యాలు, నైపుణ్యాలను మరుగున పడేయకుండా వాటికి సానబెట్టుకోవచ్చు. దీనికి మించిన గెలుపు సూత్రం మరొకటి లేదు. జీవితంలో ఏది సాధించాలన్నా చెమటోడ్చా ల్సిందే. విజయానికి దగ్గరి దారులంటూ ఏమీ ఉండవు. శ్రమించి పనిచేయడమే విజయానికి నాంది. నిత్యం పరిశ్రమించడంలోనే విజయరహస్యం దాగి ఉంది. ఒకరిపై ఆధారపడి వాళ్ల దయాదాక్షిణ్యాలపై బతకడం కంటే మన పని మనమే చేసుకోవడం ఉత్తమం. పనిని పెద్ద కష్టంగా భావించకుండా చేయాలి. ఇష్టపడి చేసినప్పుడే ఏ పనైనా అంతగా శ్రమ అనిపించదు. ఇలా కష్టార్జితంతోనే భార్యాపిల్లలను పోషించాలని, అలాంటి శరీరమే స్వర్గానికి అర్హత సాధిస్తుందని ప్రవక్త చెప్పారు. ప్రవక్తలంతా శ్రమజీవనాన్ని గడిపినవారే. ప్రవక్త ఈసా (అలై), మూసా (అలై), ముహమ్మద్ ప్రవక్త (స) పశువులను కాసేవారు. దావూద్ (అలై) అనే ప్రవక్త చక్రవర్తి అయినప్పటికీ ఎంతో కష్టించి ఆర్జించేవారు. ఆయన స్వహస్తాలతో సంపాదించిన కష్టార్జితంతోనే పొట్టపోసుకునే వారని ముహమ్మద్ ప్రవక్త (సఅసం) తమ సహచరులకు తెలిపేవారు. ఒకసారి అల్లాహ్ మార్గంలో దానం చేయాలన్న ప్రవక్త ఆజ్ఞానుసారం సహచరులంతా తమ వద్దనున్న ధనరాశులను, వెండి, బంగారాలను, సంపదనంతా తెచ్చి ధారపోశారు. ఒక పేద సహాబీ కూడా తను కష్టించి సంపాదించిన ఒక ఖర్జూరాన్ని ప్రవక్త సన్నిధిలో తెచ్చిపెట్టారు. ప్రవక్త ఆ ఖర్జూరాన్ని తీసుకొని ధనరాశు లన్నిటిపైన అందరికీ కనబడేలా దాన్ని ప్రదర్శించారు. ఎన్నో వెండి, బంగారు, ధనరాశుల కన్నా.. చెమటోడ్చి సంపాదించిన ఈ ఒక్క ఖర్జూరం అల్లాహ్‌కు ఎంతో ఇష్టమని ప్రవక్త ఆ సందర్భంలో ఆ పేద సహచరుడిని ప్రశంసించారు. అలా శ్రమజీవన సౌందర్యాన్ని ప్రవక్త (సఅసం) ప్రోత్సహించారు.



ఆధ్యాత్మికం

# చీకటి పాలవుతున్న దేవాలయ ప్రతిష్ట

◆ ఓదెల శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయం లో రగులుతున్న రగడ పై ది క్రైమ్ న్యూస్ అందిస్తున్న స్పెషల్ స్టోరీ....

- ◆ పూజారులపై మీ పెత్తనం ఏంది?
- ◆ ఆలయ చైర్మన్ పై విరుచుకుపడ్డ అర్చకులు
- ◆ పద్ధతి మార్చుకోవాలంటూ హెచ్చరిక
- ◆ చేతనైతే అభివృద్ధిపై దృష్టి పెట్టండి
- ◆ పూజా విధానాల్లో వేలు పెట్టకండి
- ◆ ఈవో కు ఫిర్యాదు




**బ్యూరో (ది క్రైమ్ న్యూస్):** మరో శ్రీశైలం గా ప్రసిద్ధిగాంచిన అతి పురాతనమైన పెద్దపల్లి జిల్లాలోని ఓదెల మల్లికార్జున స్వామి ఆలయంలో ఎన్నడూ లేని విధంగా అర్చకులకు చైర్మన్ కు మధ్య రగులుకున్న వివాదం చిలికి చిలికి గాలి వానగా మారుతున్నది.

అర్చక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు గంగు ఉపేంద్ర శర్మ స్వయంగా జోక్యం చేసుకోవాల్సిన పరిస్థితులు దాపరించాయి. దేవాలయాన్ని సందర్శించి ఈవో సదయ్యకు వినతి పత్రం ఇచ్చేవరకు సమస్య వెళ్లిందంటే అర్చకుల మనసు ఎంతగా గాయపడ్డదో అర్థం చేసుకోవచ్చు. ఆలయ ప్రతిష్ట ను దిగజార్చే ఈ సంఘటన ఎందుకు జరిగింది? ఎలా జరిగింది? ఆలయానికి పట్టిన ఈ చీకటి గ్రహణాన్ని తెలుసుకోవాలంటే వివరాల్లోకి వెళ్లాల్సిందే....

10 సంవత్సరాలుగా రాజకీయ నిరుద్యోగం అనుభవించిన కాంగ్రెస్ తమ్ముళ్లకు రాష్ట్రంలో అధికారం రావడంతో పాటు పెద్దపల్లి నియోజకవర్గంలో కూడా పార్టీ అభ్యర్థి శాసనసభ్యునిగా గెలవడంవల్ల పట్టరాని ఆనందంతో విచ్చలవిడి ప్రవర్తన రోజురోజుకు పెట్రేగిపోతున్నది. ప్రభుత్వ అధికారులపైనే పెత్తనం చాలాయిస్తున్నారు. ఇక గ్రామాల్లో వీళ్లు చేస్తున్న అరాచకాలు దౌర్జన్యాల గురించి ఎంత తక్కువ మాట్లాడుకుంటే అంత మంచిది. ఈ పిచ్చి ఇప్పుడు పరాకాష్టకు చేరి దేవాలయ అర్చకులపై బూతులు తిట్టే స్థాయికి దిగజారింది.

**అసలేం జరిగిందంటే....**

కొద్దిరోజుల క్రితమే దేవాలయానికి నూతన పాలకవర్గాన్ని ప్రకటించడం, ఆ తర్వాత వెంటనే పగ్గాలు చేతికి ఇవ్వడం జరిగింది.

ఇలా పదవి ప్రమాణ స్వీకారం చేశారో లేదో అలా ఆలయం పై పెత్తనం చలాయించడం మొదలుపెట్టారు. ఈ క్రమంలో చైర్మన్ కు సంబంధించిన కొంతమంది బంధువులు ఆలయ దర్శనానికి రావడం జరిగింది. వాళ్లు కోరుకున్న పూజ ముగియడంతో తిరిగి ప్రారంభించాల్సిందిగా అర్చకుని తో వాగ్వాదానికి దిగారు.

దీనికి సదరు ఆలయ ప్రధాన అర్చకుడు రోజులో ఒక్కసారే జరిపిస్తామంటూ తిరిగి మళ్ళీ మళ్ళీ జరపడం కుదరదు అంటూ తెగేసి చెప్పడంతో వివాదం ముదిరి పాకాన పడ్డది. మేము చైర్మన్ బంధువులం...మేము కోరితే కూడా పూజ జరిపించరా? అంటూ పూజారిపై ఒంటి కాలు మీద లేచారు. ఇంతటితో ఆగక విషయాన్ని చైర్మన్ దృష్టికి తీసుకెళ్లడంతో మా బంధువుల కోరిక మేరకు తిరిగి ఆ పూజను జరపాల్సిందిగా హుకుం జారీ చేశాడు.

ఆగమ శాస్త్రాల ప్రకారం స్వామివారికి జరిగే నిత్య పూజలు ఒక్కసారే జరుపుతామంటూ... చైర్మన్ హోదాలో మీరు అడిగినంత మాత్రాన పూజా విధానాన్ని ఎట్టి పరిస్థితుల్లో కూడా మార్చలేమంటూ తెగేసి చెప్పారు అర్చకులు. ఈ మాట విన్న తర్వాత చైర్మన్ కు కిరీటం కింద పడి.. బీపీ నషాలానికి అంటడంతో అర్చకులపై ఆలయ ప్రాంగణంలోనే బూతు పురాణం మొదలుపెట్టాడు. నేను తలచుకుంటే మిమ్మల్ని అందరిని పీకేస్తాను... నేనెవరో తెలిసి కూడా నా మాటను ఖాతరు చేయరా?అంటూ బెదిరించడం మొదలుపెట్టాడు.

గర్భగుడిలో జరుగుతున్న ఈ రచ్చను చూసిన భక్తులు నోరెళ్ళ పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆలయ ప్రతిష్టను దిగజార్చే ఈ సంఘటనను చూసి కొంతమంది భక్తులు కూడా చైర్మన్ పై తమ అసహనాన్ని ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఆత్మగౌరవం దెబ్బతిన్న అర్చకులు విషయాన్ని రాష్ట్ర అధ్యక్షునికి వివరించడంతో హుటాహుటిన గంగు ఉపేంద్ర శర్మ ఆలయాన్ని దర్శించి సంఘటనపై ఈవోకు ఫిర్యాదు చేయడం జరిగింది. పాలకవర్గ సభ్యులు చేతనైతే దాతల సహాయంతో, లేదా ప్రభుత్వం ద్వారా నాయకుల సహకారంతో



పెద్దపల్లి జిల్లా బిజెపి
అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి

దేవాలయానికి ఎక్కువ మొత్తంలో నిధులు రాబట్టడం మీద దృష్టి పెట్టాలి.. అంతేగాని అర్చకులపై పెత్తనం ఏమాత్రం మంచిది కాదంటూ.. పద్ధతి మార్చుకోవాలంటూ హెచ్చరించే వరకు వెళ్ళింది కథ.

**అర్చకులకు క్షమాపణ చెప్పాలి**

ఓదెల మల్లికార్జున స్వామి ఆలయంలో అర్చకులతో ధర్మకర్తల మండలి దురుసుగా ప్రవర్తించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాను. వెంటనే అర్చకులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తున్నాను. లేనిపక్షంలో బిజెపి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నాము.

**అర్చకులను తిడితే దేవున్ని అవమానించినట్టే**

పూజారులు దేవుడికి భక్తులకు మధ్య వారదులు. లోక కళ్యాణం కోసం పూజలు చేసే వాళ్ళు. అలాంటి అర్చకుల మీద పెత్తనం చేయడం అంటే దేవుడి మీద పెత్తనం చేయడంతో సమానమే అవుతుంది. నియమాల ప్రకారం ఏ సమయంలో ఏ పూజ నిర్వహించాలన్నది అర్చకుల విధి.

మాకు వీలైన సమయంలో... మేము ఎప్పుడు వస్తే అప్పుడు పూజలు నిర్వహించాలి అనడం శోచనీయం. అర్చకులను గౌరవించని వాళ్ళు సామాన్య భక్తులను ఎలా గౌరవిస్తారు? ఆలయ అభివృద్ధిని మరిచిపోయి ఇలా అర్చకులపై పెత్తనం చూపడం సిగ్గుచేటు.

రాగిడి మంగ శ్రీనివాసరెడ్డి
సామాజిక కార్యకర్త



# అడుగడుగునా పుట్టగొడుగుల్లా వెలుస్తున్న మెడికల్ షాపులు

◆ డిస్కౌంట్‌ల పేరుతో కస్టమర్ల ఆకర్షణ ◆ జనరిక్ మందులతో లక్షల్లో వ్యాపారం ◆ అధికారుల పర్యవేక్షణ లోపంతో ఆడిందే ఆట పాడిందే పాట ◆ ఒరిజినల్ మందులకు బదులుగా జనరిక్ మందులు విక్రయిస్తూ అడ్డగోలు దోపిడీ

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి జిల్లాలో మెడికల్ షాపుల దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతోంది. పల్లెలు, పట్టణాలు, జిల్లా కేంద్రం వరకు గల్లీ నుంచి మొదలుకొని మెయిన్ రోడ్డు వరకు సందు సందున పుట్టగొడుగుల్లా వెలుస్తున్న మెడికల్ షాపులలో ఒరిజినల్ మందులకు బదులుగా జనరిక్ మందులను అధిక ధరలకు విక్రయిస్తూ అడ్డగోలుగా దోచుకుంటున్నారని వినియోగదారులు వాపోతున్నారు.పెద్దపల్లి జిల్లా కేంద్రంలో మెడికల్ షాపులు రోజు రోజుకు రెట్టింపు అవుతూ పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. లక్షల పెట్టుబడులు పెట్టి మెడికల్ షాపుల యజమానులు, వేలల్లో అద్దెలు చెల్లిస్తూ జిగేల్ మనేల మెడికల్ షాపులను ఏర్పాటు చేస్తున్నారంటే వారి సంపాదన ఏ విధంగా ఉందో అర్థం కావాలి. వివరాలకెళితే పెద్దపల్లి జిల్లాలో దాదాపు 650, జిల్లా కేంద్రంలో దాదాపు 75 మెడికల్ షాపులు ధనార్జన ధ్యేయంగా మెడికల్ షాపులలో జనరిక్ మందులు అమ్ముకుంటూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతూ లక్షలు సంపాదిస్తున్నారు. మెడికల్ షాపులలో కస్టమర్లకు అనుమానం రాకుండా ఒరిజినల్ మందులకు బదులు జనరిక్ మెడిసిన్



అమ్ముకుంటూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఒరిజినల్ మందులకు జనరిక్ మందులకు ధరలలో చాలా తేడా ఉండడంతో పలు మెడికల్ షాపులలో తక్కువ ధరకే వచ్చే జనరిక్ మందులు అధికంగా విక్రయిస్తు వందకు వంద శాతం లాభం పొందుతున్నారని, దీనికి తోడు కస్టమర్లను ఆకర్షించడానికి 10 నుండి 20 శాతం వరకు మందుల ధరపై డిస్కౌంట్ చేసి అమ్ముతు న్నారని పలువురు ఆరోపిస్తున్నారు. జిల్లాలోని మెడికల్ షాప్ లపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో వాళ్ళు ఆడింది ఆటగా పాడిందే పాటగా నడుస్తున్నదని, వాళ్ళ వ్యాపారాలు మూడు పువ్వులు ఆరు కాయలుగా అభివృద్ధి చేసుకుంటున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు స్పందించి జనరిక్ మందులను కూడా అధిక ధరలకు విక్రయిస్తూ ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం ఆడుతున్న మెడికల్ షాప్‌ల యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలని, వాళ్ల మెడికల్ షాపుల లైసెన్సులను రద్దుచేసి కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

శ్రావణ్ పెద్దపల్లి డ్రగ్ ఇన్స్పెక్టర్ : మెడికల్ షాపులలో ఒరిజినల్ మందులకు బదులుగా జనరిక్ మందులు విక్రయించడం నేరమని, ఈ విషయంలో వినియోగదారులు తమ దృష్టికి తీసుకువస్తే ఆయా షాపులపై తప్పకుండా చర్యలు తీసుకుంటామని, మెడికల్ షాపులలో దోపిడికి పాల్పడినట్లయితే 8333818142 నెంబర్ కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.



## అనారోగ్య సమస్యలతో బాధపడుతూ వ్యక్తి మృతి

**ధర్మపురి, అక్టోబర్ 21, (ది క్రైమ్ న్యూస్):** అనారోగ్య సమస్యతో బాధపడుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన ధర్మపురి మండలం దమ్మన్నపేట్ గ్రామంలో చోటుచేసుకుంది. ధర్మపురి ఎస్సై ఉదయ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం ధర్మపురి మండలంలోని దమ్మన్నపేట గ్రామానికి చెందిన జగ్గిశెట్టి సచిన్ (29)అను వ్యక్తికి చిన్నప్పటి నుంచి కుడి చేతికి నరాల సంబంధిత వ్యాధి ఉన్నదని, దాని గురించి పలు మార్లు చాలా ఆసుపత్రులు తిరిగి చూపించిన నయం కాలేదని, ఇటీవల హైదరాబాద్ లోని అపోలో జూబ్లీ ఆసుపత్రి నందు శస్త్ర చికిత్స చేయించినారు. అయినప్పటికి అతని సమస్య నయం కాలేదని కుటుంబం సభ్యులు తెలిపారు. దీని గురించి ఎల్లప్పుడూ తీవ్రంగా ఆలోచిస్తూ తీవ్ర దిగ్భ్రాంతి కి గురి అవుతూ అందరి దగ్గర తన సమస్యను చెప్పుకుంటూ బాధపడేవాడని గ్రామస్తులు తెలిపినట్లు పేర్కొన్నారు. ఈ సమస్య నయం కాకపోవడం తో సోమవారం రోజున సాయంత్రం 6 గంటల సమయంలో ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి జీవితం పై విరక్తి చెంది తన గదిలో ఉన్న సీలింగ్ ఫ్యాన్ కు పొడవైన తువ్వాలతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు, ఇట్టి విషయమై తన తల్లి జగ్గిశెట్టి ప్రమీల ధర్మపురి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు ఇవ్వగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉదయ్ కుమార్ పేర్కొన్నారు.



## వాహనదారులకు ఇబ్బంది కలగకుండా చర్యలు

**ముత్తారం.అక్టోబర్.21.(ది క్రైమ్ న్యూస్):** ముత్తారం మండలం కేషన్నపల్లి సమీపంలోని మూలమలుపు వద్ద రోడ్డుకు అడ్డుగా పెరిగిన చెట్లను ముత్తారం ఎస్సై రవికుమార్ జెసిబి సహాయంతో మంగళవారం తొలగించారు. ప్రధాన రహదారిలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు మూల మలుపుల వద్ద అధికంగా పెరిగిన మొక్కలతో పాటు,చెట్లను తొలగించినట్లు ఆయన తెలిపారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని,మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వవద్దని సూచించారు.ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది సుమంత్, రాజు పాల్గొన్నారు.



## పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు ఆత్మీయ సన్మానం



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి పట్టణంలోని టీచర్స్ కాలనీలో నివాసముండే దొంకెన రవి పెద్దపల్లి జిల్లా కోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులైన సందర్భంగా, అదేవిధంగా పెద్దపల్లి రిక్రియేషన్ క్లబ్ కల్చరల్ సెక్రటరీగా నియమితులైన ఎడ్ల మహేందర్, ఈసి మెంబర్‌గా నియమితులైన బండ లింగారావు లను కాలనీవాసులు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గుజ్జుల కుమార్ ఆధ్వర్యంలో ఆత్మీయంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారికి శాలువా కప్పి సన్మానించి, అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులున్నారు.

## “తెలంగాణ రైజింగ్ - 2047 “ సిటిజన్ సర్వేలో అందరూ పాల్గొనాలి

**- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష - ఈనెల 25తో ముగియనున్న సర్వే**

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** తెలంగాణా రాష్ట్ర భవిష్యత్ రూపకల్పనకై ఉద్దేశించిన “తెలంగాణ రైజింగ్ – 2047 “ సిటిజన్ సర్వే కు ప్రజల నుండి విశేష స్పందన లభిస్తోంది. ఇప్పటివరకు ఈ సిటిజన్ సర్వేలో కేవలం తెలంగాణ నుండే వివిధ ప్రాంతాల పౌరులు పాల్గొని తమ విలువైన సమాచారాన్ని అందచేశారు. భారత దేశ స్వాతంత్ర్యానికి వంద సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా 2047 నాటికి తెలంగాణ రాష్ట్రం ఎలా ఉండాలో ప్రజల నుండి తగు సలహాలు, సూచనలు చేపట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం “తెలంగాణ రైజింగ్ – 2047 “ సిటిజన్ సర్వేను చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం గత వారం ప్రారంభించిన ఈ సర్వే ఈనెల 25 వతేదీ తో ముగుస్తుంది. ఈ సర్వే రాష్ట్రంలోని ప్రతీ ఒక్కరికీ అందుబాటులో ఉన్నందున వెబ్సైట్‌ను సందర్శించి ప్రతీ ఒక్కరు తమ అమూల్యమైన సలహాలు, సూచనలను అందించాల్సింగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఒక ప్రకటనలో తెలియ చేశారు.



## ఆస్తికోసం అన్నదమ్ముల పంచాయితీ మూడ్రోజులుగా ఇంటిముందే తండ్రి శవం

**పల్నాడు, అక్టోబర్21** ఆస్తి పంచాయితీలో మర్యాదలు మరచిన అన్నదమ్ములు తండ్రి అంత్యక్రియలు చేయకుండా శవాన్ని ఒటిముందే పెట్టేశారు. పోలీసులు, అధికారులు నచ్చచెప్పినా వినలేదు. అనారోగ్యంతో తండ్రి మృతి చెందగా,అంత్యక్రియలు చేయాల్సిన కుమారులు మొండికేశారు. ఆస్తి పంపకాలు జరిగితే తప్ప దహన సంస్కారాలు చేయబోమని తేల్చి చెప్పారు. గ్రామ పెద్దలు, పోలీసులు నచ్చజెప్పినా ముందుకు రాలేదు. దీంతో మూడు రోజులుగా తండ్రి మృతదేహం ఇంటి ముందే పెట్టుకొని ఉన్నారు. ఈ అమానవీయ ఘటన పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం పాత సొలస గ్రామంలో చోటుచేసుకుంది. పాత సొలస గ్రామానికి చెందిన గువ్వల పెద్ద ఆంజనేయులు(85) మృతి చెందడంతో కొడుకుల మధ్య ఆస్తి పంపకాల తగాదా వచ్చింది. 20 ఎకరాల పొలం సంపాదించారు. ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. పదేళ్ల క్రితం భార్య చనిపోయింది. పెద్దకుమారుడు నాగేశ్వరరావు కులాంతర వివాహం చేసుకొని తెలంగాణలో ఉంటున్నాడు. చిన్నకుమారుడు భార్యతో కలిసి ఊర్లోనే నివాసం ఉంటున్నాడు. చిన్న కొడుకు వద్దే ఉంటున్న ఆంజనేయులు అనారోగ్యంతో మూడు రోజుల క్రితం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న నాగేశ్వరరావు గ్రామానికి వచ్చి.. ఆస్తిలో తన వాటా తనకు ఇవ్వాలని, అప్పుడే అంత్యక్రియలు జరుగుతాయని మొండికేశాడు. గతంలో రెండెకరాలు ఇచ్చామని, అన్ని బాధ్యతలు తాను చూశాను గనక.. ఇంకా ఇవ్వలేమని చిన్నకుమారుడు తేల్చి చెప్పాడు. ఈ నేపథ్యంలో ఇద్దరి మధ్య వివాదం జరిగి అంత్యక్రియలకు తీసుకెళ్లాల్సిన మృతదేహాన్ని.. ఇంటి ముందే నిలిపివేశారు. మూడు రోజులుగా గ్రామంలోని పెద్దలు సర్దిచెబుతున్నా సమస్య పరిష్కారం కాలేదు. విషయం తెలుసుకున్న పోలీసులు గ్రామానికి వెళ్లి అంత్యక్రియలు నిర్వహించకపోతే.. తామే మృతదేహాన్ని పంచాయతీకి అప్పగిస్తామని హెచ్చరించినా ఫలితం లేకపోయింది. ఆస్తికోసం తండ్రికి అంత్యక్రియలు నిర్వహించకుండా కుమారులు మానవత్వాన్ని మంటగలిపారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు.

## గూగుల్ రాకతో విశాఖకు మహర్దశ

**ఏలూరు, అక్టోబర్21** ఏపీకి ఐటీ దిగ్గజ సంస్థ గూగుల్ రాకతో గ్లోబల్ కనెక్టివిటీ కేంద్రంగా విశాఖపట్నం మారనుందని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. మంగళవారం నిడదవోలులో ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌లు ప్రత్యేక దృష్టి సారించి గూగుల్‌ను ఏపీకి తీసుకొచ్చారని పేర్కొన్నారు. ఏఐ హబ్, డేటా సెంటర్ ద్వారా ఐటీ రంగంలో ఏపీ శరవేగంగా దూసుకెళ్లేందుకు దోహదపడుతాయన్నారు. రాష్ట్ర ఐటీ రంగాన్ని మలుపుతిప్పే గేమ్ ఛేంజర్‌గా నిలవనున్న ఈ డేటా సెంటర్.. ఏపీని 12 దేశాలకు అనుసంధానం చేయనుందని అన్నారు. ఇక్కడ డేటా స్టోరేజీతో పాటు ఏఐ ఆధారిత అప్లికేషన్స్‌ను ప్రాసెస్ చేసేందుకు అవసరమైన కంప్యూటింగ్ సదుపాయాలను సమకూర్చనుందన్నారు. రాబోయే రోజుల్లో డేటా సెంటర్‌కు అనుబంధంగా ఏర్పాటయ్యే కంపెనీలతో పరోక్షంగా లక్షలాది మందికి ఉద్యోగ అవకాశాలు కలిగే అవకాశముందన్నారు.

## తిరుమలలో కుండపోత వర్షం అధికారులతో చర్చించిన అదనపు ఇవో

**తిరుమల, అక్టోబర్21:** తిరుమలలో కుండపోత వర్షంతో భక్తులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. దీనికితోడు చలి కూడా తోడయ్యింది. ఈక్రమంలో భారీ వర్షాలకు భక్తులు ఇబ్బంది పడకుండా తీసుకోవాల్సిన చర్యలపైనా అధికారులతో అదనపు ఇవో వెంకయ్య చౌదరి చర్చించారు. వర్షం కురుస్తున్న సమయంలో భక్తులకు వేడివేడిగా అన్న ప్రసాదాలు అందించేందుకు సమయానుగుణంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. భారీ వర్షాల సమయంలో క్యూలైన్లు బయటకు రాకుండా ఉన్న మౌలిక సదుపాయాలు సమర్థంగా ఉపయోగించుకోవాలన్నారు. దీనికి అనుగుణంగా ఎస్ఎస్‌డీ టోకెన్ల జారీ తగ్గింపు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తద్వారా సర్వదర్శనం భక్తులు త్వరగా నారాయణగిరి షెడ్లకు చేరుకోవడానికి వీలుంటుందన్నారు. భారీ వర్షాలకు కొండ చరియలు, చెట్లు విరిగిపడితే ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ఎప్పటికప్పుడు జేసీబీల ద్వారా తొలగించాలన్నారు. తిరుమలలో నిర్ణీత ప్రమాణాలతో భక్తుల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ చర్యలు తీసుకోవాలని తితిదే అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి అధికారులను ఆదేశించారు.వర్షాకాలం నేపథ్యంలో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో మురళీకృష్ణ, తితిదే అధికారులతో వర్చువల్‌గా సమావేశం నిర్వహించారు. డిజాస్టర్ రెస్పాన్సివ్ టీమ్ ను కమాండ్ కంట్రోల్ రూమ్‌తో అనుసంధానం చేసి చీఫ్ ఇంజినీర్ నేతృత్వంలో విపత్తు స్పందన చర్యలు చేపట్టాలన్నారు. అందులో భాగంగా పురాతన గోపురాలు, కట్టడాల దృఢత్వం, సంరక్షించే చర్యల్లో భాగంగా ఒక సంస్థాగత విభాగం ఉంటే బాగుంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు.

# ధర్మపురికి డిగ్రీ కళాశాల మంజూరు

◆ నియోజకవర్గ ప్రజలకు అసలైన దీపావళి ఈ రోజే: రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్







**ధర్మపురి అక్టోబర్ 20, (ది క్రైమ్ న్యూస్):** దీపావళి పర్వదినం సందర్భంగా రాష్ట్ర ఎస్సీ ఎస్టీ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ధర్మపురి ప్రజలకు శుభవార్తను అందించారు. నియోజకవర్గ ప్రజలకు అసలైన దీపావళి పండుగ ఈ రోజే జరుపుకోవాలని ఈ సందర్భంగా అడ్లూరి గుర్తుచేశారు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న డిగ్రీ కళాశాల మంజూరు కావడం ధర్మపురి యువతకు కొత్త భవిష్యత్తు దిశగా దారి చూపుతుందని మంత్రి అడ్లూరి ఆశాభావం వ్యక్తం చేశారు. ఇకపై ఉన్నత విద్య కోసం ఇతర పట్టణాలకు వలస వెళ్ళవలసిన అవసరం ఉండదని మంత్రి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కి, ధర్మపురి ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల కష్టాలు తెలిసిన వాడిని కాబట్టి విద్య, ఉపాధి రంగాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టానాని అడ్లూరి పేర్కొన్నారు. ధర్మారం మండలంలో ఐటీఐ కళాశాల నిర్మాణానికి భూమిపూజ ఇప్పటికే నిర్వహించాం అని నేరేళ్ల గ్రామం వద్ద సుమారు 200 కోట్ల వ్యయంతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం చేపట్టబోతున్నాం అని గుర్తుచేశారు. ఎందరో మేధావులు, కవులు, వేదపండితులను తీర్చిదిద్దిన శ్రీ లక్ష్మీ నరసింహ సంస్కృతాంధ్ర కళాశాలను పునః ప్రారంభించామని తెలిపారు. అదనంగా, ధర్మపురి ప్రాంత యువతను పోటీ పరీక్షలకు సిద్ధం చేయడానికి యూత్ ట్రైనింగ్ సెంటర్, డిజిటల్ లైబ్రరీ, ఇ-క్లాస్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు మంత్రి అడ్లూరి వెల్లడించారు. ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యంగా కాంగ్రెస్ అధిష్టానం పనిచేస్తుందని ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు భూసేకరణ బాధితులకు సుమారు17 కోట్ల పరిహారం ఇప్పటివరకు అందజేశామని మంత్రి అడ్లూరి తెలిపారు. గత పదేళ్లలో అధికారంలో ఉన్నవారు ప్రజల సమస్యలపై దృష్టి పెట్టలేదని కానీ మా ప్రభుత్వం మాత్రం ప్రజల ఆశలు నెరవేర్చే పరిపాలనకు కట్టుబడి ఉందని సంక్షేమమే మా కాంగ్రెస్ పార్టీ ధ్యేయం అని అన్నారు. సంక్షేమం, సమగ్రాభివృద్ధి, సమానత్వం ఇవే కాంగ్రెస్ ప్రభుత్వ యొక్క మూడుప్రధాన స్తంభాలని ప్రజలకు వాస్తవ మార్పు కనిపించేటట్లు కృషి చేస్తున్నాం అని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ స్థాయి, ధర్మపురి మండల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అమరుల త్యాగాలు ఆశయాల సాధన దిశగా ముందుకు సాగాలి

● సిఐ రామ్ నర్సింహారెడ్డి



**ధర్మపురి, అక్టోబర్ 21, (ది క్రైమ్ న్యూస్):** విధి నిర్వహణలో, దేశ రక్షణ కోసం ప్రాణాలు కోల్పోయిన పోలీస్ అమరవీరుల సంస్మరణ పోలీస్ ఫ్లాగ్ డే ను ధర్మపురి పట్టణంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలో ఏర్పాటు చేసిన అమరవీరుల స్తూపం వద్ద సిఐ రామ్ నర్సింహారెడ్డి తో పాటు ఎస్సై ఉదయ్ కుమార్, పోలీస్ సిబ్బంది తో పాటు అధికారులు, వివిధ పార్టీల నాయకులు అమరవీరుల కుటుంబ సభ్యులతో కలిసి నివాళులర్పించారు. అనంతరం సాయుధ పోలీసులు"శోక్ శస్త్" చేసి మరణించిన పోలీసు అమరవీరులకు పోలీసు అధికారులు, సిబ్బంది అమరవీరుల కుటుంబ సభ్యులు రెండు నిమిషాలు మౌనం పాటించి గత ఏడాది నుండి ఇప్పటి వరకు దేశంలో విధి నిర్వహణలో మరణించిన పోలీస్ అమరవీరుల పేర్లను చదివి వినిపించారు. ఈ సందర్భంగా సిఐ రామ్ నర్సింహారెడ్డి మాట్లాడుతూ ఈ సమాజం కోరుకునేది శాంతి, స్థిరత్వం, అభివృద్ధి, పోలీస్ శాఖ వారి త్యాగాల ద్వారా ఎన్నో దశాబ్దాలుగా సమాజం లో ప్రతి ఒక్కరికి రక్షణ కల్పిస్తూ, సామాజిక రుగ్మతలను పారద్రోలడం వరకు పోలీసు వ్యవస్థ ఎల్లప్పుడూ కార్యదీక్షతో, సేవాతత్పరత తో పని చేస్తుందన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలర్పించి అమరవీరులైన పోలీసుల త్యాగాలు వెల కట్టలేనివి వారి త్యాగాలను గుర్తు చేసుకుంటూ ప్రభుత్వం క్రమం తప్పకుండా ప్రతి ఏటా అక్టోబరు 21న పోలీసు అమరవీరుల సంస్మరణార్థం పోలీస్ ఫ్లాగ్ డే ను ఘనంగా నిర్వహిస్తోందని గుర్తుచేశారు. అమర వీరులు అయిన పోలీసుల యొక్క త్యాగాలను గుర్తు చేసుకుంటూ అక్టోబర్ 21 నుండి అక్టోబర్ 31వ వరకు సంస్మరణ కార్యక్రమాలు నిర్వహించడం జరుగు తుందని సిఐ పేర్కొన్నారు. రాష్ట్ర డిజిపి గారి ఆదేశాల మేరకు జిల్లాలో ఉన్న అన్ని పోలీసు స్టేషన్ల లో పోలీసు అమర వీరుల సంస్మరణ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ఆయన వివరించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు సక్రమంగా ఉంటే మారుమూల గ్రామాలకు కూడా అభివృద్ధి సాధ్యమవుతుందని సిఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు సంఘన బాట్ల రామకిష్టయ్య, వివిధ పార్టీల నాయకులు, సామాజిక వేత్తలు, అధికారులు పాల్గొన్నారు.



# మానకొండూర్‌లో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం

**మానకొండూర్, అక్టోబర్ 21(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలకేంద్రంలో సి.ఐ బొలిమాల సంజీవ్ ఆద్వర్యంలో మంగళవారం పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.వేడుకలకు జిల్లా పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, రూరల్ ఏసిపి విజయ్ కుమార్ హాజరై మండలకేంద్రంలోని దివంగత మాజీ ఎస్ఐ ఉండింటి సంజీవ్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు.అనంతరం ఏసిపి విజయ్ కుమార్ మాట్లాడుతూ.....ఎస్ఐ సంజీవ్ తన విది నిర్వాహణలో 2002 మార్చి 11న తుపాకుల గూడెంలో నక్సలైట్లతో పోరాడి తన ప్రాణాలను కోల్పోగా 23 సంవత్సరాలు గడుస్తున్నా ఎస్ఐ సంజీవ్ సేవలు కొనియాడడం హర్షించదగ్గ విషయమని పేర్కొంటూ ప్రతి ఒక్కరు ఎస్ఐ సంజీవ్ సేవలను స్మరించుకోవాలని పోలీస్ శాఖ తరుపున కోరుతున్నట్లు తెలిపారు. సి.ఐ సంజీవ్ మాట్లాడుతూ....1959 అక్టోబర్ 21న బారత సరిహద్దులోని అక్సాయ్ చీట్ హట్ స్ప్రింగ్ వద్ద చైనా దళాలు చేసిన దాడిలో డిఎస్పీ కరమ్ సింగ్ నేతృత్వంలో విధులు నిర్వహిస్తున్న 21మంది పోలీసులు మృతి చెందగా సంఘటనకు గుర్తుగా ఏటా అక్టోబర్ 21న పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని, పోలీస్ అధికారుల ప్రాణత్యాగాల ఫలితంగానే ప్రజలు ప్రశాంతంగా జీవించగలుతున్నారని, ప్రజల కష్టాలు తీర్చే క్రమంలో పోలీసులు ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొంటున్నారనడానికి ఈమధ్య నిజామాబాద్ లో కానిస్టేబుల్ పై జరిగిన ఘటనే ఉదాహరణని ఘటనా సందర్భంలో ప్రజల సహకారం ఉంటే బాగుండేదంటూ భావోద్వేగానికి లోనయ్యారు.కుటుంబానికి దూరంగా నిత్యం ప్రజా సేవకే జీవితం అంకితమిచ్చే పోలీసులకు ప్రజలందరూ సహకరిస్తే రానున్న రోజుల్లో ఇంకా మంచి సేవలు అందించేందుకు అవకాశం ఉందని ధీమా వ్యక్తంచేశారు.కార్యక్రమంలో తహశీల్దార్ విజయ్ కుమార్, తిమ్మాపూర్ సి.ఐ సదన్ కుమార్, స్థానిక ఎస్సై శ్రవంతి, పోలీస్ సిబ్బంది, దివంగత ఎస్ఐ సంజీవ్ కుటుంబ సభ్యులు, స్థానిక మాజీ ప్రజా ప్రతినిధులు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# పోలీసుల త్యాగం మరువలేనిది: ఎస్ఐ సిరిసిల్ల అశోక్

**ఇల్లంతకుంట, అక్టోబర్ 21, (ది క్రైమ్ న్యూస్):** రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలకేంద్రంలో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం పురస్కరించుకొని మంగళవారం రాత్రి పోలీస్ స్టేషన్ నుండి వివేకానంద విగ్రహం మీదుగా బస్టాండ్ వరకు పోలీస్ అమరవీరుల ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ ఆవరణలో విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీస్ అమరవీరులకు జోహార్లను అర్పించారు. కొవ్వొత్తులను ఉంచి నివాళులు అర్పించారు. హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ, కానిస్టేబుళ్లు అనిల్, ఆర్ సురేష్, హెూంగార్డ్ వెంకటేశం, తో పాటుగా, ఇల్లంతకుంట గ్రామ యువత, ఆయా గ్రామాల యువకులు, గ్రామస్తులు పలువురు కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్నారు.



# రాష్ట్రంలో కొత్తగా 7 డయాలిసిస్ కేంద్రాలు

## వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి

**అమరావతి, అక్టోబర్21:** రాష్ట్రంలో కొత్తగా 7 ప్రాంతాల్లో డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్టు రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో కిడ్నీ వ్యాధిగ్రస్తుల కోసం 232 డయాలసిస్ కేంద్రాలు పని చేస్తుండగా.. కొత్తగా రానున్న కేంద్రాలతో కలిపి వీటి సంఖ్య 239కి చేరుతుందన్నారు. ప్రధానమంత్రి నేషనల్ డయాలసిస్ ప్రోగ్రాం కింద కొత్త డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటు కానుండగా.. ఒక్కొక్క కేంద్రంలో రూ.75 లక్షల విలువ చేసే రక్త శుద్ధి యంత్రాలు, పరికరాలు ఏర్పాటు చేయనున్నామని వెల్లడించారు. కొత్తగా విజయనగరం జిల్లా ఎస్.కోట, పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం, చిత్తూరు జిల్లా పీలేరు, పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట, నెల్లూరు జిల్లా జిల్లా వెంకటగిరి, బాపట్ల జిల్లా అద్దంకి, నంద్యాల జిల్లా సున్నిపెంట సీహెచ్‌సీ ఆసుపత్రుల్లో డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటు కానున్నాయని చెప్పారు. ప్రతి కేంద్రంలో రోజూ 3 సెషన్ల ద్వారా 15 మందికి రక్తశుద్ధి చేయనున్నారని వెల్లడించారు.

# పోలీసుల త్యాగం మరువలేనిది ఎక్స్ వేదికగా డిప్యూటి సిఎం పవన్

**అమరావతి, అక్టోబర్21:** పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా నివాళు లు అర్పిస్తూ ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఎక్స్ వేదికగా స్పందించారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో ప్రాణ త్యాగం చేసిన వీర పోలీసు సైనికులకు హృదయపూర్వక నివాళులు అర్పిస్తున్నాను అని ఆ పోస్టులో తెలిపారు. శాంతి, భద్రతల కోసం అహర్నిశలు కృషి చేస్తున్న పోలీసు సిబ్బందికి అభినందనలు.. పోలీసుల త్యాగం, సేవ తర తరాలను ప్రేరేపిస్తోంది అన్నారు. ప్రజా భద్రత, చట్టం, శాంతి పరిరక్షణలో అప్రతిహతంగా పోలీసులు పని చేస్తున్నారని ఉప ముఖ్యమంత్రి పవన్ రాసుకొచ్చారు.ఇక, క్రైమ్ రేటు తగ్గించడంలో పోలీసుల చేపట్టే ప్రణాళిక, ప్రజా ముఖ్య దృష్టి కోణం ప్రశంసనీయం అని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తెలిపారు. విధుల పట్ల అంకితభావంతో పని చేసే పోలీసుల త్యాగాన్ని ప్రతి ఒక్కరు స్మరించుకోవాలని ఆయన పేర్కొన్నారు.

# నేడు సదర్ ఉత్సవ వేడుకలు

## నారాయణగూడ ప్రాంతంలో ట్రాఫిక్ ఆంక్షలు

**హైదరాబాద్, అక్టోబర్21:** వాహనదారులకు హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు కీలక సూచన చేశారు. సదర్ ఉత్సవ మేళా సందర్భంగా నగరంలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు తెలిపారు. నారాయణగూడలోని వైఎంసిఎ దగ్గర బుధవారం రాత్రి 7 గంటల నుంచి తెల్లవారుజామున 4 గంటల వరకు సదర్ ఉత్సవ మేళా జరగనున్న నేపథ్యంలో ట్రాఫిక్ అమల్లో ఉంటాయని వెల్లడించారు. రామ్‌కోటి, లింగంపల్లి, నారాయణగూడ, బర్కత్‌పురా, విజయనగరం, హిమాయత్‌నగర్ ప్రాంతాల్లో వాహనాల రాకపోకలు తాత్కాలికంగా మళ్లింపులు చేపట్టనున్నట్లు తెలిపారు. సదర్ మేళాకు వచ్చే వారు తమ వాహనాలను కేశవ మెమోరియల్ కళాశాల మైదానంలో పార్క్ చేయాలని పోలీసులు సూచించారు. వాహనదారులు సహకరించి ప్రత్యామ్నాయ మార్గాలు ఉపయోగించుకోవాలి- ట్రాఫిక్ పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# పత్తి కొనుగోళ్లను ప్రారంభించిన పొంగులేటి

**ఖమ్మం, అక్టోబర్21** తెలంగాణ వ్యాప్తంగా మంగళవారం నుంచి సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభయ్యాయి. ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ ఏడాది ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌లో 317 జిన్నింగ్ మిల్లులను సీసీఐ నోటి÷ చేసింది. ఈ నెల 24న నల్గొండ జిల్లాలో పలు సీసీఐ కేంద్రాలను మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించనున్నారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం టోల్‌ఫ్రీం నెంబర్ 18005995779 ఏర్పాటు చేసినట్లు తుమ్మల పేర్కొన్నారు.

# కుటుంబ పార్టీలను ఓడించాలి

## బిజెపి అభ్యర్థి నామినేషన్ ర్యాలీలో కిషన్ రెడ్డి

**హైదరాబాద్, అక్టోబర్21:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కుటుంబ పార్టీలకు ప్రజలకు బుద్ధిచెప్పాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కోరారు. భారత రాష్ట్ర సమితి, కాంగ్రెస్, మజ్లిస్ పార్టీలు ఒక్కటై రాజకీయాలు చేస్తున్నాయన్నారు. భాజపా అభ్యర్థి లంకల దీపక్‌రెడ్డి నామినేషన్ ర్యాలీలో కేంద్రమంత్రి బండి సంజయ్, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు, ఎంపీలు ఈటల రాజేందర్, రఘునందన్‌రావుతో కలిసి కిషన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడారు.మజ్లిస్ పార్టీ దోపిడీ, దౌర్జన్యాల కారణంగా నగరంలో ఎలాంటి పరిస్థితి ఉందో అందరికీ తెలుసు. ఏ పార్టీ అధికారంలో ఉంటే వారి పక్కన మజ్లిస్ చేరి ప్రజలపై పెత్తనం చేస్తోంది. అందుకే ఆ మూడు పార్టీలకు ప్రజలకు బుద్ధి చెప్పాల్సిన అవసరముంది. భాజపా అభ్యర్థి దీపక్‌రెడ్డిని గెలిపించాలని కిషన్‌రెడ్డి కోరారు. జూబ్లీహిల్స్ అంటే ఎంతో అభివృద్ధి చెందిన, ధనవంతులు ఉండే ప్రాంతం అనుకుంటాం. రోడ్లు బాగుంటాయని భావిస్తాం. కానీ.. ఎక్కడ చూసినా చెత్త, మురుగునీరు ఉంటోంది. సరైన రోడ్లు, వీధి లైట్లు ఉండవు. హైదరాబాద్‌ను లండన్, వాషింగ్టన్, సింగపూర్ చేస్తానని చెప్పిన వ్యక్తి ఇప్పుడు ఫాంహౌస్‌లో ఉన్నారు. ఇక్కడి ప్రజలకు మాత్రం డ్రైనేజీ సమస్యలు, ఇతర ఇబ్బందులు మిగిలాయి. జాబ్ క్యాలెండర్ ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఉద్యోగాలు ఎక్కడ? కాంగ్రెస్ అభ్యర్థిని మజ్లిస్ కార్యాలయం దారుస్సలాంలో నిర్ణయించారు. కాంగ్రెస్ అభ్యర్థి మజ్లిస్ నేతల ఆశీస్సులు తీసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ ఇంత దారుణంగా వ్యవహరిస్తోంది.

# నల్లగొండలో మత్తు మాత్రల దందా పోలీసుల దాడిలో పలువరి అరెస్ట్

**నల్లగొండ, అక్టోబర్21:** నల్గొండలో అక్రమంగా మత్తు మాత్రలు విక్రయిస్తున్న ముఠా గుట్టురట్టయింది. ఈగల డ్రగ్ కంట్రోల్ బోర్డు అధికారుల తోపాటు నల్లగొండ పోలీసులు జాయింట్ ఆపరేషన్ నిర్వహించి మత్తు మాత్రలను విక్రయిస్తున్న ముఠాను పట్టుకున్నారు. నల్లగొండ జిల్లాలో జోరుగా మత్తు గోలీల అక్రమ దందా సాగుతోంది. ఎలాంటి ప్రిస్క్రిప్షన్ లేకుండా మత్తు మాత్రలను విక్రయిస్తున్న ముఠాతోపాటు కొనుగులు చేసిన వారిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి భారీగా మత్తు మాత్రలను స్వాధీనం చేసుకున్నారు. జిల్లాలో తొర్రూర్ మండలం కేంద్రంలోని ఓ మెడికల్ షాపునుంచి కొనుగోలుచేసి అక్రమంగా విక్రియస్తున్నట్లు డ్రగ్ కంట్రోల్ అధికారులు గుర్తించారు. మంగళవారం నల్లగొండ పోలీసులు జరిపిన దాడిలో టాబ్లెట్లను అక్రమంగా విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ప్రధాన పెడ్లర్ మద్ జబినుల్లా, మెడికల్ షాపు ఓనర్ దారం కృష్ణసాయితోపాటు 8 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరో 9మంది పరారీలో ఉన్నారు. వీరిపై కేసు నమోదు చరేశారు. మహ్మద్ జబీనుల్లా అనే వ్యక్తి గత కొంత కాలంగా మత్తు మాత్రలకు బానిపై కొనుగోలు, అమ్మకాలు జరుపుతున్నట్లు పోలీసులు గుర్తించారు.

# బ్లూ ఆధార్ కార్డ్‌లో బయోమెట్రిక్
## వివరాల అప్‌డేట్ కోసం ఎంత చెల్లించాలి?




ఆధార్ సంఖ్య వ్యక్తిగత గుర్తింపు మాత్రమే కాదు, ఎన్నో అవసరాలకు ఉపయోగపడుతుంది. చాలా ప్రభుత్వ కార్యాలయాల్లో ఆధార్ ప్రధాన వనరుగా పరిగణిస్తారు. దీంతో చిన్నారుల నుంచి వృద్ధుల వరకు అందరికీ ఆధార్‌ను తప్పనిసరి. బోర్డింగ్ స్కూల్ నుండి ఆసుపత్రి వరకు, ప్రతిచోటా ఆధార్‌ను ప్రాథమికంగా ఉపయోగపడుతుంది. పెద్దలకే కాకుండా పిల్లలకు కూడా ఆధార్ కార్డు అందుబాటులో ఉంది. దీనిని బ్లూ ఆధార్ కార్డ్ అంటారు. 5 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలకు బ్లూ ఆధార్ కార్డ్ తీసుకువచ్చింది కేంద్రం. దీనిని 2018లో ప్రారంభించింది. దీని ప్రకారం, ఈ బ్లూ ఆధార్ కార్డ్ 5 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలకు జారీ చేస్తారు. బాల్యంలో ఆధార్ కార్డు జారీ చేసినందున తల్లిదండ్రులు తమ పిల్లల బ్లూ ఆధార్ కార్డును రెండుసార్లు పునరుద్ధరించాలి. ఈ సందర్భంలో బ్లూ ఆధార్ కార్డ్‌లో బయోమెట్రిక్ వివరాలను అప్‌డేట్ చేయడానికి ఎంత చెల్లించాలి? ఎలా అప్‌డేట్ చేయాలో వివరంగా చూద్దాం. బ్లూ ఆధార్ బయోమెట్రిక్ అప్‌డేట్: 5 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలకు బ్లూ ఆధార్ కార్డులు జారీ చేసిన తర్వాత వారు పెద్దయ్యాక వేలిముద్ర, ఐరిస్‌తో సహా వారి బయోమెట్రిక్ ఆధారాలు ఇవ్వాల్సి ఉంటుంది. ఈ కారణంగా, పిల్లలు పెద్దలు కాగానే వారి బయోమెట్రిక్ వివరాలను అప్‌డేట్ చేయడం తప్పనిసరి. దీని ప్రకారం, తల్లిదండ్రులు తమ పిల్లలకు 5 సంవత్సరాలు, 15 సంవత్సరాలు నిండినప్పుడు బ్లూ ఆధార్ కార్డును రెండుసార్లు పునరుద్ధరించాలి. దీని ప్రకారం, తల్లిదండ్రులు తమ పిల్లల ఆధార్ కార్డులను సేవా కేంద్రంలో ఉచితంగా అప్‌డేట్ చేసుకోవచ్చు. దీనికి ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదు. 5, 15 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న పిల్లల బ్లూ ఆధార్ కార్డును అప్‌డేట్ చేయకపోతే, రూ.100 రుసుము వసూలు చేస్తారు. బ్లూ ఆధార్ కార్డ్ కోసం ఎలా దరఖాస్తు చేయాలి? తల్లిదండ్రులు తమ 5 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలకు బ్లూ ఆధార్ కార్డ్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. దీనికి ఎలాంటి ప్రధాన పత్రాలు అవసరం లేదు. మీరు పిల్లల జనన ధృవీకరణ పత్రం లేదా ఆసుపత్రిలో తల్లిదండ్రులు ఉపయోగించే డిశ్చార్జ్ స్లిప్‌తో కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. పిల్లలను పాఠశాలలో చేర్పిస్తే, ఆకార్డు కూడా ఉపయోగించవచ్చు. సంబంధిత పత్రాలతో వెబ్‌సైట్‌కి వెళ్లండి. మై ఆధార్‌పై క్లిక్ చేసి, ఆపై అపాయింట్‌మెంట్ బుకింగ్‌పై క్లిక్ చేయండి. కొత్త ఆధార్‌ని ఎంచుకుని, మీ మొబైల్ నంబర్, క్యాప్చా నమోదు చేయండి. ఆపై పిల్లల వయస్సు, అవసరమైన వివరాలను నమోదు చేయండి. అలాగే సమీపంలోని ఆధార్ సేవా కేంద్రంలో అపాయింట్‌మెంట్ బుక్ చేయండి. మీ పిల్లల కోసం మీరు ఇంకా బ్లూ ఆధార్ కార్డ్‌ని తీసుకోనట్లయితే పైన పేర్కొన్న విధానాలను అనుసరించడం ద్వారా మీరు దరఖాస్తు చేసుకోవచ్చని గమనించడం ముఖ్యం.

# మీరు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తున్నారా? అధిక వడ్డీ అందించే బ్యాంకులు ఇవే..!

ఫిక్స్‌డ్ డిపాజిట్ ఇప్పటికీ భారతీయ కస్టమర్‌లలో వారి డిపాజిట్‌ల సురక్షిత పెట్టుబడి కోసం ఉత్తమ ఎంపికగా పరిగణిస్తున్నారు. మీరు కూడా సమీప భవిష్యత్తులో మీ డిపాజిట్లను ఎఫ్‌డీలో పెట్టుబడి పెట్టడం ద్వారా బంపర్ లాభాలను సంపాదించాలని ఆలోచిస్తున్నట్లయితే, దేశంలోని పెద్ద ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకులే కాకుండా, స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు కూడా తమ కస్టమర్‌లకు ఎఫ్‌డీపై బంపర్ రిటర్న్‌లను అందిస్తాయి. ఎఫ్‌డీపై తమ కస్టమర్‌లకు 9.60 శాతం వరకు వడ్డీని అందిస్తున్న 10 స్మాల్ ఫైనాన్స్ బ్యాంకుల గురించి తెలుసుకుందాం. గరిష్టంగా 9.60% వడ్డీ సూర్యోదే స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ తన సాధారణ కస్టమర్లకు 5 సంవత్సరాల ఎఫ్‌డీలపై 9.10% వడ్డీని, సీనియర్ సిటిజన్ కస్టమర్లకు 9.60% వడ్డీని అందిస్తోంది. యూనిటీ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ తన సాధారణ కస్టమర్లకు 1001 రోజుల ఎఫ్‌డీలపై 9% వడ్డీని, సీనియర్ సిటిజన్ కస్టమర్లకు 9.50% వడ్డీని అందిస్తోంది. ఇది కాకుండా ఫిన్‌కేర్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ తన సాధారణ కస్టమర్‌లకు 1000 రోజుల ఎఫ్‌డీలపై 8.51% వడ్డీని, సీనియర్ సిటిజన్ కస్టమర్‌లకు 9.11% వడ్డీని అందిస్తోంది. ఈక్విటాస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ తన సాధారణ కస్టమర్లకు 888 రోజుల ఎఫ్‌డీలపై 8.50% వడ్డీ, సీనియర్ సిటిజన్ కస్టమర్లకు 9% వడ్డీని అందిస్తోంది. మరోవైపు, స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ తన సాధారణ వినియోగదారులకు 2 సంవత్సరాల నుండి 3 సంవత్సరాల కంటే తక్కువ ఎఫ్‌డీలపై 8.50% వడ్డీని అందిస్తోంది. అయితే ఇది సీనియర్ సిటిజన్ కస్టమర్లకు 9% వడ్డీని అందిస్తోంది. ఇక్కడ గరిష్టంగా 9% వడ్డీ మరోవైపు, జన స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ తన సాధారణ కస్టమర్లకు 500 రోజుల ఎఫ్‌డీలపై 8.50% వడ్డీని, సీనియర్ సిటిజన్ కస్టమర్లకు 9% వడ్డీని అందిస్తోంది. ఉత్కర్ష్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ తన సాధారణ కస్టమర్లకు 1000 రోజుల నుండి 1500 రోజుల ఎఫ్‌డీలపై 8.25% వడ్డీని, సీనియర్ సిటిజన్ కస్టమర్లకు 8.85% వడ్డీని అందిస్తోంది. ఇది కాకుండా ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ తన సాధారణ కస్టమర్లకు 560 రోజుల ఎఫ్‌డీలపై




8.25% వడ్డీని, సీనియర్ సిటిజన్ కస్టమర్లకు 8.85% వడ్డీని అందిస్తోంది. శివాలిక్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ తన సాధారణ కస్టమర్లకు 24 నెలల నుండి 36 నెలల ఎఫ్‌డీలపై 8.15% వడ్డీని, సీనియర్ సిటిజన్ కస్టమర్లకు 8.65% వడ్డీని అందిస్తోంది. అదే సమయంలో, స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ తన సాధారణ వినియోగదారులకు 24 నెలల 1 రోజు నుండి 36 నెలల ఎఫ్‌డీలపై 7.75 శాతం వడ్డీని ఇస్తోంది. అలాగే తన సీనియర్ సిటిజన్ కస్టమర్లకు 8.25 శాతం వడ్డీని ఇస్తోంది.

# ఎట్టకేలకు అమల్లోకి ఆ నిబంధన.. ఆ పని చేస్తే కొత్త కారు కొనుగోలుపై రూ.25 వేల డిస్కౌంట్



కొత్త కారు కొనుగోలు అనేది ప్రతి ఒక్కరి కల. అయితే ఇప్పటికే కారు ఉన్న వారు సూపర్ ఫీచర్స్‌తో మరో కారు కొనుగోలు చేయాలని భావిస్తూ ఉంటారు. అయితే కారు మోడల్ మరీ పాతదైతే కనీస ధర కూడా రాదు. ఈ నేపథ్యంలో సంవత్సరాల తరబడి చర్చల తర్వాత, కేంద్ర ప్రభుత్వం, ఆటోమొబైల్ పరిశ్రమ స్క్రాపింగ్ సర్టిఫికేట్‌తో కొత్త కారును కొనుగోలు చేసే వినియోగదారులకు తగ్గింపులను అందించడానికి నిబంధనలు అమల్లోకి వచ్చాయి. పండుగ సీజన్‌కు ముందు కారు కొనాలనుకునే వినియోగదారులకు ఇది పెద్ద ఉపశమనం కలిగించే వార్త అని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో పాత కారుపై ఎంత తగ్గింపు వస్తుంది? నిబంధనలు ఏంటి? అనే అంశాల గురించి వివరాలను తెలుసుకుందాం. స్క్రాపేజ్ పథకం ఫ్లీట్ ఆధునికీకరణ పథకంలో భాగంగా కస్టమర్‌లు వారి పాత వాహనాలకు స్క్రాపేజ్ సర్టిఫికేట్‌ను సమర్పించినప్పుడు కొత్త వాహన కొనుగోళ్లపై తగ్గింపులను అందించాలి. ముఖ్యంగా పాత, తక్కువ సామర్థ్యం ఉన్న వాహనాల స్క్రాపింగ్‌ను ప్రోత్సహించడంతో పాటు కాలుష్యాన్ని తగ్గించడం, రహదారి భద్రతను మెరుగుపరచడం లక్ష్యంగా ఈ పథకాన్ని తీసుకొచ్చారు. మారుతీ సుజుకి, టాటా మోటార్స్, హ్యుందాయ్, కియా, టొయోటా, ఇతర ప్యాసింజర్ వాహన తయారీదారులు స్క్రాప్ చేసిన వాహనాలపై కొత్త కార్ కొనుగోళ్లపై 1.5 శాతం తగ్గింపు లేదా రూ. 20,000 ఏది తక్కువైతే అది అందించాలి. మెర్సిడెస్ బెంజ్ ఇండియా ఒక అడుగు ముందుకు వేసి ప్రస్తుతం ఉన్న ఆఫర్‌లకు మించి రూ. 25,000 ఫ్లాట్ తగ్గింపును అందిస్తోంది. టాటా మోటార్స్, వోల్వో ఐషర్ కమర్షియల్ వెహికల్స్, అశోక్ లేలాండ్, మహీంద్రా మహీంద్రా, ఫోర్స్ మోటార్స్, ఇసుజు మోటార్స్, ఎస్ఎంఎల్ ఇసుజుతో సహా వాణిజ్య వాహన తయారీదారులు స్క్రాప్ చేసిన వాణిజ్య కార్గో వాహనాలకు ఎక్స్-షోరూమ్ ధరలో 3 శాతానికి సమానమైన డిస్కౌంట్లను అందించాలి. 3.5 టన్నులు. 3.5 టన్నుల లోపు వాహనాలకు 1.5 శాతం రాయితీ అందిస్తారు. అదనంగా భారీ, తేలికైన వాణిజ్య వాహనాలను స్క్రాప్ చేయడానికి డిపాజిట్‌కు సంబంధించిన ట్రేడెడ్ సర్టిఫికేట్‌ను ఉపయోగించే కొనుగోలుదారులకు వరుసగా 2.75శాతం, 1.25శాతం తగ్గింపులు అందుబాటులో ఉన్నాయి. అయితే ప్రభుత్వం ఎన్ని ప్రయత్నాలు చేసినా స్వచ్ఛందంగా వాహనాలను స్క్రాపింగ్ చేయడం ఆచరణకు నోచుకోవడం లేదు. 2025 మార్చి నాటికి 90,000 పాత ప్రభుత్వ వాహనాలను స్క్రాప్ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దీని కోసం 60రిజిస్టర్డ్ వెహికల్ స్క్రాపింగ్ సెంటర్లు, 75 ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్లను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

# క్యాప్సికం సాగుతో లక్షల్లో లాభం.. అద్భుతమైన బిజినెస్ ఐడియా

సాధారణంగా క్యాప్సికం ధర మార్కెట్‌లో ఇతర కూరగాయల కంటే మెరుగ్గా ఉంటుంది. ఈ పంట సాగు ద్వారా రైతులు భాగానే సంపాదిస్తున్నారు. సాధారణ కూరగాయల్లాగే దీన్ని కూడా అన్ని రకాల వాతావరణాల్లో పండించవచ్చు. సత్ఫలితాలు రావడంతో రైతులకు మంచి ఆదాయం వస్తుంది. క్యాప్సికమ్‌ను బెల్ పెప్పర్ అని కూడా అంటారు. క్యాప్సికమ్‌లో విటమిన్ సి, విటమిన్ ఎ కూడా లభిస్తాయి. అంతే కాకుండా ఐరన్, పొటాషియం, జింక్, క్యాల్షియం తదితర పోషకాలు కూడా మార్కెట్‌లో క్యాప్సికమ్‌కు డిమాండ్ పెరుగుతోంది. ఇందులో రంగు క్యాప్సికమ్‌కు అత్యధిక డిమాండ్ ఉంది. భారతదేశంలో క్యాప్సికం దాదాపు 4780 హెక్టార్లలో సాగు అవుతోందని గణాంకాలు చెబుతున్నాయి. దీని వార్షిక ఉత్పత్తి 42230 టన్నులు. భారతదేశంలో క్యాప్సికమ్ పండించే ప్రధాన రాష్ట్రాలు హర్యానా, పంజాబ్, మధ్యప్రదేశ్, జార?ండ్, ఉత్తరప్రదేశ్, కర్ణాటక మొదలైవి ఉన్నాయి. ఈ రాష్ట్రాల్లో క్యాప్సికమ్‌ను పెద్ద ఎత్తున సాగు చేస్తున్నారు రైతులు. దీనికి అత్యధిక డిమాండ్ హోటళ్లలో ఉంది. ఇక్కడ దీనిని సలాడ్‌గా కూడా ఉపయోగిస్తారు. క్యాప్సికమ్ సాగు ఇతర మిరపకాయల మాదిరిగానే క్యాప్సికం సాగును ఏ సీజన్‌లోనైనా ప్రారంభించవచ్చు. ఇది కొద్దిగా వర్షం నుండి రక్షించుకోవచ్చు. రైతులు కుండీలలో లేదా పొలంలో సాగు చేసుకోవచ్చు. మీరు కుండీలలో క్యాప్సికమ్ సాగు చేయాలనుకుంటే ఒక కుండలో 10 కిలోల మట్టిని నింపండి. కుండలో సుమారు మూడింట ఒక వంతు కంపోస్ట్ నింపండి. దీని తరువాత కుండలో క్యాప్సికమ్ మొక్కను నాటండి. ఈ టెక్నిక్‌తో క్యాప్సికమ్‌ను చాలా సులువుగా నాటడంతోపాటు భారీ ఆదాయాన్ని పొందవచ్చు. క్యాప్సికమ్ సాగు కోసం నేల విలువ 6 ఉండాలి. క్యాప్సికమ్ మొక్క 40 డిగ్రీలవరకుఉష్ణోగ్రతనుతట్టుకోగలదు.నాటిన75రోజులతర్వాతమొక్కదిగుబడి ప్రారంభమవుతుంది. ఒక హెక్టారులో దాదాపు 300 క్వింటాళ్ల క్యాప్సికం ఉత్పత్తి అవుతుంది. క్యాప్సికమ్ నుండి సంపాదన ప్రస్తుతం మార్కెట్‌లోకి రంగుల క్యాప్సికం కూడా వస్తోంది. ఎరుపు, పసుపు, ఆకుపచ్చ, తెలుపు క్యాప్సికమ్‌కు డిమాండ్ పెరిగింది. ఒక మొక్క మంచి 10 నుండి 15 పండ్లను ఉత్పత్తి చేస్తుంది. ఎకరానికి 200 నుంచి 250 క్వింటాళ్ల క్యాప్సికం ఉత్పత్తి అవుతుంది. దీని ద్వారా మీరుసులభంగాలక్షలరూపాయలు సంపాదించవచ్చని నిపుణులు చెబుతున్నారు. అలాగే మీరు పండించే సమయంలో మార్కెట్ రేటు ఎలా ఉంటుందనే దానిపై ఆధారపడి మీకు లాభం వస్తుంది.



# వ్యాపారం

## పదేళ్ల 'స్విగ్గీ' మనోళ్లదేనని తెలుసా..? తొలిరోజు ఎన్ని ఆర్డర్స్ వచ్చాయంటే.. ఆసక్తికర విషయాలు




అరచేతిలో ప్రపంచం.. ఇంట్లో కూర్చునే అన్నింటిని ఆపరేట్ చేయొచ్చు.. వంట చేయకుండానే నచ్చిన రెస్టారంట్ల నుంచి ఇష్టమైన ఆహారాన్ని తెప్పించుకుని ఆస్వాదించవచ్చు.. ఇలా ప్రస్తుతకాలంలో చాలా మంది బయట దొరికే రుచికరమైన ఫుడ్ ను ఎంజాయ్ చేస్తున్నారు.. బిజీలైఫ్, పని ఒత్తిడి, సమయం లేకపోవడం వల్ల చాలా మంది వంట చేయకుండా ఫుడ్ డెలివరీ యాప్స్ స్విగ్గీ, జొమాటో లపై ఆధారపడుతున్నాయి.. ఈ యాప్స్ కూడా అదేవిధంగా ప్రజలకు సౌకర్యవంతంగా సేవలు అందిస్తున్నాయి. అందరికీ చేరువ అవుతూ.. ఎండనకా.. వాననకా.. పగలు రాత్రి అనే తేడా లేకుండా రుచికరమైన ఫుడ్ ను ఎప్పటికప్పుడు అందిస్తున్నాయి. అయితే.. ఫుడ్ డెలివరీ ప్రయాణంలో.. స్విగ్గీ సంస్థ పదేళ్లు పూర్తి చేసుకుంది. దశాబ్దం నాటి తీపి గుర్తులను పంచుకుంటూ ఆ సంస్థ సహ వ్యవస్థాపకుడు, సీఈఓ శ్రీహర్ష మాజేటి సోషల్ మీడియాలో ఒక పోస్టు షేర్ చేశారు. ఈ సందర్భంగా తమ సంస్థ ఫస్ట్ డే ఆర్డర్ల గురించి ఆసక్తికర విషయాలను వెల్లడించారు. 2014లో ఆగస్టు 6న తాము స్విగ్గీని ప్రారంభించామని .. ఫుడ్ ఆర్డర్ ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూసినట్లు తెలిపారు. కానీ, మొదటిరోజు తమకు ఒక్క ఆర్డరూ కూడా రాలేదన్నారు. మరుసటి రోజు తొలి ఆర్డర్ అందుకున్నట్లు తెలిపారు. అదే తమ జర్నీలో అసలైన ప్రారంభానికి గుర్తు అని.. తమ తొలి భాగస్వాముల్లో ఒకటైన ట్రఫుల్స్ రెస్టారంట్ నుంచి ఆహారం కోసం తమకు రెండు ఆర్డర్లు వచ్చినట్లు తెలిపారు. అప్పటి నుంచి వారితో తమ భాగస్వామ్యం బలపడిందన్నారు. ఒక దశలో ఒక్క రోజులో 7261 ఆర్డర్లు కూడా అందుకున్నట్లు శ్రీహర్ష వెల్లడించారు. శ్రీహర్ష పోస్ట్.. ఈ సందర్భంగా స్విగ్గీ సంస్థ ఎదుగుదల గురించి కూడా వెల్లడించారు. ఫుడ్ డెలివరీ కాన్సెప్ట్ అప్పుడప్పుడే అందరికీ చేరువవుతోన్న తరుణంలో తమపై విశ్వాసం ఉంచిన రెస్టారంట్లకు శ్రీహర్ష కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం 3లక్షల రెస్టారంట్లతో కలిసి పనిచేస్తున్నామని.. ఇది తమకెంతో గర్వకారణమని తెలిపారు. ఆ మద్దతే ప్రతి ఇంట్లో తమ పేరు వినిపించేందుకు కారణమైందని పేర్కొన్నారు. కాగా.. కర్ణాటక రాజధాని బెంగళూరు కేంద్రంగా 2014లో స్విగ్గీ ప్రారంభమైంది. శ్రీహర్ష మాజేటి, నందన్ రెడ్డి, రాహుల్ భాగస్వామ్యంలో స్విగ్గీ సంస్థను ప్రారంభించారు. దాదాపు 600 నగరాలకు దీని కార్యకలాపాలు విస్తరించాయి. అంతేకాకుండా నిత్యావసరాలను వేగవంతంగా సరఫరా చేసే సేవల విభాగం ఇన్‌స్టామార్ట్ లో కూడా స్విగ్గీ భాగస్వామ్యంగా ఉంది.

## ఎఫ్‌డీల్లో పెట్టుబడితో రాబడి వరద.. ఏయే బ్యాంకులు ఎంత వడ్డీ ఇస్తున్నాయంటే..?



భారతదేశంలో పెట్టుబడిపై స్థిరమైన ఆదాయాన్ని ఇచ్చే పథకాల్లో పెట్టుబడికి ఆసక్తి చూపుతున్నారు. ఇలాంటి వారికి ఫిక్స్‌డ్ డిపాజిట్లు మొదటి ఎంపికగా ఉంటున్నాయి. తక్కువ-రిస్క్ ఆప్షన్లను ఇష్టపడే వారికి ఫిక్స్‌డ్ డిపాజిట్లు ప్రముఖ పెట్టుబడి ఎంపికగా మారాయి. అయితే భారతదేశంలో ఇబ్బడిముబ్బడిగా బ్యాంకులు ఉండడంతో ఏయే బ్యాంకులు ఎంత వడ్డీ అందిస్తున్నాయో? తెలుసుకోవడం కష్టంగా ఉంది. ఇటీవల కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కూడా బ్యాంకులు ఎఫ్‌డీలను ప్రోత్సహించాలని కోరిన విషయం విధితమే ఈ నేపథ్యంలో ఎఫ్‌డీల్లో పెట్టుబడితో ఏయే బ్యాంకులు అధిక వడ్డీను ఆఫర్ చేస్తున్నాయో? ఓసారి తెలుసుకుందాం. ఒక సంవత్సరం కాలవ్యవధి ఒక సంవత్సరం ఎఫ్‌డీ కోసం ఇండస్ ఇండ్ బ్యాంక్ అత్యధిక వడ్డీ రేటును 7.75 శాతం అందిస్తుంది. అంటే మీ రూ. 10,000 పెట్టుబడి రూ.10,798కి పెరుగుతుంది. ఆర్‌బీఎల్ బ్యాంక్ 7.5 శాతం రేటుతో మీ డబ్బును రూ. 10,771కి పెంచుతోంది. బంధన్ బ్యాంక్, యస్ బ్యాంక్ రెండూ 7.25 శాతం రేటును అందిస్తాయి. ఫలితంగా రూ. 10,745 మెచ్యూరిటీ సొమ్మును పొందవచ్చు. ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ 7.1 శాతం రేటును అందిస్తాయి. అంటే దాదాపు మొత్తం రూ. 10,729 పొందవచ్చు. రెండు సంవత్సరాల కాలవ్యవధి మీరు రెండు సంవత్సరాల ఎఫ్‌డీను ఎంచుకుంటే ఆర్‌బీఎల్ బ్యాంక్ 8 శాతం వడ్డీ రేటుతో రూ.10,000 డిపాజిట్‌పై రూ.11,717 మెచ్యూరిటీ సొమ్ముగా అందిస్తుంది. ఇండస్ ఇండ్ బ్యాంక్ 7.75 శాతం ఆఫర్ చేయడంతో రూ. 11,659, డీసీబీ బ్యాంక్, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్, రెండూ 7.5 శాతం ఆఫర్ చేసి మీ పెట్టుబడిని రూ. 11,602కి పెంచుతాయి. ఐసీఐసీఐ బ్యాంక్ 7.25 శాతం ఆఫర్ చేయడం వల్ల మెచ్యూరిటీ మొత్తం రూ.11,545కి చేరుకుంది. మూడు సంవత్సరాల కాలవ్యవధి మూడు సంవత్సరాల ఎఫ్‌డీలపై డీసీబీ బ్యాంక్ అత్యధికంగా 7.55 శాతం రేటును అందిస్తుంది. అంటే రూ. 10,000 పెట్టుబడి మెచ్యూరిటీతో రూ. 12,516 అవుతుంది. ఆర్‌బీఎల్ బ్యాంక్ 7.5 శాతం అందించడం వల్ల ఇది మీ పెట్టుబడి రూ.12,497కు పెరుగుతుంది. యస్ బ్యాంక్, ఐడీఎఫ్ ఫస్ట్ బ్యాంక్, ఇండస్‌ఇండ్ బ్యాంక్ ఒక్కొక్కటి 7.25 శాతం ఆఫర్ చేస్తున్నాయి. ఐదు సంవత్సరాల కాలవ్యవధి ఐదు సంవత్సరాల ఎఫ్‌డీ విషయానికి వస్తే డీసీబీ బ్యాంక్ 7.4 శాతం అందిస్తుంది. అందువల్ల రూ. 10,000 పెట్టుబడి పెడితే మెచ్యూరిటీ సొమ్ము రూ. 14,428కి పెరుగుతుంది. ధనలక్ష్మి బ్యాంక్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, యస్ బ్యాంక్ ఒక్కొక్కటి 7.25 శాతం ఆఫర్ చేస్తున్నాయి. అందవుల్ల మీ పెట్టుబడి రూ.14,323కి పెరుగుతుంది.

# గర్భధారణ సమయంలో బొప్పాయి తినడం వల్ల అబార్షన్ అవుతుందా? వైద్యులు ఏం చెబుతున్నారు?



గర్భధారణ సమయంలో మహిళలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. తల్లి, బిడ్డ ఇద్దరి భద్రత ముఖ్యం. చిన్న పొరపాటు కూడా తల్లి, బిడ్డపై ప్రభావం చూపుతుంది. ఈ సమయంలో ఆహారం, పానీయాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టడానికి ఇది కారణం. ప్రెగ్నెన్సీ సమయంలో బొప్పాయి తినకూడదని మీరు తరచుగా వినే ఉంటారు. ఇంటి పెద్దలు కూడా అలానే చెబుతుంటారు. వైద్యులు కూడా వివిధ సలహాలు ఇస్తారు. గర్భిణీ స్త్రీలు బొప్పాయి తింటే గర్భస్రావం అవుతుందని కూడా కొందరు అంటున్నారు. ఇందులో ఎంత నిజం ఉందో చెబుతారా? ఒక అధ్యయనం ప్రకారం, గర్భధారణ సమయంలో పచ్చి బొప్పాయి తినడం వల్ల గర్భస్రావం లేదా అకాల డెలివరీ ప్రమాదాన్ని పెంచుతుందని, పండిన బొప్పాయి తినడం గర్భస్రావం ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఎలుకలపై చేసిన ప్రయోగం తర్వాత 2002లో ప్రచురితమైన ఒక అధ్యయనంలో పండిన బొప్పాయిని తిన్న గర్భిణీ ఎలుకలకు గర్భస్రావం అయ్యే ప్రమాదం తక్కువగా ఉందని, అయితే పచ్చి బొప్పాయి తినడం వల్ల గర్భస్రావం, నెలలు నిండకుండానే డెలివరీ అయ్యే ప్రమాదం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. బొప్పాయిలో ఉండే ఎంజైమ్ల వల్ల గర్భస్థ శిశువుకు నష్టం పెరుగుతుంది. అయితే, ఇప్పటి వరకు మనుషులపై అలాంటి అధ్యయనం లేదా పరిశోధన జరగలేదు. కానీ బొప్పాయి వినియోగం పూర్తిగా ప్రయోజనకరం లేదా హానికరం అని చెప్పలేము. పచ్చి లేదా పండిన బొప్పాయిలో లేటెక్స్, పాపైన్ ఉంటాయి. ఇవి అభివృద్ధి చెందుతున్న పిండానికి హానికరం. బొప్పాయిలోని రబ్బరు పాలు గర్భాశయం సంకోచించటానికి కారణమవుతుంది. ఇది పిండానికి చాలా హానికరం. గర్భధారణ సమయంలో పండిన బొప్పాయి తినడం ప్రయోజనకరంగా ఉన్నప్పటికీ, ప్రజలు పండిన, సగం పండిన బొప్పాయి మధ్య గందరగోళానికి గురవుతారు. అటువంటి పరిస్థితిలో పిల్లలకి ఎటువంటి హాని జరగకుండా ఉండటానికి ప్రజలు బొప్పాయి తినకుండా ఉంటారు. బొప్పాయిని ప్రెగ్నెన్సీ సమయంలో తినవచ్చని, పూర్తిగా పక్వానికి వచ్చి తక్కువ పరిమాణంలో తీసుకుంటేనే తినవచ్చని కొందరు ఆరోగ్య నిపుణులు అంటున్నారు. పూర్తిగా పండిన బొప్పాయి విటమిన్ సి, విటమిన్ ఇ మూలం. అలాగే ఫోలిక్ యాసిడ్‌తో పాటు ఫైబర్ కూడా పుష్కలంగా ఉంటుంది. ఇది ప్రయోజనకరంగా ఉంటుంది. (గమనిక: ఇందులోని అంశాలు కేవలం అవగాహన కోసం మాత్రమే. నిపుణుల సలహాలు, సూచనల మేరకు అందించడం జరిగింది.



## ఉదయాన్నే పరగడుపున ఈ డ్రింక్ తాగితే అనేక వ్యాధులు పరార్.. అద్భుతమైన హోమ్ రెమిడీస్



ప్రస్తుతం చాలా మందిని అనారోగ్య సమస్యలు వెంటాడుతున్నాయి. మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంటుంది. కొన్ని హెూమ్ రెమీడిస్ పాటించడం వల్ల మంచి ఫలితాలు ఉంటాయి. అయితే ఉదయాన్నే కొన్ని డ్రింక్స్ తాగినట్లయితే శరీరంలోని కొన్ని సమస్యలు తొలగిపోతాయి. అల్లం వల్ల కలిగే ప్రయోజనాల గురించి కొత్తగా చెప్పాల్సిన పనిలేదు. అన్ని వేళలా మందులు తీసుకునే బదులు, మీరు వంటగదిలోని కొన్ని వస్తువులపై ఆధారపడవచ్చు. అటువంటి పదార్థాలలో ఒకటి అల్లం. అల్లం అనేక పోషకాలతో నిండి ఉంటుంది. ఇందులో ప్రొటీన్లు, కార్బోహైడ్రేట్లు, జింక్, కాపర్, మాంగనీస్ పుష్కలంగా ఉన్నాయి. ఇందులో క్రోమియం, విటమిన్ సి, కాల్షియం, ఫాస్పరస్, ఐరన్ కూడా ఉన్నాయి. ఇది బ్యాక్టీరియా, వైరస్‌లతో పోరాడగలదు. మీరు టాన్సిల్ సమస్యలతో బాధపడుతుంటే మీకు అల్లం ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుంది. గొంతు నొప్పి నుండి టాన్సిలైటిస్ వరకు అన్నింటి నుండి ఉపశమనాన్ని అందిస్తుంది. అల్లంలో యాంటీ ఆక్సిడెంట్, యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీ క్యాన్సర్ గుణాలు ఉన్నాయి. అలాగే ఇవన్నీ శరీరానికి చాలా ఉపయోగకరంగా ఉంటాయి. అల్లం రసం కూడా బరువు తగ్గడంలో సహాయపడుతుంది. ఖాళీ కడుపుతో అల్లం రసం తాగడం వల్ల కూడా చాలా ప్రయోజనాలు ఉన్నాయి. అల్లం రసం మధుమేహ వ్యాధిగ్రస్తులకు కూడా మేలు చేస్తుంది. ఒక గ్లాసు గోరువెచ్చని నీటిలో ఒక చెంచా అల్లం రసం కలపండి. క్రమం తప్పకుండా తాగాలి. అప్పుడు తేడా మీకే అర్థమవుతుంది. మీరు రోజంతా చాలా ఉల్లాసంగా ఉండగలరు. అయితే మీరు నిద్రలేచి, ఖాళీ కడుపుతో ఈ అల్లం నీటిని తాగితే, మీరు కేవలం కొన్నింటితో బరువు తగ్గవచ్చు. అందుకే ఈరోజు నుండే అలవాటు చేసుకోండి. (నోట్: ఇందులోని అంశాలు కేవలం అవగాహన కోసం మాత్రమే. నిపుణుల సలహాలు, సూచనల మేరకు అందించడం జరిగింది. వీటిని అనుసరించే ముందు వైద్యులను సంప్రదించాలని సూచిస్తున్నాము.

# 6 నెలల వయస్సు వరకు పిల్లలకు నీరు తాగించకూడదు..

ఇంట్లోకి చిన్న అతిథి రాగానే.. తాతయ్యలే కాదు, ఇంట్లోని ప్రతి పెద్దాయన కూడా బిడ్డ ఆరోగ్యంగా ఉండేందుకు తల్లిదండ్రులకు సలహాలు ఇవ్వడం మొదలుపెడతారు. తల్లిదండ్రులకు వైద్యులు ఇచ్చే సలహాల్లో ఆరు నెలల శిశువులకు నీరు తాగించకూడదనేది ఒకటి. నవజాత శిశువులకు మొదటి ఆరు నెలలు తల్లిపాలు మాత్రమే ఇస్తారు. వైద్యులు వారికి ఆహారం ఇవ్వడానికి నిరాకరిస్తున్నారు. అంతే కాదు తాగేందుకు నీళ్లు కూడా ఇవ్వడానికి వైద్యులు నిరాకరిస్తున్నారు. వేసవిలో విపరీతమైన వేడిలో, కొన్నిసార్లు తల్లులు, కుటుంబ సభ్యుల మనస్సులో ఒక ప్రశ్న ఉంటుంది. పిల్లవాడు నీరు తాగకపోతే అతనికి ఏ డీహైడ్రేషన్ సమస్య వస్తుందని. అయితే, వైద్యుల తెలిపిన వివరాల ప్రకారం, తల్లి పాలలో 80 శాతం నీరు ఉంటుంది. ఇది అవసరమైన అన్ని పోషణ, డీహైడ్రేషన్ సమస్యను తీరుస్తుంది. 6 నెలల వరకు నవజాత శిశువుకు తల్లి పాలు తప్ప మరేమీ ఇవ్వకూడదని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) పేర్కొంది. నవజాత శిశువులకు నీరు ఇస్తే, ఎలక్ట్రోలైట్ అసమతుల్యత ప్రమాదం ఉంది. ఈ స్థితిలో శరీర ఉష్ణోగ్రత తగ్గుతుంది. ఎలక్ట్రోలైట్స్ శరీరంలోని ఖనిజాలు, రక్తం, మూత్రం, ఇతర శరీర ద్రవాలలో ఉంటాయి. సోడియం, క్లోరిన్, ఫాస్ఫేట్, పొటాషియం అన్నీ ఎలక్ట్రోలైట్స్ ఉంటాయి. శరీరంలో ఎలక్ట్రోలైట్స్ సరైన సమతుల్యతను నిర్వహించడం చాలా ముఖ్యం. ఇది కాకుండా, ఫార్ములా పాలు తాగే పిల్లల శరీరం కూడా నీరు లేకుండా హైడ్రేట్ గా ఉంటుంది. అందుకే కనీసం 6 నెలల తర్వాత మాత్రమే పిల్లలకు నీరు ఇవ్వాలని సూచిస్తున్నారు వైద్యులు. డైల్యూటెడ్ ఫార్ములా పాలను తినిపించడం లేదా ఎక్కువ నీరు ఇవ్వడం శిశువు ఆరోగ్యాన్ని మరింత దిగజార్చుతుందని గుర్తుంచుకోండి. సాధారణ నీటిని తాగడం వల్ల బిడ్డకు ఎలాంటి శక్తి అందదని నిపుణులు చెబుతున్నారు. ఇది



కాకుండా ఇది ఖాళీ కేలరీలను కూడా కలిగి ఉంటుంది. కనుక ఇది 6 నెలల ముందు శిశువుకు ప్రయోజనకరం కాదు. బదులుగా ఇది పిల్లల అభివృద్ధిని ప్రభావితం చేస్తుంది.

## డయాబెటిస్ ఎన్ని రకాలు..

### ఎలా సంభవిస్తుంది? నివారణ చర్యలు ఏమిటి?



డయాబెటిస్ చాలా సాధారణ సమస్యగా మారుతోంది. నేడు ప్రతి ఇంట్లో ఒకరు మధుమేహ వ్యాధిగ్రస్తులు ఉన్నారు. భారతదేశంలో ఈ సంఖ్య చాలా వేగంగా పెరుగుతోంది. ఇప్పుడు యువత చిన్న వయస్సులోనే ఈ వ్యాధికి గురవుతున్నారు. డయాబెటిస్ అనేది చాలా తీవ్రమైన సమస్య. ఇది శరీరంలో రక్తంలో చక్కెర స్థాయి పెరుగుదల కారణంగా సంభవిస్తుంది. దానిని నియంత్రించకపోతే అది క్రమంగా శరీరంలోని ప్రతి అవయవాన్ని ప్రభావితం చేస్తుంది. ప్రకారం, 2030 నాటికి భారతదేశంలో మధుమేహ వ్యాధిగ్రస్తుల సంఖ్య రెట్టింపు అవుతుంది. మధుమేహం రావడానికి గల కారణాలను, దానిని నివారించే మార్గాలను తెలుసుకుందాం. మధుమేహం అంటే ఏమిటి? శరీరంలో రక్తంలో గ్లూకోజ్ స్థాయి పెరిగినప్పుడు ఈ సమస్యను డయాబెటిస్ అంటారు. వాస్తవానికి, శరీరంలోని రక్తంలో గ్లూకోజ్‌ను నియంత్రించే పని ఇన్సులిన్ ద్వారా జరుగుతుంది. ఇది ప్యాంక్రియాస్‌లో ఉత్పత్తి అవుతుంది. ప్యాంక్రియాస్‌లో ఇన్సులిన్ ఉత్పత్తి అయిన తర్వాత రక్తంలో ఉండే గ్లూకోజ్‌ను నియంత్రిస్తుంది. కానీ కొన్ని కారణాల వల్ల క్లోమం తగినంత పరిమాణంలో ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేయలేకపోయినప్పుడు, శరీరంలో గ్లూకోజ్ స్థాయి పెరిగి మధుమేహం సమస్య ప్రారంభమవుతుంది. మధుమేహం రకాలు మధుమేహం ప్రధానంగా రెండు రకాలుగా విభజించబడింది: టైప్-1, టైప్-2 మధుమేహం. ప్యాంక్రియాస్‌లో ఏదైనా లోపం కారణంగా చిన్నతనం నుండి ఇన్సులిన్ ఉత్పత్తి కానప్పుడు, పిల్లవాడు టైప్-1 డయాబెటిస్‌కు గురవుతాడు. అతని శరీరం ఇన్సులిన్ ఉత్పత్తి చేయలేకపోవటం వలన అతని జీవితాంతం ఇన్సులిన్ ఇవ్వబడుతుంది. టైప్-2 మధుమేహం మన అనారోగ్య జీవనశైలి కారణంగా వయస్సు పెరిగేకొద్దీ వస్తుంది. కానీ ఈ రోజుల్లో యువత అనారోగ్య జీవనశైలి చిన్న వయస్సులోనే టైప్-2 డయాబెటిస్‌కు కారణం అవుతోంది. టైప్ 2 డయాబెటిస్‌కు కారణాలు అనారోగ్య జీవనశైలి ఒత్తిడి బయట జంక్ ఫుడ్ ఎక్కువగా తీసుకోవడం క్రమరహిత జీవనశైలి తక్కువ శారీరక శ్రమ ఊబకాయం మధుమేహం నివారణ జీవనశైలి మెరుగుదల ఆరోగ్యకరమైన, పోషకమైన ఆహారాన్ని తీసుకోవడం ఆహారంలో ఆకుపచ్చని కూరగాయలు, సీజనల్ పండ్లను తీసుకోవడం తగినంత నీరు తాగడం ఒత్తిడిని తగ్గించండి శారీరకంగా చురుకుగా ఉండటం రోజూ అరగంట పాటు వ్యాయామం లేదా వాకింగ్ చేయడం స్థూలకాయాన్ని నియంత్రిస్తుంది కొలెస్ట్రాల్, అధిక రక్తపోటు వంటి వ్యాధులను నివారించడం బయట జంక్, ఫాస్ట్ ఫుడ్ తక్కువగా తినండి

## బాడీ మసాజ్ ఎందుకు, ఎవరికి అవసరం..? తప్పక తెలుసుకోవాలి.



వయసు యాభై దాటితే మీ దినచర్యలో బాడీ మసాజ్ కూడ చేర్చుకోవాలంటున్నారు ఆరోగ్య నిపుణులు. 45 నుంచి 50 దాటితే శరీరం లోపల ఉండే భాగాల ఎదుగుదల ఆగిపోయి అరుగుదల క్రమంగా మొదలవుతుంది. ఫలితంగా పని సామర్థ్యం తగ్గి కాళ్ళ నొప్పులు, కీళ్ళ నొప్పులు, మోకాళ్ళ నొప్పులు, మెడ నొప్పులు, బ్యాక్ పెయిన్ వంటి రుగ్మతలు వేధిస్తుంటాయి. వీటికి చెక్ పెట్టాలంటే రెగ్యులర్ బాడీ మసాజ్ చాలా అవసరం. ఇందుకోసం మన ఇంట్లోనే రోజూ ఉదయం స్నానం చేయడానికి ఓ అరగంట ముందు 10-15 నిమిషాల పాటు మనకు మనంగా బాడీ మసాజ్ చేసుకుంటే సరిపోతుంది. బాడీ పెయిన్స్ మరీ ఎక్కువగా ఉంటే ఫిజియోథెరపీ వంటివి తప్పవు. బాడీ మసాజ్‌తో ఒళ్లు నొప్పులు రాకుండా ఉంటాయి. ముందే ఒంటి నొప్పులతో ఇబ్బంది పడుతున్నట్టయితే అవి తగ్గిపోతాయంటున్నారు. ఇంట్లోనే బాడీ మసాజ్ ఎలా చేసుకోవాలి.. ఆరోగ్య ప్రయోజనాలేంటో కూడా తెలుసుకుందాం.. ఇంట్లోనే బాడీ మసాజ్ చేసుకోడానికి కొబ్బరి నూనె లేదా బాదం నూనెను ఉదయం స్నానానికి వెళ్ళేముందు ఓ పది పదిహేను నిమిషాల పాటు ఆయిల్‌తో బాడీ మసాజ్ క్రమం తప్పకుండా చేసుకుంటే..చక్కటి ఫలితం ఉంటుంది. ఇందుకోసం కావాలంటే మంచి ఆయుర్వేద పెయిన్ రిలీఫ్ ఆయిల్ వాడినా మంచి ఫలితాలే వస్తాయి. మసాజ్ కోసం కావాల్సిన ఆయిల్ తీసుకుని మన చేతి వేళ్ళతోనే రాపిడి ప్రెషర్ తో ఒళ్ళంతా పట్టించాలి. ఓ పది నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో స్నానం చేయాలి. రోజూ క్రమం తప్పకుండా ఇలా చేస్తూ ఉంటే ఒళ్లు నొప్పులు మన దరి చేరవంటున్నారు. బాడీ పెయిన్స్ విషయంలో ముందే జాగ్రత్త పడటం చాలా అవసరం అంటున్నారు నిపుణులు. లేదంటే ఆ తర్వాత వైద్యం కోసం, ఫిజియోథెరపీ మెడిసిన్లు అంటూ ఆస్పత్రుల చుట్టూ తిరగాల్సి వస్తుంది. ఇలాంటి జాయింట్ పెయిన్స్, బాడీ పెయిన్స్ మరింత తీవ్రమైతే వేలకు వేలు పెట్టి ఖరీదైన సర్జరీలు, టెన్షన్లు తప్పవని నిపుణులు సూచిస్తున్నారు. ఒళ్లు నొప్పుల సమస్యతో ఇబ్బంది పడుతున్న వారు అనేక మంది ఉన్నారు. కాబట్టి రోజూ మనం బాడీ మసాజ్ అలవాటు చేసుకుంటే.. ఎన్నో అనారోగ్య సమస్యలను రాకుండా ముందే అడ్డుకోగలం అంటున్నారు. ప్రతిరోజూ మార్నింగ్ వాక్ తరువాత రెగ్యులర్‌గా బాడీ మసాజ్ చేసుకుంటే ఆరోగ్యానికి చాలా మంచిదంటున్నారు. బాడీ మసాజ్ వలన కలిగే ఆరోగ్య ప్రయోజనాలు ఒకటి, రెండు కాదు.. ఏకంగా 25 రకాల లాభాలు ఉన్నాయని వైద్యులు, నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా బాడీ మసాజ్ వలన రక్తప్రసరణ బాగా మెరుగవుతుంది. లో బ్లడ్ ప్రెషర్ ను నియంత్రిస్తుంది. ఒత్తిడిని బాగా తగ్గిస్తుంది. మజిల్స్ టెన్షన్ ని తగ్గిస్తాయి. రోగనిరోధక శక్తి పెరుగుతుంది. బాడీ పెయిన్స్ రాకుండా ఉంటాయి. ఆల్రెడీ బాడీ పెయిన్స్ ఉంటే తగ్గుతాయి.

## ఆ దేశంలో కొన్ని రకాల కాస్మెటిక్ ఉత్పత్తులతో తీవ్ర అనారోగ్యం.. వాటి అమ్మకం, వినియోగంపై నిషేధం..

ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ కొన్ని రకాల మెడిసిన్స్ అమ్మకాలపై నిషేధం విధించింది. ముఖ్యంగా మైక్రోడెర్మాబ్రేషన్ వంటి కొన్ని కాస్మెటిక్ విధానాలకు ఉపయోగించే ముందులు లేదా కాస్మెటిక్ సర్జరీ తర్వాత నొప్పిని తగ్గించడానికి అమ్మే ఓవర్-ది-కౌంటర్ అనాల్జెసిక్ ఉత్పత్తులను ఉపయోగించవద్దని వినియోగదారులను హెచ్చరిస్తోంది. లేజర్ హెయిర్ రిమూవల్, టాటూయింగ్, చెవులు లేదా శరీరం మీద ఎక్కడైనా పియర్సింగ్ చేసినప్పుడు ఉపయోగిస్తున్న కొన్ని రకాల మందులపై నిషేధం విధించింది. అంతేకాదు ఫెడరల్ చట్టాన్ని ఉల్లంఘించి ఈ ఉత్పత్తులను మార్కెటింగ్ చేసినందుకు ఆరు కంపెనీలకు, ఏజెన్సీలకు హెచ్చరిక లేఖలు జారీ చేసింది ప్రకారం ఈ ఉత్పత్తుల్లో కొన్ని లిడోకాయిన్ వంటి పదార్థాలను కలిగి ఉన్నాయని లేబుల్ చేయబడ్డాయి. ఇవి ఓవర్-ది-కౌంటర్ అంటే నొప్పి నివారణ ఉత్పత్తుల కోసం అనుమతించిన దానికంటే ఎక్కువ సాంద్రతలలో లిడోకాయిన్ వంటి పదార్థాలు ఉన్నట్లు తాము గుర్తించినట్లు చెప్పారు. డ్రగ్స్ కోసం కొత్త మార్కెటింగ్ కోడ్ "కొన్ని కాస్మెటిక్ చికిత్స చేసే సమయంలో ఈ ఉత్పత్తుల్లో క్రమరహిత హృదయ స్పందన, మూర్ఛ వంటి వ్యాధులకు కారకులుగా మారవచ్చు అని పేర్కొన్నారు. అంతేకాదు శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు కూడా కలుగుతున్నాయని తాము గుర్తించినట్లు.. ఈ ఉత్పత్తులు తీసుకుంటున్న వినియోగదారుడు తీసుకునే ఆహార పదార్థాలతో కూడా సంకర్షణ చెందుతాయి, "అని పేర్కొంది. "ఈ ఉత్పత్తులు వినియోగదారులకు ఆమోదయోగ్యంకాని నష్టాలను కలిగిస్తున్నాయని.. కనుక మార్కెట్లో వీటి అమ్మకాలపై నిషేధం విధించినట్లు జిల్ ఫర్మాన్, సెంటర్‌లో కంప్లైయన్స్ ఆఫీసర్స్ డైరెక్టర్ అన్నారు. గత దశాబ్దంలో ఇలాంటి ఉత్పత్తుల గురించి వినియోగదారులకు హెచ్చరికలు చేసినప్పటికీ, ఏజెన్సీ ఆన్‌లైన్ , రిటైల్ స్టోర్‌ల్లో అందుబాటులో ఉంచుతూ ప్రమాదకరమైన ఉత్పత్తులను అమ్మకాలు కొనసాగుతున్నట్లు చెప్పారు. డుచెన్ మస్కులర్ డిస్ట్రోఫీకి స్టెరాయిడ్ ఉపయోగించని చికిత్సకు ఆమోదం తెలిపింది. అంతేకాదు ఈ సమస్యలను ఎలా పరిష్కరిస్తారో లేదా ఉత్పత్తులు చట్టాన్ని ఉల్లంఘించలేదని తాము భావిస్తున్నట్లు వివరిస్తూ అందుకు తగిన సమాచారాన్ని అందించాలని.. తాము ఇచ్చిన నోటీసు అందుకున్న 15 రోజులలోపు ఈ కంపెనీ యాజమాన్యం ప్రతిస్పందించాలని కంపెనీలను కోరింది. ఇప్పటికే ఉత్పత్తి చేసిన మెడిసిన్స్ ను స్వాధీనం చేసుకోవడం లేదా ఉల్లంఘించే ఉత్పత్తుల తయారీని, పంపిణీని నిలిపివేయాలని సదరు కంపెనీలను కోరుతోంది. అంతేకాదు ఇందుకు సంబంధించిన కోర్టు ఆర్డర్‌తో సహా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. మైక్రోడెర్మాబ్రేషన్ ఉత్పత్తులనులోకి ప్రవేశించకుండా, వినియోగదారుల వద్దకు చేరకుండా ఆపడానికి ఈ కంపెనీలలో కొన్నింటిని హిట్ లిస్ట్ లో ఉంచినట్లు పేర్కొంది.



## బీర్ తాగితే ఒంటికి చలువ చేస్తుందా..? కిడ్నీలో రాళ్లు కరుగుతాయా?



ఎండాకాలం వస్తే మద్యం ప్రియులు బీర్లు తెగ సేవిస్తారు. అదెంటి అంటే.. బీర్ తాగితే ఒంటికి చలవు చేస్తుందని చెబుతారు. కానీ ఇది ఎంతమాత్రం కరెక్ట్ కాదంటున్నారు డాక్టర్లు. అందుకు ఎలాంటి శాస్త్రీయమైన ఆధారాలు లేవంటున్నారు. అంతేకాదు బీర్ తాగితే గుండెకు మంచిదనే ప్రచారాన్ని కూడా కొట్టి పారేస్తున్నారు. ఇక కొందరు బీర్ తాగడం వల్ల కిడ్నీల్లో రాళ్లు తగ్గుతాయని చాలామంది నమ్ముతారు. ఇది నిజం కాదని నెఫ్రోలాజిస్టులు నొక్కి చెబుతున్నారు. అయితే బీర్ తాగేవారు లావు అవుతారు అనడంలో కొంతమేర వాస్తవం ఉంది. అయితే బరువు పెరిగేందుకు ఇది మంచి పద్దతి కాదు. ఒక గ్రాము ఆల్కాహాల్ సేవిస్తే 7 కేలరీలు శరీరానికి అందుతాయి. ఈ క్రమంలో బీర్ అధికంగా సేవిస్తే బరువు పెరుగుతారు. ఇక బీర్‌ను తలకు పట్టిస్తే.. షాంపులా వాడితే జుట్టు పెరుగుతుందన్నది మరికొందరి వాదన. జుట్టు కుదుళ్ల నుంచే బలంగా ఉండాలి. జుట్టుకు ఏదైనా రాసుకుంటే పెరుగుతుందనే దాన్ని సైన్స్ విశ్వసించదు అంటున్నారు డాక్టర్లు. ఆల్కాహాల్ కొద్ది మొత్తంలో తీసుకుంటే మంచిదని గతంలో పరిశోధనల్లో తేలింది. అయితే వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్.. జనవరిలో విడుదల చేసిన రిపోర్ట్ ప్రకారం.. ఎంత మొత్తంలో ఆల్కాహాల్ తీసుకున్నా కూడా అది ఆరోగ్యానికి చేటే అని వెల్లడించింది. ఆల్కాహాల్ సేవనం పలు రకాల క్యాన్సర్లకు కారణం అవుతుంది. అయితే బీర్ కాకుండా ఇతర రకాల ఆల్కాహాల్ తీసుకునే వారికి లివర్ 5 ఏళ్లలో దెబ్బతింటే, బీర్ తాగే వారికి 10 సంవత్సరాల్లో దెబ్బతింటుందని కొందరు డాక్టర్స్ చెబుతున్నారు.

స్పోర్ట్స్

# టీమ్ఇండియా కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్

**వైస్ కెప్టెన్‌గా రిషబ్ పంత్ నియామకం**

**ఇంగ్లండ్ పర్యటనకు టీమిండియా జట్టు ప్రకటన**



భారత టెస్టు క్రికెట్ లో నూతన శకం షురూ అయ్యిందని చెప్పవచ్చు. సుదీర్ఘ ఫార్మాట్ లో రోహిత్ శర్మ, వారసుడిగా యువ ఆటగాడు శుభ్ మన్ గిల్ ను బీసీసీఐ శనివారం ఎంపిక్ చేసింది. అందరూ ముందుగానే ఊహించినట్లుగానే టెస్ట్ జట్టు కెప్టెన్సీ పగ్గాలను గిల్ చేతిలో పెట్టింది. ఈ మేరకు వచ్చే నెలలో ఇంగ్లండ్ పర్యటనకు టీమిండియా జట్టును బీసీసీఐ శనివారం ప్రకటించింది. సారథిగా శుభ్ మన్ గిల్, వైస్ కెప్టెన్ గా రిషబ్ పంత్ ను సెలక్ట్ చేసింది. మొత్తం 18 మంది ఆటగాళ్లతో జట్టును ప్రకటించింది బీసీసీఐ. జూన్ 20 నుంచి ఇంగ్లండ్ తో 5 టెస్టుల సిరీస్ జరగనున్న సంగతి తెలిసిందే. కాగా గిల్ టీం ఇండియాకు 37వ టెస్ట్ కెప్టెన్ కానున్నాడు. 25 ఏళ్ల గిల్ టీం ఇండియాకు 5వ అతి పిన్న వయస్కుడైన టెస్ట్ కెప్టెన్. ఇంగ్లాండ్ గడ్డపై బ్యాట్‌తోనే కాకుండా కెప్టెన్సీలోనూ బాగా రాణించడం ఇప్పుడు గిల్ ఎదుర్కొనే కఠినమైన సవాలు. అర్ష్‌దీప్ సింగ్ తొలిసారి టెస్ట్ జట్టులోకి ఎంపికయ్యాడు. శార్దుల్ ఠాకూర్ కూడా జట్టులోకి తిరిగి వచ్చాడు. ఆస్ట్రేలియా పర్యటనలో అద్భుతంగా రాణించిన ఓపెనర్ యశస్వి జైస్వాల్, ఆల్ రౌండర్ నితీష్ కుమార్ రెడ్డి తమ స్థానాన్ని నిలుపుకోగలిగారు. సాయి సుదర్శన్, కరుణ్ నాయర్ కూడా జట్టులో ఉన్నారు. %ఖూా% 2025లో గుజరాత్ టైటాన్స్ తరపున అద్భుతమైన బ్యాటింగ్ చేసినందుకు సుదర్శన్ కు బహుమతి లభించింది. కరుణ్ నాయర్ 8 సంవత్సరాల తర్వాత టీమ్ ఇండియాలోకి తిరిగి వచ్చాడు. 2024-25 రంజీ ట్రోఫీలో విదర్భ తరపున ఆడుతున్నప్పుడు అతను 863 పరుగులు చేశాడు. అందుకే ఇప్పుడు సెలెక్టర్లు అతనికి చాలా కాలం తర్వాత అవకాశం ఇచ్చారు.ఇంగ్లండ్లో జస్‌ప్రీత్ బుమ్రా బౌలింగ్‌లో పేస్ అటాక్‌కు నాయకత్వం వహిస్తాడు. అర్ష్‌దీప్ సింగ్, మహ్మద్ సిరాజ్ వంటి ఫాస్ట్ బౌలర్లు కూడా బుమ్రాకు మద్దతుగా ఉంటారు. స్పిన్ బౌలింగ్ బాధ్యత కుల్దీప్ యాదవ్, జడేజా భుజాలపై ఉంటుంది. భారత్ %జం% ఇంగ్లాండ్ టెస్ట్ సిరీస్ మొదటి టెస్ట్ మ్యాచ్ లీడ్స్‌లో జరగనుండటం గమనించదగ్గ విషయం. దీనితో, 2025-27 ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ చక్రం ప్రారంభమవుతుంది. రెండవ టెస్ట్ బర్మింగ్‌హామ్‌లో, మూడవ టెస్ట్ లార్డ్స్‌లో నాల్గవ టెస్ట్ మాంచెస్టర్‌లో జరుగుతుంది. టెస్ట్ సిరీస్‌లోని చివరి 5వ మ్యాచ్ కెన్నింగ్టన్ ఓవల్‌లో జరుగుతుంది. కాగా 2020లో ఆస్ట్రేలియాపై గిల్ టెస్టు క్రికెట్?లో ఎంట్రీ ఇచ్చాడు. టెస్టుల్లోనూ గిల్ ఓపెనర్?గానే ప్రస్థానం ప్రారంభించాడు. వచ్చీ రావడంతోనే ఓపెనర్?గా బరిలోకి దిగిన గిల్ రెండు ఇన్నింగ్స్?ల్లో వరుసగా 45, 35లి స్కోర్లు నమోదు చేశాడు. అలా ఓపెనింగ్ స్థానాన్ని పరిమితం చేసుకున్న గిల్, ఇంటాబయట అనేక విజయాల్లో కీలక పాత్ర పోషించాడు. ఇప్పటివరకు 32 టెస్టులకుగానూ గిల్ 59 ఇన్నింగ్స్?ల్లో బ్యాటింగ్?కు దిగాడు. 35 యావరేజ్?తో 1893 పరుగులు చేశాడు. ఇందులో 5 సెంచరీలు, 7 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. 128 టెస్టుల్లో గిల్?కు అత్యధిక స్కోర్?గా ఉంది. కాగా, రోహిత్ రిటైర్మెంట్? తర్వాత టీమ్ఇండియాకు కొత్త కెప్టెన్ ఎవరా అని పెద్ద చర్చే జరిగింది. తొలి నుంచి ప్రచారం జరిగినట్లుగానే సెలక్టర్లు కూడా గిల్ పేరు ఖరారు చేశారు. దీంతో రోహిత్ వారసుడిగా గిల్ కొత్త అధ్యాయం మొదలు పెట్టనున్నాడు. అయితే అంతర్జాతీయ క్రికెట్?లో జట్టును నడిపించడం సవాలుతో కూడుకున్న పనే. అందులోనూ అత్యుత్తమ జట్టైన టీమ్ఇండియాకు కెప్టెన్సీ వహించడంతో గిల్?పై భారీగానే అంచనాలు ఉన్నాయి. కెప్టెన్?గా తొలి సిరీస్‌తోనే గిల్‌కు కఠిన పరీక్ష ఎదురుకానుంది. ఇంగ్లాండ్ గడ్డపై సిరీస్? నెగ్గడం గిల్ ముందున్న అసలైన సవాల్. పైగా ఈ సిరీస్?తోనే డబ్ల్యూటీసీ సైకిల్ ప్రారంభం అవ్వనుండడం వల్ల టీమ్ఇండియా ఫ్యాన్స్? ఘనమైన ఆరంభం ఆశిస్తున్నారు. ఇక జట్టులో తనకంటే సీనియర్లు బుమ్రా, రాహుల్, జడేజాను ఎలా సమన్వయం చేస్తాడన్నది ఆసక్తికరం. ఐసీసీ ఈవెంట్లలో భారత్? ఇప్పటివరకు డబ్ల్యూటీసీ టైటిల్ మాత్రమే నెగ్గలేదు. ఈ టోర్నీలో రెండుసార్లు ఫైనల్?కు చేరుకున్నా, డబ్ల్యూటీసీ టైటిల్ భారత్?కు కలగానే మిగులుతోంది. విరాట్ కెప్టెన్సీలో 2021, రోహిత్ సారథ్యంలో 2023లో టీమ్ఇండియాకు ఫైనల్?లో నిరాశే మిగిలింది. ఇక కొత్త కెప్టెన్ గిల్ నేతృత్వంలోనైనా భారత్ డబ్ల్యూటీసీ 'గద' అందుకోవాలని టీమ్ఇండియా ఫ్యాన్స్ అతడికి ఫ్యాన్స్ ఆల్? ది బెస్ట్ చెబుతున్నారు.

# యువ ఆటగాళ్లకు అవకాశం లభించింది

**భారత జట్టు చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్**

ఇంగ్లాండ్ పర్యటనకు భారత జట్టును ప్రకటించారు. స్టార్ ఆటగాళ్లు లేకపోవడంతో యువ ఆటగాళ్లకు అవకాశం లభించింది. కానీ కొంత మంది స్టార్ ఆటగాళ్లను కూడా ఇప్పటికీ జట్టులో చేర్చలేదు. శ్రేయస్ అయ్యర్, దేవదత్ పడిక్కల్, మహ్మద్ షమీలకు జట్టులో అవకాశం ఇవ్వలేదు. ఈ ఆటగాళ్లు జట్టులో లేకపోవడానికి గల కారణాన్ని భారత జట్టు చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ మీడియా సమావేశంలో వివరించారు. ఇంగ్లాండ్ తో టెస్ట్ సిరీస్ కోసం కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్‌ను ఎంపిక చేయగా.. వైస్ కెప్టెన్‌గా రిషబ్ పంత్ ను ఎంపిక చేశారు. అనుభవజ్ఞుడైన ఫాస్ట్ బౌలర్ మహ్మద్ షమీ చాలా కాలంగా టెస్ట్ జట్టులో లేడు. 2023లో జరిదిన ప్రపంచ టెస్ట్ ఛాంపియన్ షిప్ ఫైనల్‌లో మహ్మద్ షమీ తన చివరి టెస్ట్ మ్యాచ్ ఆడాడు. ఇంగ్లాండ్ పర్యటనలో మహ్మద్ షమీకి అవకాశం రాలేదనే ప్రశ్నకు అజిత్ అగార్కర్ స్పందిస్తూ.. గత వారం మహ్మద్ షమీకి కొంత ఇబ్బంది ఎదురైందని.. ఈ క్రమంలో షమీ కొన్ని ఎంఆర్ఐలు చేయించుకోవాల్సి వచ్చిందని వెల్లడించారు. మహ్మద్ షమీ 5 టెస్టులు ఆడలేడన్నారు. షమీకి పనిభారం ఉండాల్సినంత ఎక్కువగా ఉందని తాను అనుకోనని.. బయటకు వస్తాడని వైద్యులు చెప్పారన్నారు. షమీ ఏదైనా పాత్ర పోషిస్తాడని తాము ఆశించామన్నారు. కానీ షమీ ఫిట్‌గా లేకుంటే వేచి ఉండటానికి బదులు ఫిట్‌గా ఉన్న, అందుబాటులో ఉన్న ఆటగాళ్లను ఎంచుకుంటామన్నారు.దేశవాళీ క్రికెట్‌లో అద్భుతంగా రాణించిన శ్రేయస్ అయ్యర్‌కు కూడా జట్టులో అవకాశం దక్కలేదు. దీని గురించి అజిత్ అగార్కర్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. అవును శ్రేయస్ అయ్యర్ దేశీయ క్రికెట్‌లో బాగా రాణించాడు. కానీ ప్రస్తుతం శ్రేయస్‌కు జట్టులో చోటు లేదు." అని అన్నారు. అదే సమయంలో ఐపీఎల్‌లో గాయపడిన దేవదత్ పడిక్కల్‌కు కూడా ఈ పర్యటనలో అవకాశం రాలేదు. దేవదత్ పడిక్కల్‌కు ఆస్ట్రేలియా పర్యటనలో ఆడే అవకాశం వచ్చింది. ఈ క్రమంలో పడిక్కల్‌కు అవకాశం వస్తుందని భావించారు. కానీ ఫిట్‌నెస్ సరిగా లేకపోవడం వల్ల అతడిని తొలగించారు.




# విరాట్ అలసిపోయినట్లు అనిపిస్తుంది

**టెస్ట్ ఫార్మాట్ నుంచి చాలా త్వరగా రిటైర్ అయ్యాడు**

**కోహ్లీ రిటైర్మెంట్‌పై వీరేంద్ర సెహ్వాగ్ కీలక ప్రకటన**



టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ టెస్ట్ క్రికెట్ నుంచి రిటైర్మెంట్ తీసుకోవడంపై కొంతమంది అభిమానులకు ఇప్పటికీ నమ్మకం లేదు. చాలా మంది విరాట్ కోహ్లీ తన రిటైర్మెంట్‌ను తిరిగి తీసుకొని టెస్ట్ క్రికెట్‌కు తిరిగి రావాలని కోరుకుంటున్నారు. అదే సమయంలో కొంత మంది మాజీ భారత క్రికెటర్లు కూడా విరాట్ కోహ్లీ కొంచెం ముందుగానే రిటైర్ అయ్యారని భావిస్తున్నారు. ఇందులో వీరేంద్ర సెహ్వాగ్ పేరు కూడా ఉంది. విరాట్ కోహ్లీ రిటైర్మెంట్‌పై వీరేంద్ర సెహ్వాగ్ నుంచి మరోసారి కీలక ప్రకటన వెలువడింది. ఐపీఎల్ 2025లో శుక్రవారం రాత్రి సన్‌రైజర్స్ హైదరాబాద్, ఆర్సీబీ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో విరాట్ కోహ్లీ 43 పరుగుల మంచి ఇన్నింగ్స్ ఆడాడు. దీన్ని చూసిన వీరేంద్ర సెహ్వాగ్ మరోసారి తాను ఇంకా రెండేళ్లు టెస్ట్ క్రికెట్ ఆడగలిగేవాడని అన్నాడు. ఖచ్చితంగా విరాట్ టెస్ట్ ఫార్మాట్ నుంచి చాలా త్వరగా రిటైర్ అయ్యాడని తాను అనుకుంటున్నట్లు చెప్పుకొచ్చాడు. విరాట్ కోహ్లీ తన ఫిట్‌నెస్‌ను గమనిస్తే.. ఇంకా రెండు సంవత్సరాలు సులభంగా ఆడగలిగేవాడని వీరేంద్ర సెహ్వాగ్ అభిప్రాయపడ్డాడు. కానీ ఈ నిర్ణయం వెనుక గల కారణాలను విరాట్ కోహ్లీ మాత్రమే చెప్పగలడని పేర్కొన్నాడు. ఇది కోహ్లీ వ్యక్తిగత నిర్ణయమని లేదా విరాట్ అలసిపోయినట్లు అనిపిస్తుందని సెహ్వాగ్ అన్నాడు. ఐపీఎల్ 2025 తర్వాత టీమిండియా జూన్‌లో ఇంగ్లాండ్‌లో పర్యటించనుంది. భారత్, ఇంగ్లాండ్ 5 మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌కు ముందే విరాట్ కోహ్లీ టెస్ట్ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. మే 12న సోషల్ మీడియాలో ఒక పోస్ట్‌ను షేర్ చేయడం ద్వారా విరాట్ కోహ్లీ టెస్ట్ క్రికెట్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించాడు. విరాట్ కోహ్లీ కంటే ముందు రోహిత్ శర్మ మే 7న సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం ద్వారా ఈ ఫార్మాట్‌కు వీడ్కోలు పలికాడు. ఇద్దరు దిగ్గజాలు వారం వ్యవధిలో రిటైర్మెంట్ ప్రకటించడంతో అభిమానులు చాలా ఆశ్చర్యపోయారు.



# యువరాజ్ సింగ్‌కు కొత్త బాధ్యత

క్రికెట్ లెజెండ్, 2011 ప్రపంచ కప్ విజేత జట్టులోని కీలక సభ్యుడు యువరాజ్ సింగ్ ఇప్పుడు కొత్త ఇన్నింగ్స్ షురూ చేశాడు. ఈసారి యువీ భారత్ తోపాటు ప్రపంచవ్యాప్తంగా క్రీడల వృద్ధిని పునరుజ్జీవింపజేయడం లక్ష్యంగా ప్రోలిథిక్ టాలెంట్ ఏజెన్సీ ప్రైవేట్ లిమిటెడ్ అనే కొత్త అథ్లెట్ నిర్వహణ సంస్థను ప్రారంభించారు. సిక్స్-హిట్స్ పరాక్రమానికి..భారత్ 2011 ప్రపంచ కప్ విజయంలో కీలక పాత్ర పోషించిన యువరాజ్ సింగ్, భారత్ వెలుపల అథ్లెటిక్స్ అభివృద్ధి కోసం ప్రోలిథిక్ టాలెంట్ లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషించనున్నాడు. దీనికోసం ఏజెన్సీ భారత క్రికెట్, ఐపీఎల్ స్టార్ అభిషేక్ శర్మను కూడా ఎంపిక చేసింది. కోచింగ్ ప్రపంచంలో సిక్సర్లు కొట్టనున్న యువరాజ్ సింగ్ కు పెద్ద బాధ్యత అప్పగించింది.ప్రోలిథిక్‌లో మెంటర్‌షిప్ పాత్రలో చేరడం గురించి యువరాజ్ సింగ్ మాట్లాడుతూ, 'నా ప్రయాణాన్ని తిరిగి చూసుకున్నప్పుడు, ఏదైనా క్రీడా కెరీర్‌లో మనుగడ సాగించడానికి, విజయం సాధించడానికి సరైన మార్గదర్శకత్వం, ఫిట్‌నెస్, ఆహారం, మానసిక బలం ఎంత ముఖ్యమో నేను గ్రహిస్తాను. మనం ప్రోలిథిక్ తో చేస్తున్నది నేను ప్రారంభించినప్పుడు నాకు ఉంటే బాగుండు అని నేను కోరుకుంటున్నాను. ఒక బ్రాండ్ మాత్రమే కాకుండా ఒక అథ్లెట్ సమగ్ర అభివృద్ధిని చూసే బృందం. ఈ సహకారం తరువాతి తరాన్ని మానసికంగా మరింత పదునుగా, బలంగా, మరింత సిద్ధంగా ఉండేలా శక్తివంతం చేస్తుందని చెప్పుకొచ్చాడు. ప్రోలిథిక్ ఎఫర్ట్ డైరెక్టర్.. 200 నాటౌట్ సినిమా వ్యవస్థాపకుడు రవి భాగ్‌చంద్కా మాట్లాడుతూ, 'ప్రతి అథ్లెట్‌లోని అత్యుత్తమ ప్రతిభను బయటకు తీసుకురావడానికి మేము సమిష్టిగా కృషి చేస్తున్నందున ఈ వెంచర్ పరివర్తన చెందుతుందని నేను నమ్ముతున్నాను. మనం చేపట్టబోయే ఉత్తేజకరమైన మిషన్ ఖచ్చితంగా గేమ్ ఛేంజర్ అవుతుంది. అబుదాబి %ు%10, మాక్స్ 60 కరేబియన్ టోర్నమెంట్ వంటి అంతర్జాతీయ టోర్నమెంట్లలో పాల్గొన్న న్యూయార్క్ స్ట్రైకర్స్ యజమాని సాగర్ ఖన్నా మాట్లాడుతూ, 'క్రీడలలో రాణించడానికి మద్దతు ఇవ్వడమే మా లక్ష్యం అభిషేక్ వంటి మంచి ప్రతిభ ఉన్న ఆటగాళ్లతో పనిచేయడం మాకు అలా చేయడంలో సహాయపడుతుంది' అని అన్నారు.

# ఆర్సీబీ, ఎస్ఆర్‌హెచ్ కెప్టెన్లపై బీసీసీఐ చర్యలు

**స్లో ఓవర్ రేట్ కారణంగా జరిమానా విధింపు**

ఐపీఎల్ 2025లో శుక్రవారం రాత్రి సన్‌రైజర్స్ హైదరాబాద్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మధ్య మ్యాచ్ జరిగింది. లక్నోలోని ఎకానా స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ 42 పరుగుల తేడాతో విజయం సాధించింది. అయితే సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇప్పటికే ప్లేఆఫ్ రేసు నుంచి నిష్క్రమించినందున ఈ విజయం జట్టుపై ఎటువంటి ప్రభావం చూపదు. మరోవైపు ఓటమి తర్వాత ఆర్సీబీ పాయింట్ల పట్టికలో ఖచ్చితంగా నష్టాన్ని చవిచూసింది. మ్యాచ్ తర్వాత ఆర్సీబీ కెప్టెన్ రజత్ పాటిదార్, సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్ పాట్ కమిన్స్‌పై బీసీసీఐ చర్య తీసుకుంది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ హైదరాబాద్ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 231 పరుగులు చేసింది. సన్‌రైజర్స్ హైదరాబాద్ తరఫున బ్యాటింగ్ చేస్తున్నప్పుడు ఇషాన్ కిషన్ 48 బంతుల్లో 94 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. ఇది కాకుండా అభిషేక్ శర్మ 34 పరుగులు చేశాడు. ఆర్సీబీ తరఫున బౌలర్లలో రొమారియో షెపర్డ్ 2 వికెట్లు పడగొట్టాడు. ఆ తర్వాత ఆర్సీబీ జట్టు 19.5 ఓవర్లలో 189 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఆర్సీబీ తరఫున బ్యాటర్లలో ఫిల్ సాల్ట్ 32 బంతుల్లో అత్యధికంగా 62 పరుగులు చేశాడు. ఇది కాకుండా విరాట్ కోహ్లీ 25 బంతుల్లో 43 పరుగులు చేశాడు. హైదరాబాద్ తరఫున బౌలర్లలో కెప్టెన్ పాట్ కమిన్స్ గరిష్ఠంగా 3 వికెట్లు పడగొట్టాడు.

# టీమ్ ఇండియాకు చివరి ఛాన్స్





ఉమెన్స్ వన్డే వరల్డ్‌కప్‌లో ఉత్కంఠ భరిత వాతావరణం నెలకొంది. ఇప్పటికే మూడు జట్లు సెమీస్ బెర్త్ ఖాయం చేసుకున్నాయి. ఇక మిగిలిన ఒక స్థానం కోసం ఐదు జట్ల మధ్య హోరాహోరీ పోరు సాగుతోంది. ఈ క్రమంలో వరుసగా మూడు పరాజయాలు ఎదుర్కొన్న టీమ్?ఇండియా మహిళల జట్టు తన సెమీస్ అవకాశాలను క్లిష్ట పరిస్థితుల్లోకి నెట్టుకుంది. టీమ్ఇండియా ఇప్పటివరకు ఆడిన 5 మ్యాచ్‌ల్లో 2 గెలిచి, 4 పాయింట్లతో పాయింట్ల పట్టికలో నాలుగో స్థానంలో కొనసాగుతోంది. ఇక ముందున్న రెండు మ్యాచ్‌లు భారత్‌కు అత్యంత కీలకం. అక్టోబర్ 23న న్యూజిలాండ్‌తో, అక్టోబర్ 26న బంగ్లాదేశ్‌తో తలపడనుంది. సెమీఫైనల్ ఆశలను నిలబెట్టుకోవాలంటే ఈ రెండు మ్యాచ్‌ల్లో తప్పక గెలవాల్సిందే! ఒక మ్యాచ్ గెలిచి, మరోదాంట్లో ఓడినా టీమ్ఇండియాకు ఇంకా అవకాశం ఉంది! కానీ అది పూర్తిగా రేసులో ఉన్న ఇతర జట్ల ఫలితాలపై ఆధారపడి ఉంటుంది. ఆ జట్ల కంటే మెరుగైన నెట్ రన్‌రేట్ సాధిస్తేనే భారత్ సెమీస్ బరిలో నిలుస్తుంది. అయితే, రెండు మ్యాచ్‌ల్లోనూ ఓటమి చవిచూస్తే సెమీస్ కల దాదాపు చెదిరినట్టే!ఇక టీమ్ఇండియాకు ఒక్క సానుకూల అంశం ఏంటంటే రన్‌రేట్ పాజిటివ్‌గా ఉండటం. న్యూజిలాండ్ ఇప్పటివరకు ఒకే మ్యాచ్‌లో విజయం సాధించినా, మరో రెండు మ్యాచ్‌ల ఫలితాలు తేలకపోవడంతో వారి ఖాతాలో నాలుగు పాయింట్లు చేరాయి. అయితే కివీస్ తమ తర్వాతి రెండు మ్యాచ్‌ల్లో గెలిస్తే మాత్రం భారత్‌ను వెనక్కి నెట్టి సెమీస్ రేసులో ముందంజలోకి వచ్చేయొచ్చు! సోమవారం బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో శ్రీలంక విజయం సాధించింది. ఈ విజయం త శ్రీలంక ఖాతాలో 4 పాయింట్లు చేరాయి. చివరి మ్యాచ్‌లో పాకిస్థాన్‌పై గెలిస్తే, శ్రీలంక కూడా సెమీస్ రేసులోకి చేరే అవకాశం ఉంది. పాయింట్ల పట్టికలో చివరి స్థానాల్లో ఉన్న బంగ్లాదేశ్, పాకిస్థాన్ జట్లు సెమీస్ రేస్ నుంచి దాదాపు వెలుపలే ఉన్నాయి. ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, దక్షిణాఫ్రికా మాత్రం నాలుగేసి మ్యాచ్‌ల్లో విజయం సాధించి సెమీస్‌కు సులభంగా అడుగుపెట్టేశాయి. టీమ్ఇండియా మహిళా క్రికెట్ జట్టు వరుస మ్యాచ్‌ల్లో ఓటమి గ్యాప్‌లో ఉంది. కానీ, ఆ తప్పుల నుంచి సరైన పాఠం నేర్చుకోవడం లేదు. చివరివరకు పోరాటంలో తడబడుతూ, చేతిలో ఉన్న విజయాలను ప్రత్యర్థులకు ఇచ్చేస్తోంది. గత మూడు మ్యాచ్‌ల్లో కూడా ఇదే దృశ్యం. వన్డే ప్రపంచకప్ కీలక దశ చేరుకోవడం దగ్గరగా ఉన్న సమయంలో, హర్మన్‌ప్రీత్ సేన తక్షణమే వ్యూహాలను మార్చాలి. చివరి వార్షికం వరకు గట్టిగా పోరాటం చేస్తేనే జట్టు విజయాల మార్గంలో అడుగులు వేస్తుంది.

# ఫాస్ట్ ట్రాక్ కోర్టుకు లక్ష్మీనాయుడు హత్యకేసు విచారణ

### నిందితులను కఠినంగా శిక్షించాలని స్పష్టమైన ఆదేశాలు

### శాంతిభద్రతలపై సీఎం చంద్రబాబు సీమక్ష

### నాయుడు కుటుంబానికి రెండెకరాల భూమి..5లక్షల నగదు పరిహారం



అమరావతి,అక్టోబర్ 21 : నెల్లూరు జిల్లా కందుకూరులో జరిగిన లక్ష్మీనాయుడు హత్యను ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రంగా ఖండించారు. శాంతిభద్రతలపై సచివాలయంలో సీఎం సమీక్ష నిర్వహించారు. మంత్రులు అనిత, నారాయణ, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, కందుకూరు ఎమ్మెల్యే, ఉన్నాతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. లక్ష్మీనాయుడు హత్య ఘటన అమానవీయం, అమానుషమన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేసి కేసు విచారణ వేగంగా జరిగేలా చూడాలని ఆదేశించారు. గుడ్లూరు మండలం రాళ్లపాడు గ్రామం ఘటనలో చనిపోయిన తిరుమలశెట్టి లక్ష్మీ నాయుడు కుటుంబానికి ప్రభుత్వం పరిహారం ప్రకటించింది. మృతుని భార్యకు రెండెకరాల భూమితో పాటు రూ.5 లక్షల నగదు, ఇద్దరు పిల్లలకు రెండెకరాల చొప్పున భూమితో పాటు రూ.5లక్షల నగదు ఫిక్సిడ్ డిపాజిట్ చేయాలని ఆదేశించారు. లక్ష్మీనాయుడి పిల్లల్ని చదివించే బాధ్యత ప్రభుత్వం తీసుకుం టుందన్నారు. కారు దాడిలో గాయపడిన పవన్‌కు 4 ఎకరాలు, రూ.5లక్షల నగదు, భార్గవ్‌కు రూ.3లక్షల పరిహారం అందిస్తామని సీఎం ప్రకటించారు. లక్ష్మీ నాయుడు భార్యకు 2 ఎకరాల భూమి, 5 లక్షల నగదు పరిహారం ప్రకటించింది. లక్ష్మీ నాయుడు పిల్లలను చదివించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని సీఎం చంద్రబాబు ప్రకటించారు. కారు దాడిలో గాయపడ్డ పవన్, భార్గవ్‌లకు కూడా పరిహారం ఇవ్వనున్నారు. శాంతిభద్రతలపై సచివాలయంలో సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. సమీక్షలో మంత్రులు అనిత, నారాయణ సహా డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.సమీక్ష సందర్భంగా కందుకూరులో జరిగిన లక్ష్మీనాయుడు హత్యను సీఎం చంద్రబాబు ఖండించారు. ఈ ఘటన అమానుషం, అమానవీయం అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. లక్ష్మీ నాయుడు హత్య కేసు నిందితులకు కఠినంగా శిక్షపడాలని ఆదేశించారు. ప్రత్యేక ట్రైబ్యునల్ ఏర్పాటు చేసి ఈ వ్యవహారంపై వేగంగా దర్యాప్తు చేయాలని మంత్రులకే చెప్పారు. కారు దాడిలో గాయపడ్డ పవన్, భార్గవ్‌కు కూడా పరిహారం అందించాలని సీఎం చెప్పారు. పవన్‌కు 4 ఎకరాల భూమి, రూ.5 లక్షల నగదుతో పాటు ప్రభుత్వమే వైద్య ఖర్చులు భరిస్తుందని సీఎం తెలిపారు. భార్గవ్‌కు రూ.3 లక్షల నగదు, ఆసుపత్రి ఖర్చులు చెల్లించాలని ఆదేశించారు. లక్ష్మీ నాయుడు హత్య కేసు విచారణ వేగంగా జరిగేలా ఫాస్ట్ ట్రాక్ కోర్టుకు అప్పగించారు. కోర్టులో కేసు విచారణ కోసం ప్రత్యేక పీపీని నియమించాలని సీఎం చంద్రబాబు ఆదేశాలు ఇచ్చారు.

## భీమవరం డీఎస్పీ జయసూర్యపై నివేదిక

### తరచూ సివిల్ వివాదాల్లో తలదూర్చడంపై ఆగ్రహం

### ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడిని డిప్యూటి సిఎం పవన్

అమరావతి,అక్టోబర్ 21 : భీమవరం డీఎస్పీ జయసూర్య వ్యవహారాలపై పశ్చిమ గోదావరి ఎస్పీతో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చర్చించారు. సివిల్ తగాదాల్లో తలదూరుస్తున్న డిఎస్పీపై నివేదిక ఇవ్వాలని ఎస్పీని ఆదేశించారు. డీఎస్పీ జయసూర్యపై పవన్ కళ్యాణ్‌కు తరచూ ఫిర్యాదులు వెళ్లాయి. పేకాట శిబిరాలు పెరిగిపోయాయని, సివిల్ వివాదాలలో జయసూర్య జోక్యం చేసుకొంటున్నారని, కొందరి పక్షం వహిస్తూ కూటమి నేతల పేరు వాడుతున్నట్లు పవన్‌కు ఫిర్యాదులు వచ్చాయి. ఈ అంశంపై వెంటనే చర్యలు ఉపక్రమించారు పవన్. పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీతో దీనిపై ఫోన్‌లో చర్చించారు. డీఎస్పీకి సంబంధించిన వ్యవహారంపై పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. డీఎస్పీ జయసూర్యపై వచ్చిన ఫిర్యాదుల విషయాన్ని ప్రస్తావించి అతడి వ్యవహారశైలిపై నివేదిక పంపించాలని ఎస్పీకి పవన్ ఆదేశాలు జారీ చేశారు.అసాంఘిక వ్యవహారాలకు డీఎస్పీ స్థాయి అధికారి అండగా ఉండటాన్ని తీవ్రంగా పరిగణించాలన్నారు. పోలీసులు సివిల్ వివాదాల్లో తలదూర్చకుండా చూడాలని ఎస్పీకి ఉపముఖ్యమంత్రి సూచించారు. ఇలాంటి వ్యవహారాలను కూటమి ప్రభుత్వం ఉపేక్షించదనే విషయాన్ని సిబ్బందికి తెలియజేయాలని తెలిపారు. ప్రజలందరినీ సమదృష్టితో చూసి శాంతి భద్రతలను పరిరక్షించాలని పశ్చిమగోదావరి జిల్లా ఎస్పీకి పవన్ కళ్యాణ్ ఫోన్‌లో ఆదేశాలు జారీ చేశారు.

## మహిళా సాధికారతకు చంద్రబాబ కృషి

### శక్తి యాప్‌తో మహిళల భద్రతకు పెద్దపీట

### పోలీస్ అమరవీరుల సంస్మరణలో హోంమంత్రి అనిత

అమరావతి,అక్టోబర్21 : మహిళా సాధికారత, రక్షణ కోసం సీఎం చంద్రబాబు నాయుడు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని రాష్ట్ర హోమ్ శాఖ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. అందులో భాగంగా శక్తి యాప్‌ను తీసుకు వచ్చామన్నారు. మంగళవారం పోలీసుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా పోలీస్ అమర వీరులకు హోం మంత్రి అనిత ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. డ్రగ్స్, గంజాయి అక్రమ రవాణాను నిరోధించేందుకు ఏర్పాటు చేసిన ఈగల్ టీమ్ సమర్థవంతంగా పని చేస్తుందన్నారు. ఆపరేషన్ సేఫ్ పేరిట విద్యార్థుల్లో అవగాహన పెంచేందుకు చర్యలు చేపట్టామన్నారు. సైబర్ స్టేషన్ల ఏర్పాటు.. సీసీ కెమెరాలు, డ్రోన్లు సైతం ఏర్పాటు చేశామని వివరించారు. రాష్ట్ర ప్రజల భద్రత కోసం సీఎం చంద్రబాబు నాయుడు తీసుకుంటున్న చర్యలపై హోమ్ మంత్రి అనిత ప్రశంసలు కురిపించారు. అంతకు ముందు పోలీస్ అమరవీరులకు సీఎం చంద్రబాబు నాయుడు ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీ డీజీపీ హరీశ్ కుమార్ గుప్తాతోపాటు పలువురు పోలీస్ ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## పోలీసులు లేని సమాజాన్ని ఊహించలేం

### అమరవీరుల సంస్మరణలో సిపి శంఖబ్రత బాగ్చి

విశాఖపట్నం,అక్టోబర్ 21 : పోలీసులు లేని సమాజాన్ని మనం ఊహించలేమని విశాఖ సీపీ శంఖబ్రత బాగ్చిచెప్పుకొచ్చారు.విధి నిర్వహణలో అసువులుబాసిన పోలీస్ అమరవీరులకు జిల్లా కలెక్టర్, సీపీ, ప్రజా ప్రతినిధులు, అధికారులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీ శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ.. మరణింఇన వారికి నివాళిగా పోలీసు అమరవీరుల సంస్మరణ దినం జరుపుకుంటూ వస్తున్నామని గుర్తుచేశారు. సమాజం సురక్షితంగా ఉంది అంటే పోలీసుల కృషి కారణమన్నారు. విపత్తు నిర్వహణ, ఎన్నికల విధి నిర్వహణతో పలు సందర్భాలలో పోలీసులు విశేష సేవలు అందిస్తున్నారని తెలిపారు. విధి నిర్వహణలో పోలీసుల పని తీరును తప్పక కొనియాడాలన్నారు. విశాఖనగరంలోని బీచ్‌రోడ్డులో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్,జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చి, ప్రజా ప్రతినిధులు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు. 2025వ సంవత్సరంలో దేశవ్యాప్తంగా 191 మంది పోలీసులు విధి నిర్వహణలో ప్రాణ త్యాగం చేశారని తెలిపారు. పోలీసుల మౌలిక వసతులకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. పోలీస్ సిబ్బంది సంక్షేమానికి కృషి చేస్తున్నామని వెల్లడించారు. ఆరోగ్య పరిరక్షణ కోసం విశాఖ పోలీసులకు ప్రతి ఏటా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని సీపీ శంఖబ్రత బాగ్చిపేర్కొన్నారు.

## అమరావతి నిర్మాణంలో అమృత్ పథకం

### 281 పనులకు రూ.10,319. 93 కోట్ల నిధులు

### ఆదేశాలు జారీ చేసిన మున్సిపల్ శాఖ

అమరావతి,అక్టోబర్21 : రాజధాని అమరావతి నిర్మాణంతోపాటు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. అందులో భాగంగా పట్టణాలలో తాగునీరు, డ్రైనేజీ సదుపాయాలను మెరుగు పరచడానికి ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. అమృత్ 2.0 పథకం కింద 281 పనులకు రూ.10,319. 93 కోట్ల నిధులు కేటాయిస్తున్నట్లు మున్సిపల్ శాఖ తెలిపింది. ఈ మేరకు మున్సిపల్ పరిపాలన శాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే ఏపీయూఎఫ్ఐడీసీ, పబ్లిక్ హెల్త్, గ్రీన్ బిల్డింగ్స్ కార్పొరేషన్లకు ఈ పనుల నిర్మాణంతోపాటు నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తున్నట్లు జారీ చేసి ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. మరోవైపు ఈ పనులు తీసుకునే సంస్థలు.. ఒప్పందం సమయంలో కొంత మొత్తం సెక్యూరిటీగా చెల్లించాలనే నిబంధనను విధించింది. ఈ పనులు సాగుతున్న సమయంలో ఈ నిధులు కట్ చేయకుండా మాఫీ చేసేందుకు అనుమతి సైతం ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం, పట్టణాల వాటా కోసం అవసరమైన నిధులను సేకరించేందుకు ంఖజఈఎఆఅకి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఇది రాష్ట్ర పట్టణాభివృద్ధి చరిత్రలోనే అతి పెద్ద పెట్టుబడి పెట్టిన ప్రాజెక్ట్‌గా రికార్డుల్లో నమోదవనుంది.అయితే మొత్తం ప్రాజెక్టు ఖర్చులో కేంద్రం రూ. 2, 470 కోట్లు.. రాష్ట్ర ప్రభుత్వం రూ.2, 490 కోట్లు విడుదల చేయను న్నాయి. ఇక ఫైనాన్స్ కమిషన్ నిధులు రూ. 925 కోట్లు విడుదల చేయనుంది. పట్టణాల వాటా రూ. 590 కోట్లుగా నిర్ధారించింది. అంతా కలిపి ప్రాజెక్టు క్యాపెక్స్ రూ.6, 477 కోట్లుగా.. దీనికి 10 ఏళ్ల నిర్వహణ ఖర్చు రూ.1, 499 కోట్లుగా నిర్ణయించింది. క వడ్డీ ఖర్చు కింద రూ. 2,344 కోట్లు భారం పడనుంది. ఈ మొత్తం ప్రాజెక్టు విలువ రూ.10, 319. 93 కోట్లు.

## తొలి మహిళా ప్రధానిగా సనే తకైచి

### ఎన్నుకున్న జపాన్ పార్లమెంట్

టోక్యో,అక్టోబర్21 : జపాన్ తొలి మహిళా ప్రధానిగా అతివాద నేతగా పేరున్న సనే తకైచి ఎన్నికయ్యారు. జపాన్ పార్లమెంట్ మంగళవారం దేశంలోని తొలి మహిళా ప్రధానమంత్రిగా సనే తకైచికి ఎన్నుకుంది. పార్టీలో అంతర్గత విభేదాల నేపథ్యంలో జపాన్ ప్రధానిగా ఉన్న షిగెరు ఇషిబా ఇటీవల తన పదవికి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఈక్రమంలో అధికార లిబరల్ డెమోక్రటిక్ పార్టీ అధ్యక్షురాలిగా సనై తకైచి ఎన్నికయ్యారు. ఇటీవల దేశంలో జరిగిన ఎన్నికల్లో పార్లమెంటు ఎగువ సభలో అధికార పార్టీ మెజార్టీని సాధించలేకపోయింది. దీనికి ముందు దిగువ సభలో కూడా మెజార్టీ కోల్పోయింది. దీంతో ఇషిబాపై ఒత్తిడి పెరగ్గా.. ఆయన తన పదవికి రాజీనామా చేశారు. ఈక్రమంలోనే శనివారం పార్టీలో ఎన్నికలు జరగ్గా.. మాజీ ప్రధాని కుమారుడు షింజిరో కోయిజుమితో పాటు మరో ముగ్గురు అభ్యర్థులను ఓడించి తకైచి విజయం సాధించారు. పార్లమెంట్‌లో జరిగిన ఓటింగ్‌లో లిబరల్ డెమోక్రటిక్ పార్టీ- జపాన్ ఇన్నోవేషన్ పార్టీ కూటమితో.. తకైచికి భారీ మద్దతు లభించింది. దీంతో జపాన్‌కు తొలి మహిళా ప్రధానిగా తకైచి అరుదైన ఘనత సాధించారు. 64 ఏళ్ల తకైచి 1993లో స్వస్థలమైన నారా నుంచి పార్లమెంటుకు ఎన్నికయ్యారు. ఎల్‌డీపీలో ఆర్థిక భద్రత, అంతర్గత వ్యవహారాలు, లింగ సమానత్వ మంత్రితో సహా పలు కీలక పదవుల్లో పనిచేశారు. జపాన్ తొలి మహిళా ప్రధాని ఎన్నికైన సానే తకైచికి ప్రధాని నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. భారత్-జపాన్‌ల ప్రత్యేక వ్యూహాత్మక ప్రపంచ భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడానికి తకైచితో కలిసి పనిచేయడానికి ఎదురుచూస్తున్నట్లు పేర్కొన్నారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం, శ్రేయస్సుల విషయంలో ఇరుదేశాల బంధాలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు.

## అడ్డూఅదుపులేని బంగారం ధరలు

### తులం ధర మరో మూడువేలు పెరుగుదల

హైదరాబాద్,అక్టోబర్21 : దేశీయ విపణిలో బంగారం, వెండి ధరలు మరోసారి భారీగా పెరిగాయి. క్రితం రోజుతో పోలిస్తే పసిడి ధర మంగలశారం దాదాపు రూ.3వేలు పెరిగింది. హైదరాబాద్ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి పుత్తడి ధర రూ.1.34 లక్షలు దాటింది. అటు వెండి ధర కూడా కేజీపై దాదాపు రూ.4వేలు పెరగడం గమనార్హం. హైదరాబాద్‌లో 10 గ్రాముల బంగారం ధర (24 క్యారెట్లు) రూ.1,31,600 పలికింది. మంగళవారం ఆ మొత్తం రూ.1,34,500కు చేరింది. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల పుత్తడి ధర రూ.1,21,000గా ఉంది. మరోవైపు కిలో వెండి ధర సోమవారం రూ.1,67,300 పలికింది. నేడు ఆ ధర రూ.1,71,200కు పెరిగింది. గతవారం రూ.1.85 లక్షల వరకు ఎగబాకిన వెండి ధర ఆ తర్వాత కాస్త తగ్గుతూ వచ్చింది. ఇప్పుడు మళ్లీ గిరాకీ పెరగడంతో బంగారం, వెండి ధరలు మరోసారి పరుగులు పెడుతున్నాయి. అంతర్జాతీయ విపణిలో ఔన్సు బంగారం ధర 4,335 డాలర్లు పలుకుతోంది. ఔన్సు వెండి ధర 51 డాలర్ల పైనే ఉంది. అంతర్జాతీయ మార్కెట్‌లో అనిశ్చితి, రష్యా ఉక్రెయిన్ యుద్ధం, అమెరికా టారిఫ్‌లు, డాలర్ విలువ తగ్గిపోతుండటం వంటి పరిణామాలతో పసిడిలో పెట్టుబడులకు మదుపర్లు మొగ్గుచూపుతున్నారు. ఈటీఎఫ్ (ఎక్స్ఛేంజీ ట్రేడెడ్ ఫండ్స్)లలో, కమొడిటీస్ ఎక్స్ఛేంజీలో గోల్డ్ ఫ్యూచర్స్‌పై పెట్టుబడులు పెడుతూనే ఉన్నారు. ఇక, పలు దేశాల కేంద్ర బ్యాంకులు భారీగా బంగారాన్ని కొనుగోలు చేస్తుండటం కూడా ధరల పెరుగుదలకు కారణమవుతోందని విశ్లేషకులు చెబుతున్నారు. మరోవైపు, రాబోయేది పెళ్లిళ్ల సీజన్. దీంతో బంగారం ధర మరింత పెరిగే అవకాశాలు కన్పిస్తున్నాయి.

## గూగుల్ రాకతో విశాఖకు మహర్దశ

### బిజెపి అధ్యక్షుడు పి వి ఎన్ మాధవ్

విశాఖపట్నం,అక్టోబర్ 21 : గూగుల్ ఎఐ డేటా సెంటర్ ఏర్పాటుతో ప్రపంచం మొత్తం మాట్లాడుకు నే ప్రత్యేక ప్రదేశంగా విశాఖ మారనుందని బిజెపి అధ్యక్షుడు పి వి ఎన్ మాధవ్ అన్నారు. దీనిపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పి వి ఎన్ మాధవ్ ఇవాళ విశాఖపట్నంలో ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా మాధవ్ పలు కామెంట్స్ చేశారు. ప్రపంచం మొత్తం మాట్లాడుకునే ప్రత్యేక ప్రదేశంగా విశాఖ మారిందన్న మాధవ్.. విశాఖ గ్లోబల్ కేపిటల్‌గా మారబోతుందని చెప్పారు. గూగుల్ ఎఐ హబ్ విశాఖకు రావడం గొప్ప పరిణామమని చెప్పిన మాధవ్.. ప్రతిపక్షాలు ప్రగతిని ఓర్వలేక మాట్లాడుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే కుమారుడు ప్రియాంక్ ఖర్గే దిగజారుడు వ్యాఖ్యలు చేస్తున్నారని మాధవ్ విమర్శించారు. ప్రియాంక్ ఖర్గే.. స్కెవింజింగ్, పెరసైట్ పదాలు ఉపయోగించడం దారుణమని మాధవ్ అన్నారు. వైసీపీ విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటును స్వాగతించడం లేదన్నారు. జగన్మోహన్ రెడ్డికి విశాఖకు గూగుల్ పెట్టుబడులు రావడం ఇష్టంలేదనిపిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. 'గూగుల్‌ను స్వాగతిస్తూ జగన్ కనీసం ఒక్క ట్వీట్ కూడా చేయలేదు. గూగుల్ ద్వారా పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు వస్తుంటే వైసీపీ ఎందుకు స్వాగతించడం లేదో సమాధానం చెప్పాలి. ప్రపంచంలో దిగ్గజ సంస్థలకు 40 శాతం సర్వీస్ ప్రొవైడర్లుగా తెలుగువారు ఉన్నారు. విశాఖ కేంద్రంగా యువతకు మంచి అవకాశాలు రాబోతున్నాయి. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత పెట్టుబడులు పెద్ద మొత్తంలో వస్తున్నాయి. సెమి కండక్టర్స్ కు ఏపి కేపిటల్ గా మారబోతుంది. గూగుల్.. అమెరికా వెలుపల పెద్ద మొత్తంలో విశాఖలోనే పెట్టుబడులు పెడుతోంది. విశాఖలో 1.3 లక్షల కోట్లతో గూగుల్ అతిపెద్ద డేటా సెంటర్ ఏర్పాటు చేస్తుంది. విశాఖలో నూతన శకం ప్రారంభం కాబోతుంది. ఇప్పటికే సీపీ డేటా సెంటర్, ఓపెన్ కేబుల్ లాండింగ్ స్టేషన్ కు శంకుస్థాపన చేసుకున్నాము.' అని మాధవ్ చెప్పారు.

## నేటినుంచి చంద్రబాబు దుబాయ్ పర్యటన

### మూడ్రోజులపాటు పారిశ్రామికవేత్తలతో భేటీ

### విశాఖ సిఐఐ సదస్సుకు స్వయంగా ఆహ్వానం

అమరావతి,అక్టోబర్ 21 : నేటినుంచి మూడు రోజుల పాటు యూఏఈలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటించనున్నారు. పెట్టుబడుల సాధన కోసం యూఏఈలో ముఖ్యమంత్రి బృందం పర్యటన చేపట్టనుంది. వచ్చే నెల 14-15వ తేదీల్లో విశాఖలో జరగనున్న పార్టనర్షిప్ సమ్మిట్‌కు వివిధ సంస్థల ప్రతినిధులను చంద్రబాబు స్వయంగా ఆహ్వానించనున్నారు. మూడు రోజుల పర్యటన కోసం బుధవారం ఉదయం 10 గంటలకు హైదరాబాద్ నుంచి సీఎం చంద్రబాబు దుబాయ్ వెళ్లనున్నారు. 3 రోజుల్లో వివిధ అంతర్జాతీయ సంస్థల యాజమాన్యాలు, ప్రతినిధులతో వన్ టు వన్ మీటింగులకు ముఖ్యమంత్రి హాజరు కానున్నారు. పారిశ్రామికవేత్తలతో పాటు యూఏఈకి చెందిన ప్రభుత్వ ప్రతినిధులతోనూ భేటీ కానున్నారు. రేపు దుబాయ్‌లో సిఐఐ రోడ్ షో కార్యక్రమంలో చంద్రబాబు పాల్గొనున్నారు. దుబాయ్‌లో మూడవ రోజు ఏపి ఎన్÷-ఆర్‌టి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలుగు డయాస్పోరా సమావేశంలో పాల్గొనున్నారు. తొలి రోజు పర్యటనలో భాగంగా 22వ తేదీ ఐదు కంపెనీలకు చెందిన పారిశ్రామికవేత్తలతో సీఎం భేటీ కానున్నారు. శోభా గ్రూప్, షరాఫ్ డీజీ, ట్రాన్స్ వరల్డ్ గ్రూప్, లూథా గ్రూప్, దుబాయ్ ఫ్యూచర్ ఫౌండేషన్ సంస్థలకు చెందిన ప్రతినిధులతో రేపు సీఎం చంద్రబాబు సమావేశం కానున్నట్లు తెలుస్తోంది. ఇండస్ట్రియల్, ఐటీ పార్కులు, లాజిస్టిక్స్, వేర్ హౌసింగ్ సదుపాయాలు, పోర్టులు-షిప్ మేనేజ్మెంట్ వంటి రంగాల్లో పెట్టుబడులపై ఆయా సంస్థల ప్రతినిధులతో చంద్రబాబు చర్చించనున్నారు. అంతేకాకుండా, పర్యటనలో ముఖ్యమంత్రి చంద్రబాబు బృందం పలు ప్రాంతాలను సందర్శించనుంది. చంద్రబాబుతో పాటు దుబాయ్ పర్యటనలో మంత్రులు టిజి భరత్, బిసి జనార్థన్ రెడ్డి, సీఎం సెక్రటరీ కార్తికేయ మిశ్రా, ఇండస్ట్రీస్ సెక్రటరీ యువరాజ్, ఏపీ ఇడీబీ సీఈఓ సాయికాంత్ వర్మ, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ సీఈఓ ధాత్రి రెడ్డి పాల్గొననున్నారు. నవంబర్‌లో నిర్వహించే విశాఖ పార్టనర్షిప్ సమ్మిట్‌ను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ప్రభుత్వం.. పారిశ్రామిక వేత్తలను ఆకట్టుకునేందుకు ఇప్పటికే సింగపూర్, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో సీఎం చంద్రబాబు, నారా లోకేష్ రోడ్ షోలు నిర్వహించారు.

## పాములవాగు వంతెన పునరుద్ధరణ

కామారెడ్డి,అక్టోబర్21 : ఇటీవల భారీ వర్షాలతో వచ్చిన వరదలకు కొట్టుకు పోయిన వంతెన పునరుద్ధరించారు. దీంతో వంతెనపై మళ్లీ రాకపోకలు ప్రారంభం అయ్యాయి. పాములవాగు వంతెన పనులు పూర్తి చేసి ఎల్లారెడ్డి నుంచి కామారెడ్డి వైపునకు బస్సులను అధికారులు మంగళవారం ప్రారంభించారు. ఎల్లారెడ్డి నుంచి కామారెడ్డి జిల్లా కేంద్రానికి బస్సులు వెళ్లే మార్గంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా పాములవాగు వంతెన కొట్టుకపోయింది.

## డిప్యూటి సిఎం డికెతో కిరణ్ మజుందార్ షా భేటీ

### మేనల్లుడి వివాహానికి ఆహ్వానం అదచేత

బెంగళూరు,అక్టోబర్21 : భారత సిలికాన్ వ్యాలీగా అభివర్ణించే బెంగళూరులో రోడ్ల దుస్థితిపై పారిశ్రామికవేత్తల విమర్శలు, నేతల వ్యంగ్యాస్త్రాలతో ఇటీవల కర్ణాటకలో రాజకీయ దుమారం రేగిన సంగతి తెలిసిందే. ఈ వివాదం కొనసాగుతోన్న వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో బయోకాన్ లిమిటెడ్ వ్యవస్థాపకురాలు కిరణ్ మజుందార్ షా మంగళవారం భేటీ అయ్యారు. ఉదయం డిప్యూటీ సీఎం నివాసానికి వచ్చిన కిరణ్ మజుందార్ షా.. తన మేనల్లుడి వివాహానికి డీకేను ఆహ్వానించారు. అంతకుముందు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య నివాసానికి వెళ్లి ఆయనను కూడా పెళ్లికి ఆహ్వానించినట్లు కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి. శివకుమార్‌తో భేటీ అనంతరం కిరణ్ మజుందార్ షా మీడియాతో మాట్లాకుండానే అక్కడి నుంచి వెళ్లిపోయారు. కాసేపటికి ఈ సమావేశం గురించి డీకే తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. బెంగళూరు పురోగతి, సృజనాత్మక, రాష్ట్ర అభివృద్ధి మార్గాలపై ఆమెతో చర్చించి నట్లు డీకే వెల్లడించారు. గత కొంతకాలంగా బెంగళూరు రోడ్ల పరిస్థితిపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో బయోకాన్ పార్క్‌కు వచ్చిన ఓ విదేశీ విజిటర్.. నగరంలోని రోడ్లు, చెత్తపై చేసిన వ్యాఖ్యలతో తాను ఇబ్బందిపడ్డానని కిరణ్ మజుందార్ షా ఓ పోస్టులో వెల్లడించారు. ఇది కాస్తా వైరల్‌గా మారింది. దీనిపై కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ వ్యంగ్యంగా బదులిచ్చారు. ఆమె రోడ్లను అభివృద్ధి చేయాలనుకుంటే చేయొచ్చన్నారు. అందుకోసం నిధులు కూడా ఇస్తామన్నారు. వ్యక్తిగత అజెండాతోనే ఆమె ఈ విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. దీంతో ఆమెకు పలువురు పారిశ్రామికవేత్తలు మద్దతుగా నిలిచారు. సమస్యకు పరిష్కారం వెతకడం మాని రాజకీయాలు చేస్తున్నారంటూ హర్ష్ గొయెంకా అసహనం వ్యక్తంచేశారు. బెంగళూరు కోసం గళమెత్తే వారిపై దాడులు చేసే ట్రెండ్ సరికాదని, దాన్ని మానుకోవాలని ఇన్ఫోసిస్ మాజీ సీఎఫ్ఓ మోహన్‌దాస్ పాయ్ ఓ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో అన్నారు.

## ఆపరేషన్ సిందూర్‌కు శ్రీరాముడే స్ఫూర్తి

### ఆయోధ్యలో రామాలయం తరవాత రెండో దీపావళి

### ప్రజలకు దీపావళి శుభాకాంల్లో మోడీ ప్రస్తావన

న్యూఢిల్లీ,అక్టోబర్21 : దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రజలను ఉద్దేశిస్తూ.. ప్రధాని నరేంద్ర మోదీ ఓ లేఖ రాశారు. ఈ సందర్భంగా దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన ఆయన.. ఆపరేషన్ సిందూర్ కు శ్రీరాముడే స్ఫూర్తి అని పేర్కొన్నారు. ఈ ఆపరేషన్ భారత ధర్మాన్ని కాపాడటంతో పాటు.. పహల్గాంలో జరిగిన ఉగ్రదాడికి ప్రతీకారం తీర్చుకుందన్నారు. 'అయోధ్యలో రామాలయం నిర్మించిన తర్వాత ఇది రెండో దీపావళి. ధర్మాన్ని కాపాడాలని శ్రీరాముడు మనకు బోధించాడు. అన్యాయాన్ని ఎదుర్కొనే ధైర్యాన్ని ఇస్తాడు. కొన్ని నెలల క్రితం మనం చేపట్టిన ఆపరేషన్ సిందూరే దీనికి ఉదాహరణ. మనం భారత ధర్మాన్ని కాపాడటంతో పాటు ఉగ్రదాడికి ప్రతీకారం తీర్చుకున్నాం. ఈ దీపావళికి మరో ముఖ్యమైన ప్రత్యేకత ఉంది. మావోయిస్టుల నుంచి విముక్తి పొందిన అనేక జిల్లాలతో పాటు మారుమూల ప్రాంతాల్లో కూడా దీపావళి వెలుగులు నిండాయి. మన దేశ రాజ్యాంగంపై విశ్వాసంతో అనేకమంది హింసా మార్గాన్ని విడిచిపెట్టి.. జన జీవన స్రవంతిలోకి వచ్చిన అనేకమందిని మనం ఇటీవల చూశాం అని పేర్కొన్నారు. ఇది దేశానికి ఇది ఒక గొప్ప విజయం అని పేర్కొన్నారు. ఈసందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఇటీవల జీఎస్టీ రేట్లను తగ్గించిన విషయాన్ని కూడా ప్రస్తావించారు. ఈ జీఎస్టీ రేట్ల తగ్గింపు కారణంగా ప్రజలకు పెద్ద మొత్తంలో లబ్ది చేకూరుతుందన్నారు. ఇక, పౌరులు స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించాలని మోదీ పిలుపునిచ్చారు. అన్ని భాషలను గౌరవించాలన్నారు. ప్రతిఒక్కరూ పరిశుభ్రతను పాటించాలన్నారు. మనం తీసుకునే ఆహారంలో నూనె వాడకాన్ని 10 శాతం తగ్గించి.. యోగాను ఆచరిద్దామన్నారు. ఈ ప్రయత్నాలన్నీ.. మనల్ని వికసిత్ భారత్ వైపు నడిపిస్తాయన్నారు. శక్తి, ఉత్సాహం నిండిన ఈ పండగ వేళ.. దేశ పౌరులందరికి ఆయన దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు మంగళవారం దేశ పౌరులను ఉద్దేశించి ప్రధాని నరేంద్ర మోదీ లేఖ రాశారు. దసరా నవరాత్రులు ప్రారంభ వేళ.. జీఎస్టీ ధరలను భారీగా తగ్గించామన్నారు. ఇదంతా భవిష్యత్తు తరం కోసం సంస్కరణలలో భాగంగా వీటిని చేపట్టామన్నారు. ఈ సంస్కరణల కారణంగా దేశంలోని పౌరులకు రూ. వేల కోట్లు ఆదా చేయడానికి దోహదపడుతుందని తెలిపారు. అంతే కాకుండా ఈ నిర్ణయం జీవితాన్ని సులభతరం చేయడంతోపాటు ఆర్థిక వృద్ధిని పెంచుతుందన్నారు. ఇక భారత్, ఉత్తమ భారత్ స్ఫూర్తిని నిలబెట్టడం కోసం స్వదేశీ వస్తువులను కొనుగోలు చేయాలని ఈ సందర్భంగా దేశ ప్రజలకు ప్రధాని మోదీ విజ్ఞప్తి చేశారు. అన్ని భాషల పట్ల గౌరవం పెంపొందించుకోవాలని సూచించారు. అలాగే ఆరోగ్యంపై అవగాహన సైతం కల్పించుకోవాలని కోరారు.

## పోలీస్ క్రికెట్ టీమ్‌కు పైటిల్

హైదరాబాద్,అక్టోబర్ 21 : ఛామల ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎలైట్ క్రికెట్ లీగ్ టోర్నమెంట్ ట్రోఫీ ని పోలీస్ క్రికెట్ టీం గెలుపొందింది. అక్టోబర్ 9,10 తేదీల్లో ఉప్పల్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం లో జరిగిన ఈ టోర్నమెంట్ ఫైనల్‌లో టాలి వుడ్ టీం పై పోలీస్ క్రికెట్ టీం విజేతగా నిలిచింది. విన్నర్ టీమ్ కు లభించిన ఐదు లక్షలు, రన్నర్ టీమ్ కు లభించిన 3 లక్షల రూపాయల నగదు బహుమతిని పోలీసు అమరవీరుల సంస్మరణ దినం పురస్కరించుకొని పోలీసు సంక్షేమ నిధికి అందచేస్తూ ఈ చెక్కును రాష్ట్ర ప్రభుత్వ హోమ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సీవీ ఆనంద్ కు నేడు సచివాలయంలో నిర్వాహకులు అందచేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ క్రికెట్ టీమ్ సభ్యులతో పాటు, బీసీసీఐ, ప్రణవ గ్రూప్ ప్రతినిధులు పాల్గొన్నారు.



# మళ్లీ అవకాశాలు అంగీకరిస్తున్నా

## నటి రేణూదేశాయ్ వెల్లడి

ఒకప్పుడు కథానాయికగా తెలుగు ప్రేక్షకులకు సుపరిచితమైన రేణూ దేశాయ్ దాదాపు 20 ఏళ్ల తర్వాత రవితేజ 'టైగర్ నాగేశ్వరరావు'లో కనిపించిన సంగతి తెలిసిందే. సంఘ సంస్కర్త హేమలతా లవణం పాత్రని పోషించారు. అయితే, ఆ సినిమా సమయంలో తనపై కొన్ని విమర్శలు వచ్చాయని తాజాగా ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. ఆ ట్రోల్ చేసినవారు ఎవరూ తర్వాత తనకు క్షమాపణలు చెప్పలేదన్నారు. 'నేను 'టైగర్ నాగేశ్వరరావు' చేసిన సమయంలో నాపై విమర్శలు వచ్చాయి. కమ్‌బ్యాక్ ఇచ్చింది.. ఇక ఎక్కడ చూసినా కనిపిస్తుంది. ఎలాంటి సినిమాల్లోనైనా నటిస్తుందని రాశారు. ఇప్పుడు ఆ సినిమా వచ్చి రెండేళ్లు అవుతోంది. ఇప్పటివరకూ నేను మళ్లీ స్క్రీన్‌పై కనిపించలేదు. ఏ సినిమాకు సైన్ చేయలేదు. నేను సినిమాలు అంగీకరించలేదని నా గురించి అలా మాట్లాడిన వాళ్లు ఇప్పుడు వచ్చి క్షమాపణలు చెప్పరు. మాట్లాడేవారు ఎలాగైనా మాట్లాడతారంతే. నాకు నటన అంటే చాలా ఇష్టం. కానీ, అదే నా లక్ష్యం కాదు. 15 ఏళ్ల వయసులోనే ఇండస్ట్రీకి వచ్చాను. నేను డబ్బుకు ప్రాధాన్యం ఇచ్చే మనిషిలా కనిపిస్తాను. డబ్బును జాగ్రత్తగా ఖర్చు చేస్తాను.. కానీ, దానికి ప్రాధాన్యం ఇవ్వను. ఒకవేళ నేను అప్పటినుంచి ఇప్పటి వరకూ సినిమాలు చేస్తూ ఉన్నట్లైతే ఇప్పటికి చాలా మంచి పేరు వచ్చేదని రేణు చెప్పారు. తనకు ఇప్పుడు గొప్ప పాత్రలు వస్తున్నాయన్నారు. మహిళా ప్రాధాన్యం ఉన్న చిత్రాల్లో ఛాన్స్‌లు వస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం అత్తగారి పాత్రకు ఓకే చేసినట్లు చెప్పారు. త్వరలోనే ఆ సినిమా ప్రారంభం కానుందన్నారు. అత్తాకోడళ్లకు సంబంధించిన కామెడీ చిత్రంగా అది రానున్నట్లు వెల్లడించారు. తనకు ఆధ్యాత్మిక మార్గం అంటే ఇష్టమని.. భవిష్యత్తులో సన్యాసం తీసుకునే అవకాశం ఉందని రేణూ దేశాయ్ చెప్పారు.



# దడక్ సీక్వెల్‌లో త్రిప్తి డిమ్రి

మరాఠిలో సూపర్ హిట్ అయిన సినిమా సైరాత్. రెండు వేరు వేరు కులాల మధ్య జరిగిన ప్రేమ కథగా వచ్చిన ఈ సూపర్ హిట్ సినిమా అనేక భాషల్లో రీమేక్ అయి హిట్ అయింది. అలా బాలీవుడ్ లోను దడక్ పేరుతో రీమేక్ చేసారు. శశాంక్ ఖైతాన్ దర్శకత్వంలో ఇషాంత్ కట్టర్ హీరో గా నటించగా ప్రముఖ నిర్మాత కరణ్ జోహార్ నిర్మించగా అజయ్, అతుల్ సంగీతం అందించారు. అలనాటి అందాల తార శ్రీదేవి కుమార్తె జాన్వీ కపూర్ ఈ సినిమాతోనే సిల్వర్ స్క్రీన్ ఎంట్రీ- ఇచ్చింది. అయితే ఇప్పుడు ఈ సినిమాకు స్వీక్వెల్ గా దఢక్ 2 ను వస్తోంది. అయితే తీసిందే రీమేక్ సినిమా దానికి మళ్ళి సీక్వెల్, ఏంటో బాలీవుడ్ మేకర్స్ వెర్రి అనే కామెంట్స్ చేస్తున్నారు నెటిజన్స్. సరైన కథలు లేక ఇలా రీమేక్స్ తో గడిపేస్తున్నారు అని టాక్ వినిపిస్తోంది. పోనీ సీక్వెల్ ను అయినా ఫస్ట్ పార్ట్ లో నటించిన వారితో చేస్తున్నారా అంటే అది లేదు. సిద్ధాంత్ చతుర్వేది హీరోగా యానిమల్ ఫెమ్ త్రిప్తి డిమ్రి హీరోయిన్ గా తెరకెక్కుతోంది దఢక్ 2. అందుకు సంబందించి ఫస్ట్ లుక్ పోస్టర్ ను కూడా రిలీజ్ చేసారు. ఈ సీక్వెల్ కు సాజిద్ ఇక్బాల్ దర్శకత్వం వహిస్తుండగా ధర్మ ప్రొడక్షన్స్ బ్యానర్ పై కరణ్ జోహార్ నిర్మిస్తున్నాడు. జీ స్టూడియోస్ సమర్పణలో వస్తున్న ఈ సినిమా ట్రైలర్ ఈ నెల 11న రిలీజ్ కానుంది. అలాగే ఈ ఏడాది ఆగస్టు 1న రిలీజ్ కాబోతుంది




# నవీన్ పోలిశెట్టి..అనగనగా ఒక రాజు

జాతిరత్నాలు తరువాత మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి సినిమాతో వచ్చాడు. ఇక ఈ సినిమా మంచి విజయాన్ని అందుకుంది. ఇక దాని తరువాత నవీన్ నటిస్తున్న చిత్రం అనగనగా ఒక రాజు. కొన్ని కారణాల వలన ఆగుతూ వచ్చింది. మారి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను సితార ఎంటర్ టైన్మెంట్స్ బ్యానర్ పై సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్నాడు. మొదట ఈ చిత్రంలో శ్రీలీల హీరోయిన్ గా నటిస్తుంది అని చెప్పారు. ఆ తరువాత ఆమె ప్లేస్ ను మీనాక్షీ చౌదరి రీప్లేస్ చేసింది. ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజైన పోస్టర్స్, వీడియోలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఇక నవీన్ తన సినిమాకు ఏ రేంజ్ లో ప్రమోషన్స్ చేస్తుందో అన్న విషయం అందరికీ తెల్సిందే. ముఖ్యంగా అనగనగా ఒక రాజు సినిమా ప్రమోషన్స్ భాద్యత మొత్తం నవీన్ తన భుజాల మీద వేసుకున్నాడు. ప్రతి పండగకు అందరూ తమ సినిమావైపు తిరిగి చూసేలా ప్రమోషన్స్ చేస్తాడు. మొన్న దసరాకు పల్లెటూరు వెళ్ళి అక్కడున్నవారితో సినిమా గురించి మాట్లాడి దసరా శుభాకాంక్షలు చెప్పించాడు. ఇప్పుడు దీపావళీకి కూడా మరో కొత్త కాన్సెప్ట్ తో వచ్చేశాడు. దీపావళీ టపాకాయలు అమ్ముతూ తన సినిమా గురించి చెప్పుకొచ్చాడు. అనగనగా ఒక రాజు ఫుల్ ఎంటర్ టైన్మెంట్. దీపావళీ నుంచి సంక్రాంతి వరకు ఇది పేలుతూనే ఉంటుందని చెప్పుకొచ్చాడు. అంతేకాకుండా అనగనగా ఒక రాజు నుంచి మొదటి సాంగ్ ను త్వరలోనే రిలీజ్ కానుందని మేకర్స్ తెలిపారు. ప్రస్తుతం ఈ వీడియో నెట్టింట వైరల్ గా మారింది. ఇక ఈ ప్రమోషన్స్ చూసి .. నిజంగా నవీన్ జాతిరత్నం అంటూ కామెంట్స్ చేస్తున్నారు. సంక్రాంతి కానుకగా జనవరి 14 న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. మరి ఈ సినిమాతో రాజుగారు ఎలాంటి విజయాన్ని అందుకుంటుందో చూడాలి.



# సుజీత్ -దానయ్యల మధ్య విభేదాలు

## పోస్ట్‌తో ఫుల్‌స్టాప్ పెట్టిన సుజీత్

బాక్సాఫీసు వద్ద సందడి చేసిన 'ఓజీ' సినిమా ఓటీటీ నెట్‌ఫ్లిక్స్‌లో ఈ నెల 23 నుంచి స్ట్రీమింగ్ కానున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో.. దర్శకుడు సుజీత్ సోషల్ మీడియాలో మంగళవారం పోస్టు చేసిన ఓ నోట్ వైరల్‌గా మారింది. 'ఓజీ' విషయంలో తనను నమ్మి, ఎంతగానో సపోర్ట్ చేశారంటూ నిర్మాత డీవీవీ దానయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. ఓజీ' గురించి చాలామంది ఏదేదో మాట్లాడుతున్నారు. కానీ, సినిమాని ప్రారంభం నుంచి పూర్తయ్యే వరకూ ఏం అవసరమనేది కొందరు మాత్రమే అర్థం చేసుకుంటారు. నా నిర్మాత, టీమ్ ఇచ్చిన మద్దతు గురించి మాటల్లో చెప్పలేనని పేర్కొన్నారు. సుజీత్ సడెన్‌గా ఈ పోస్టు పెట్టడంపై నెట్టింట చర్చ జరుగుతోంది. నిర్మాత దానయ్య, సుజీత్‌కు నిర్మాణ పరంగా విభేదాలు తలెత్తాయని ఇటీవల రూమర్స్ వచ్చాయి. దానిపైనే ఆయన ఇలా రియాక్ట్ అయి ఉంటారని కొందరు అభిప్రాయపడుతున్నారు. 'ఓజీ' చిత్రీకరణ దశలోనే.. నాని హీరోగా సుజీత్ ఓ చిత్రాన్ని ప్రకటించిన సంగతి తెలిసిందే. 'ఓజీ' ప్రొడక్షన్ హౌస్ డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపైనే దాన్ని రూపొందిస్తున్నట్టు తెలిపారు. కానీ, నిహారిక ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై కొన్ని రోజుల క్రితం లాంఛనంగా ప్రారంభమైంది. దీంతో, దానయ్య- సుజీత్‌ల మధ్య దూరం ఏర్పడిందంటూ వార్తలొచ్చాయి.



# నిర్మాతగానూ సక్సెస్ అందుకుంటున్న నాని

నటుడిగా మాత్రమే కాదు, నిర్మాతగా కూడా దూసుకుపోతున్నాడు నాని. నాని నిర్మించిన ప్రతీ సినిమా ఒక ప్రత్యేకతను కలిగి ఉండడంతో నిర్మాతగా ఆయన తీసే సినిమాలపై కూడా ప్రేక్షకులలో ఆసక్తి నెలకొంది. ఇటీవల 'కోర్ట్' మరియు 'హిట్ 3' వంటి సినిమాలతో నిర్మాతగా నాని భారీ విజయాలు అందుకున్నాడు. ముఖ్యంగా హిట్ ఫ్రాంఛైజీ తన ప్రొడక్షన్ హౌస్ నుంచే కొనసాగుతుండటం గమనార్హం. ఈ రెండు సినిమాలు బాక్సాఫీస్ వద్ద మంచి కలెక్షన్లు సాధించాయి. అయితే ఈ ఫేజ్‌లో నటుడిగా కన్నా నిర్మాతగా నాని ఎక్కువ సక్సెస్‌లో ఉన్నాడన్నది పరిశ్రమలో చర్చనీయాంశంగా మారింది. నాని సినిమా ఎంపికలో తన టేస్ట్‌కి తగిన కథలనే సెలెక్ట్ చేస్తాడు. కథను నిర్మాతగా కాకుండా, ఒక సాధారణ ప్రేక్షకుడిగా వినడం వల్లే అతడి జడ్జ్‌మెంట్ నూరుకి నూరుపాళ్లు సక్సెస్ అవుతుంది. 'అ!' సినిమాతో నిర్మాతగా తన ప్రయాణాన్ని ప్రారంభించిన నాని, తాజాగా హిట్ సినిమాతో తన స్థాయిని పెంచుకున్నాడు. నాని ..శ్రీకాంత్ ఓదెల డైరెక్షన్‌లో చిరంజీవితో ఓ భారీ సినిమాను ప్రొడ్యూస్ చేయడానికి సిద్ధమవుతున్నాడు. ఇది అధికారికంగా ప్రకటించనప్పటికీ, ఇండస్ట్రీ వర్గాల్లో ఈ ప్రాజెక్ట్ గురించి జోరుగా చర్చ నడుస్తుంది..అయితే ఈ ప్రాజెక్టు కన్నా ముందు ఒక చిన్న బడ్జెట్ సినిమా కూడా నాని నిర్మాణంలో రాబోతున్నట్టు- సమాచారం. అయితే, దాని వివరాలు ఇంకా బయటకు రాలేదు. నటుడిగా నాని ప్రస్తుతం శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో 'ప్యారడైజ్' అనే సినిమా చేస్తున్నాడు. తర్వాత సుజిత్ డైరెక్షన్‌లో మరో భారీ సినిమాకు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు. నాని నిర్మాతగా తీసే ప్రతి ప్రాజెక్ట్‌కి తన మార్క్ టచ్ ఇవ్వడం, కాస్టింగ్ నుంచి క్రూ సెలెక్షన్ వరకు ప్రతీ స్టెప్‌లోను తగు జాగ్రత్తలు తీసుకోవడం వల్లే ఆయన నిర్మాణంలో వస్తున్న సినిమాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి.




# మీతో స్క్రీన్ షేర్ చేసుకోవడం అదృష్టం

ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ ప్రియులు ఎదురుచూస్తున్న చిత్రాల్లో 'వార్ 2'ఒకటి. అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో రానున్న ఈ సినిమాలో హృతిక్ రోషన్, ఎన్టీఆర్ (కి) ప్రధాన పాత్రల్లో నటించారు. కియారా అద్వాణీ హీరోయిన్‌గా కనిపించనున్నారు. తాజాగా ఆమె ఈ సినిమాపై పోస్ట్ పెట్టారు. ప్రపంచం దీన్ని ఎప్పుడు చూస్తుందా అని ఆసక్తిగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఇటీవల ఈ సినిమా షూటింగ్ పూర్తయినట్లు- తెలుపుతూ తారక్, హృతిక్‌లు పోస్ట్‌లు పెట్టారు. అందులో హృతిక్ పోస్ట్‌ను షేర్ చేసిన కియారా..ఈ సినిమా విషయంలో మీరెంత ఆసక్తిగా ఉన్నారో నేనూ అలానే ఉన్నాను. మీతో కలిసి స్క్రీన్ షేర్ చేసుకోవడం ఎప్పటికీ మర్చిపోలేని అనుభవం. ఎన్టీఆర్‌తో కలిసి అయాన్ ముఖర్జీ సృష్టించిన అద్భుతాన్ని ప్రపంచం ఎప్పుడు చూస్తుందా అని ఎదురుచూస్తున్నాను. మన టీ-మ్ మొత్తం ఈ సినిమాకు ప్రాణం పోసిందని రాసుకొచ్చారు. ఇటీవల ఈ సినిమాపై పోస్ట్ పెట్టిన ఎన్టీఆర్.. హృతిక్ ఎనర్జీ తననెంతో ఆకర్షించిందని తెలిపారు. ఈ సినిమా షూటింగ్ సమయంలో ఎన్నో విషయాలు నేర్చుకున్నట్లు- చెప్పారు.

# రాజ్ నిడుమోరుతో సమంత దీపావళి

నటి సమంత, బాలీవుడ్ దర్శకుడు రాజ్ నిడిమోరు డేటింగ్‌లో ఉన్నట్లు కొంతకాలంగా వార్తలు వస్తున్నాయి. ఆ వార్తలకు మరింత ప్రాధాన్యం చేకూర్చేలా తాజాగా రాజ్‌తో కలిసి సమంత దీపావళిని సెలబ్రేట్ చేసుకున్నారు. రాజ్ నిడిమోరు కుటుంబంతో కలిసి ఆమె దిగిన ఫొటోలు ప్రస్తుతం వైరల్‌గా మారాయి. బాణసంచా కాలుస్తోన్న ఫొటోలను షేర్ చేసిన సామ్.. 'నా హృదయం కృతజ్ఞతతో నిండిపోయింది' అని క్యాప్షన్ పెట్టారు. తరచూ వీరిద్దరూ కలిసి కనిపిస్తుండడంతో ఆ ఫొటోలు నెటిజన్‌లను ఆకర్షిస్తున్నాయి. రాజ్–డీకే సంయుక్తంగా తెరకెక్కించిన 'ది ఫ్యామిలీ మ్యాన్ సీజన్ 2', 'సిటడెల్: హనీ బన్నీ'లో సమంత నటించారు. ఆ సమయంలోనే రాజ్‌తో ఆమెకు పరిచయం ఏర్పడింది. వీరిద్దరూ డేటింగ్‌లో ఉన్నట్లు వార్తలు వస్తున్నప్పటికీ.. అధికారికంగా ఎక్కడా స్పందించలేదు. ఇక సినిమాల విషయానికొస్తే.. ఎన్నో రోజులుగా ఆమె అభిమానులు ఎదురుచూస్తోన్న 'మా ఇంటి బంగారం' త్వరలోనే ప్రారంభం కానుంది. దీనికి నందినిరెడ్డి దర్శకత్వం వహించనున్నారని సమాచారం. దీనితో పాటు 'రక్త్ బ్రహ్మాండ్: ది బ్లడీ కింగ్‌డమ్' ప్రాజెక్టులో సమంత ప్రస్తుతం నటిస్తున్నారు.



Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com